epaper.vaartha.com
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
WWW.VAARTHA.COM
: fb.com/vaartha
తాడేపల్లిగూడెం
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
23-1-2025 గురువారం సంపుటి: 30
సంచిక: 355 పేజీలు: 10+4 వెల: 6.50

## హైకోర్టు జడ్జిలుగా హరిహరనాథశర్మ, లక్ష్మణరావు





**విజయవాడ,జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులుగా జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు లను కేంద్రన్యాయశాఖ నియమించింది. తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు పలువురు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను >>2

# గూగుల్ క్లౌడ్ విస్తరణ!




బుధవారం దావోస్‌లో గూగుల్ క్లౌడ్ సిఇఒ థామస్ కురియన్‌తో సిఎం చంద్రబాబు భేటీ దృశ్యం

### విశాఖలో డిజైన్ కేంద్రం ఏర్పాటుకు గూగుల్ క్లౌడ్ సిఇఒ థామస్ కురియన్‌తో సిఎం చంద్రబాబు భేటీ

### పెప్సికో ప్రతినిధులతోనూ సిఎం చర్చలు

**విజయవాడ,జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** సర్వర్‌ల కోసం సొంత చిప్‌లను రూపొందిస్తున్న గూగుల్ విశాఖ పట్నంలో డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గూగుల్ క్లౌడ్ సిఇఒ థామస్ కురియన్‌ను కోరారు. గూగుల్ క్లౌడ్ తన సర్వర్ సప్లై చైన్ అనుసంధానించేలా తయారీ యూనిట్‌ను ఏపీలో నెలకొల్పాలని థామస్ కురియన్‌కు ముఖ్యమంత్రి కోరారు. సర్వర్ నిర్వహణ సేవల విషయంలో ఎపిని ప్రధాన కేంద్రంగా చేసుకోవాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా వుంటుందని థామస్ కురియన్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో భాగంగా దావోస్ వెళ్లిన సిఎం చంద్రబాబు. మూడో రోజు పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడుల్ని ఆకట్టుకునేందుకు ప్రముఖ >>2

# ఆరోగ్యం, విద్యకే పెద్దపీట



బుధవారం దావోస్‌లో బిల్‌గేట్స్‌తో సిఎం చంద్రబాబు సమావేశ దృశ్యం

### సహకరించాలని బిఎంజిఎఫ్‌కు సిఎం చంద్రబాబు వినతి

### బిల్‌గేట్స్‌తో ముఖ్యమంత్రి భేటీ

**విజయవాడ, జనవరి 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య, విద్య, ఆవిష్కరణల కేంద్రంగా మార్చేందుకు సహకరించాలని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకులు, బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ఫౌండర్ బిల్ గేట్స్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు మూడోరోజు బిల్ గేట్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు పలు అంశాలపై చర్చించారు. చంద్రబాబు దావోస్‌లో బుధవారం మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో మానవ వనరుల శాఖా మంత్రి నారాలోకేష్‌తో కలిసి సమావేశమయ్యారు. సాంకేతికతను వినియోగించుకోవడంలోనూ, ఆవిష్కరణలపై దృష్టిపెట్టడంలో గేట్స్ అందరికీ స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. ఆరోగ్యం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇన్నోవేషన్‌పై పరస్పరం సహకరించుకోవడానికి గల అవకాశాలను ఇరువురం చర్చించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పురోగతిలో బీఎంజీఎఫ్ భాగస్వామి కావాలని... ఇందుకోసం ఎదురుచూస్తున్నట్టు తెలిపారు. బిల్ గేట్స్‌తో తొలిసారిగా 1995లో కలిశానన్నారు. అప్పుడు తమ మధ్య ఐటీ గురించి చర్చ జరిగిందని వెల్లడించారు. ఇప్పుడు 2025లో మరోసారి గేట్స్‌తో సమావేశమయ్యానని, అయితే ఈసారి తమ మధ్య ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అంశం చర్చకు వచ్చిందని చంద్రబాబు వివరించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత బిల్ గేట్స్‌ను మళ్లీ కలవడం సంతోషం కలిగించిందని తెలిపారు.

1995లో తాను ఉమ్మడి ఎపి సిఎంగా ఉన్నప్పుడు బిల్‌గేట్స్‌ను కలిసి మైక్రోసాఫ్ట్ పెట్టడంతో హైదారాబాద్ రూపురేఖలు మారిపోయాయన్నారు. ఇప్పుడు తాను బిల్‌గేట్స్‌ను కృతిమ మేథ(ఎఐ) గురించి కలిసి సంప్రదింపులు చేస్తున్నానన్నారు. దక్షిణ భారత్‌లో గేట్స్ పౌండేషన్ కార్యకలపాలకు తాను ఇప్పుడు ఎపిని గేట్‌వేగా నిలపాలని లోకేష్ కోరారన్నారు. బిల్‌గేట్స్‌ను కలిసిన అంశంపై చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.ఇకవరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ మెటీరియల్స్ (సెన్మట్) హెడ్ రాబర్టో బోకాను సమావేశమైన ముఖ్యమంత్రి.. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్, సోలార్ మాన్యుఫాక్చరింగ్ వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ కంపెనీల పెట్టుబడులు తరలివచ్చేలా సెన్మట్ సహకారం అందించాలని కోరారు. క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కు డబ్ల్యూఈఎఫ్ మద్దతివ్వాలని అభ్యర్థించారు.

## తిరుపతి తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ

### ప్రభుత్వం ఆదేశం

**విజయవాడ,జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణకు ఎపి ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జ్యుడిషియల్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొక్కిసలాట ఘటనపై 6 నెలల్లో నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే జనవరి 8వ తేదీన తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు >>2

# రాష్ట్రంలో 'మాస్టర్ కార్డ్'

### డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై సంస్థ మార్కెటింగ్ చీఫ్ రాజ్‌మన్నార్‌తో మంత్రి లోకేష్ చర్చలు

**విజయవాడ,జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో దావోస్ పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రులు, అధికారులు బృందం బిజీబిజీగా ఉంటున్నాయి. మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్‌లు బృందాలుగా ఆయా దేశాల చర్చలు జరుపుతున్నారు. కీలకంగ మానవ వనరుల శాఖా మంత్రి నారాలోకేష్ ఐటి, ఎఐ, ఇతర ప్రాధాన్యత రంగాలకు సంబంధించి పెట్టుదారులు, పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలకు సాంకేతిక సాయం, అమరావతి, విశాఖ, తిరుపతిల్లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ల నిర్మాణం, మెరుగైన ఆరోగ్య ప్రమాణాల కోసం శిక్షణ వంటి రంగాల్లో సహకారం అందించాలని వివిధ రంగాల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని పారిశ్రామిక వర్గాల నుంచి సానుకూల స్పందన వచ్చింది. హిటాచీ ఇండియా ఎండీ భరత్ కౌశల్‌తో సమావేశమైన మంత్రి నారా లోకేశ్ సమర్థవంతమైన పవర్ ట్రాన్స్‌మిషన్ >>2

# 2027 కల్లా షింకన్‌సేన్ హైస్పీడ్ రైళ్లు

**న్యూఢిల్లీ జనవరి 22:** రైల్వేల్లోఆధునిక రైళ్లతోపాటు రైల్వే మార్గాలను ఆధునీకరిస్తున్న ప్రధానిమోడీ ఎన్డీయే సర్కారు 2029-30 కల్లా కొత్త అత్యంత వేగంగా పయనించే ఆధునిక షింకన్‌సేన్ ఆల్ఫా ఎక్స్ లేదా ఈ10 హైస్పీడు రైలును భారత్‌ట్రాక్‌పైకి తీసుకోస్తోంది. 1700 కోట్ల డాలర్ల విలువైన ముంబయి అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు భారత ప్రబుత్వం, గుజరాత్, మహారాష్ట్ర, నేషనల్ హైస్పీడ్ రైల్‌కార్పొరేఉషన్‌ల జాయింట్ వెంచర్‌గా వస్తోంది. 2026 నాటికి ఈ హైస్పీడ్‌రైలును జపాన్ భారత్‌కు అందచేయనున్నది. 280 కిలోమీటర్ల వేగంతోప్రయాణించే ఈ రైళ్లు ప్రస్తుతం గంటకు 249 కిలోమీటర్ల వేగంతో నడుపుతారు. ఇందుకోసం ఇండియన్ రైల్వే ఇంటిగ్రల్ కోచ్‌ఫ్యాక్టరీ రూ.867 కోట్ల కాంట్రాక్టును బిఇఎంఎల్‌కు అందచేసింది. గత ఏడాది అక్టోబరులోనే ఈ కాంట్రాక్టు ఇచ్చింది. ఉత్పత్తిచేయడంతోపాటు ఈరైళ్లనుప్రారంభించే బాధ్యతకూడా ఆ కంపెనీదే. బుల్లెట్‌రైలు మౌలికవనరులను వృధాగా పోనీయకుండా 2026-27 నాటికి భారత్‌జపాన్‌లు ఇప్పటికే టెస్ట్ రన్‌ను నిర్వహించాలని నిర్ణయించాయి. దేశీయంగానే ఉత్పత్తి అవుతున్న సెమీ హైస్పీడ్ బుల్లెట్‌రైళ్లు అహ్మదాబాద్ ముంబయి కారిడార్‌లో 2027కల్లా పరుగులు తీయవచ్చని అంచనా. భారత్‌జపాన్‌లు ఇపుడు తాజాగా షింకన్‌సేన్ ఇ10 ఎక్స్‌ప్రెస్ రైళ్లను తీసుకురావాలని గట్టిపట్టుదలతో ఉన్నాయి. వచ్చే ఏడాది బుల్లెట్‌రైలు ప్రాజెక్టు పూర్తయితే అహ్మదాబాద్ ముంబయి కారిడార్‌లో ఈ రైళ్లనడుస్తాయని అంచనా.

## కల్తీ నెయ్యి ఘటనలో ఏం తేల్చారు?

### సిబిఐ సిట్ నివేదికలు గప్‌చుప్

**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** "కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా"తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదాల తయారీకి కల్తీనెయ్యి వినియోగించారనే ఆరోపణల్లో వాస్తవాలు వెల్లడికావడంలో జాప్యమెందుకనే విమర్శలు భక్తులు, టిటిడి వర్గాల నుండి వ్యక్తమవుతున్నాయి. దాదాపు నాలుగైదునెలలుగా కల్తీనెయ్యి ఘటనలో లోతుగా విచారణ చేపట్టిన సిబిఐ సిట్ అధికారులు కూడా నివేదికలు రూపొందించినా ఇంతవరకు ఎలాంటి వివరాలు బయటకు రాకుండా చూడటంలో ఆంతర్యమేమిటనే ప్రశ్నలు అంతటా గుప్పుమంటున్నాయి. అసలు గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి పాలకమండలి లడ్డూల తయారీకి పెద్దమొత్తంలో అవసరమైన నెయ్యి సరఫరాచేసుకోవడంలో లోపాలు ఉన్నాయనేది టిటిడి అధికారుల వాదన. ఆ దిశగా నెయ్యి కల్తీజరిగిందనే ఆధారాలు కూడా ఆరునెలల క్రిందట ప్రస్తుత టిటిడి అధికారులు గుర్తించి ల్యాబ్ రిపోర్టులు ఇచ్చారు. అయితే కల్తీనెయ్యి కేసులో ఏకంగా సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణకు ఆదేశించడం, సిబిఐ చీఫ్ ఆధ్వర్యంలో సిబిఐ అధికారులు, రాష్ట్రపోలీసువిభాగం అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఎఐ అధికారి దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేశారు. అయితే వివరాలు మాత్రం ఇప్పటికీ బయటకు వెల్లడించకపోవడంలో ఆంతర్యమేమిటనేది భక్తుల్లో వినిపిస్తున్న అనుమానాలు. మరీ సిబిఐ సిట్ అధికారులు కూడా నెలరోజుల ముందే తిరుపతిని వీడినా ఇప్పటికీ నివేదిక ఏందనేది వెల్లడికావడంలేదు.

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో సమానంగా భావించే పవిత్రమైన లడ్డూప్రసాదాల తయారీలో స్వచ్ఛమైన ఆవునెయ్యికి బదులు జంతువుల కొవ్వునూనెతో కలీనెయ్యి వినియోగించారనే బలమైన ఆరోపణలు ఆరునెలలక్రిందటే భక్తులను కలవరపెట్టింది. అదే సమయంలో రాష్ట్ర >>2

# భారీ సముద్ర రవాణా ఎపిలోనే

**విజయవాడ.జనవరి22.ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అతిపెద్ద సముద్ర రవాణా ఎపిలో రాబోతుందని, అందుకు అనుగుణంగా కార్యచరణ చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సముద్ర రవాణా కంపెనీలలో ఒకటైన డెన్మార్క్‌కు చెందిన మార్స్క్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను తీసుకువచ్చేందుకు దావోస్ సదస్సులో ముఖ్యమంత్రి విరామం లేకుండా ప్రపంచవ్యాప్తంగా వచ్చిన వివిధరంగాలకు చెందిన కంపెనీల సిఇఒలతో, అధిపతులతో చర్చలు జరుపుతున్నారు. 130 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ, ప్రపంచ రవాణా రంగంలో రారాజులా వున్న మార్స్క్ రాష్ట్రానికి వస్తే సముద్రరవాణాలో ఎపి దేశంలోనే అగ్రగామి రాష్ట్రం అవుతుందన్నారు. దావోస్‌లో జరుగు తున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సదస్సు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్స్క్ కంపెనీ సిఇఒ విన్సెంట్ క్లర్క్‌తో కీలక చర్చలు జరిపారు. వెయ్యి కిలోమీటర్ల పైనే తీరప్రాంతం కలిగి వుండటం, విస్తారంగా పోర్టులు ఉండటం ఆంధ్రప్రదేశ్ బలమని, మానవ వనరులకు లోటు లేదని, విన్సెంట్ క్లర్క్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. పళ్ల రసాలు, శీతల పానీయాలు, బీర్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, ఉత్పత్తి చేసే కార్ల్స్ బెర్గ్ గ్రూప్ సిఇఒ జాకబ్ ఆరుప్ ఆండర్సన్‌తోనూ సిఎం చంద్రబాబు చర్చలుజరిపారు. ఇంటిగ్రేటెడ్ బ్రూవరీ, బాట్లింగ్ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయమని కోరారు. ఇందుకోసం విశాఖపట్నం, కృష్ణపట్నం, శ్రీ సిటీలోని ఇండస్ట్రియల్ పార్కులను పరిశీలించమని సూచించారు. బార్లీ, మొక్కజొన్న, వరి వంటి అధిక నాణ్యమైన ఆహార ఉత్పత్తులను సేకరించేందుకు రాష్ట్రంలోని రైతులతో భాగస్వామి కావాల్సిందిగా కోరారు.

**మార్స్క్ రాష్ట్రానికి వస్తే ఎన్నో లాభాలు**

ప్రపంచ వ్యాప్తంగా భారీ ఉత్పత్తులు, వాణిజ్య వస్తువులు సముద్ర మార్గం ద్వారా రవాణా చేయడంలో మార్స్క్‌కు తిరుగులేదు. మార్స్క్ ఎపికి వస్తే వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి. రాష్ట్రంలోని ఓడరేవులు, ప్రధానంగా విశాఖపట్నం పోర్టు మరింత అభివృద్ధి చెందుతాయి. ఆసియా పసిఫిక్ మార్కెట్లకు రవాణా హబ్‌గా ఎపి మారే అవకాశం ఉంటుంది. అటు ఎగుమతులు, దిగుమతుల రంగం బలపడుతుంది. ఏపీ ఒక గ్లోబల్ లాజిస్టిక్ హబ్‌గా ఎదగడమే కాకుండా, భారతదేశ ఆర్థిక వృద్ధిలో ప్రధాన పాత్ర పోషించేందుకు దోహదపడుతుంది.

**పెట్టుబడుల కోసం సిస్కోకు ఆహ్వానం పలికిన సీఎం**

ఈథర్‌నెట్, ఆప్టికల్, వైర్‌లెస్, మొబిలిటీ వంటి నెట్‌వర్కింగ్‌లో సాంకేతికతలను అందించడం,

### విశాఖలో రీజనల్ టెక్నాలజీ హబ్ ఏర్పాటు

### దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుల్లో సిఎం చంద్రబాబు బిజీబిజీ

డేటా సెంటర్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో పేరున్న మల్టీనేషనల్ టెక్నాలజీ సంస్థ సిస్కో చైర్మన్, సిఇఒ చుక్ రాబిన్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. టెక్నాలజీ ఇన్నోవేషన్‌లో గ్లోబల్ లీడర్‌గా వున్న సిస్కో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వామి కావాలని చుక్ రాబిన్స్ దగ్గర ముఖ్యమంత్రి తన ఆకాంక్ష వ్యక్తం చేశారు. విశాఖపట్నం లేదా తిరుపతిలో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (బిదిది) ఏర్పాటుకు యోచన చేయమని... రాష్ట్రంలో ప్రతిభకు లోటు లేదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూలమైన వాతావరణం నెలకొని ఉంది. 1053 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, ఎయిర్ కనెక్టివిటీ, విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం నౌకాశ్రయాలు ఉన్నాయి. మరో ఏడాదిన్నరలో భోగాపురం, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు అందుబాటులోకి వస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డీప్‌టెక్ రంగాల్లో అధునాతన ఆవిష్కరణల కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో కలసిస్విస్‌పరిశోధన సంస్థలు కలసి పని చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

**ఎల్జీ కెమ్ లిమిటెడ్ సిఇఒ తో చంద్రబాబు భేటీ**

ఎల్జీ కెమ్ లిమిటెడ్ సిఇఒ షిన్ హాక్ చియోల్‌కు రాష్ట్రంలో వివిధరంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. ఎల్జీ కెమ్ దక్షిణ కొరియాలో అతిపెద్ద కెమికల్ కంపెనీ, 1.5 బిలియన్ లిథియంఅయాన్ బ్యాటరీ ప్లాంట్ ఏర్పాటు యోచనలో వున్న ఎల్జీ కెమ్ అనుబంధ సంస్థ ఎనర్జీని రాష్ట్రంలో నెలకొల్పాల్సిందిగా ముఖ్యమంత్రి ఈ భేటీలో కోరారు. పెట్రో కెమికల్ రంగంలో యూనిట్లు మూలపేట విశాఖలోనూ, సెమీకండక్టర్ యూనిట్ తిరుపతిలోనూ నెలకొల్పేందుకు వున్న అవకాశాలను పరిశీలించమని సూచించారు.

# పట్టాలపై ఘోరం

### పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు వ్యాపించనట్లు వదంతులు

### దూకేసిన ప్రయాణీకులపైనుంచి దూసుకెళ్లిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్

### 12 మంది దుర్మరణం, పలువురికి తీవ్ర గాయాలు



**జల్‌గావ్,(మహారాష్ట్ర), జనవరి 22:** మహారాష్ట్రలోని జల్‌గాంవ్ జిల్లాలో ఘోరమైన రైలుప్రమాదం జరిగింది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకులపై నుంచి మరో రైలు దూసుకెళ్లడంతో ఇప్పటివరకూ 12 మందిచనిపోయినట్లు రైల్వే శాఖప్రకటించింది. మరో 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా మృతుల సంఖ్య మరింతపెరిగే అవకాశం ఉంది క్షతగాత్రులను చికిత్సనిమిత్తం సమీపంలోని పలు ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సాయంత్రం ఐదు గంటల సమయంలో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులోమంటలు వ్యాపించినట్లు వదంతులు వ్యాపించగా భయంతోప్రయాణీకులు ఆరైలు చైన్‌లాగి పట్టాలపై దిగారు. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా పచోరా రైల్వేస్టేషన్ సమీపంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ వచ్చి వారిని ఢీకొని వారిపైనుంచి దూసుకుపోయింది. అందిన వివరాలను బట్టిచూస్తే పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌రైలులోని ఒక కోచ్‌లోహాట్‌యాక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్ కారణంగా నిప్పురవ్వలు లేచాయని రైల్వేఅధికారులు తెలిపారు. ప్రయాణీకులు భయాందోళనలకు గురై చైన్ లాగారనితెలిపారు. కొందరుట్రాక్‌లపై దూకేసిన సమయంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రావడంతో ఈదుర్ఘటన జరిగినట్లు తేలింది. మరోవైపు ఈఘటనలో ఇప్పటివరకూ 10నుంచి 12 మందివరకూ మృతిచెంది ఉంటారని మహారాష్ట్ర మంత్రి గిరీశ్‌మహాజన్ అన్నారు. ప్రయాణీకులు చైన్ లాగితే లక్నో ముంబయి పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌రైలు ఆగిందని, ఈరైలు ఆగాక ఒకబోగీనుంచి కొందరుప్రయాణీకులు దిగి మరోట్రాక్‌పైకి వెళుతున్న క్రమంలో అటుగా వస్తున్న బెంగళూరు ఢిల్లీ కర్ణాటకఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకుల్ని ఢీకొట్టిందని గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించేందుకుఅంబులెన్సులు పంపించామని ఘటనాస్థలికి విపత్తు సహాయక రైలు బయలుదేరిందని తెలిపారు.

రైలు ప్రమాదంపై మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్ విచారం వ్యక్తంచేసారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ సోషల్‌మీడియాలో పోస్టు పెట్టారు. నామంత్రివర్గ సహచరుడు గిరీశ్‌మహాజన్ జిల్లాఎస్పీ ఘటనా స్థలానికి వెళ్లారని, జిల్లాకలెక్టర్‌కూడా అక్కడకు వెళ్లారని జిల్లా యంత్రాంగం మొత్తం రైల్వే అదికారులతో సమన్వయం అవుతూ పనిచేస్తోందని సిఎం అన్నారు. ఎనిమిది అంబులెన్స్‌లను పంపించారని, క్షతగాత్రులకు చికిత్సఅందించేందుకు జనరల్ ఆసుపత్రులతోపాటు సమీపంలోని ఇతర ప్రైవేటు సుపత్రులను సిద్ధంచేసామన్నారు.

## వాహనం బోల్తా:

### ముగ్గురు వేద విద్యార్థులు, డ్రైవర్ దుర్మరణం

### మంత్రాలయం విద్యార్థులు హంపికి వెళ్తోండగా సింధనూరు వద్ద ప్రమాదం

**మంత్రాలయం, జనవరి 22,ప్రభాతవార్త:** ప్రతి నిత్యం వేదాలతో గడిపే విద్యార్థులు, సంస్కృత విద్యలో పట్టాపొందాలనే ఉద్దేశంతో చిన్న వయసులోనే ఆ విద్యార్థులు వేదపాఠశాలలో చేరారు. ఆధ్యాత్మిక జీవితంలో ఎన్నో ఉన్నత శిఖారాలు చేరాలని ఆ విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్షతో మంత్రాలయంలోని సంస్కృత విద్యాపీఠంలో చేర్పించారు. అయితే మంగళ వారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఆ విద్యార్థులు తమ విలువైన ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు సంస్కృత పాఠశాల విధ్యార్థులతో పాటు వాహనం డ్రైవర్ మొత్తం నలుగురు మృత్యువాత పడ్డారు.

దీంతో పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో తీవ్ర విషాధ ఛాయలు అలుముకున్నాయి. వివరాల మేరకు మంత్రాయంలోని శ్రీమఠం కర్ణాటక లోని హంపిలోఉన్న శ్రీనరహరి తీర్థుల బృందావనంలో మంత్రాలయం >>2

### అనంతపురం నుంచి గుంటూరు దాకా

# జాతీయ రహదారి విస్తరణ

### రూ.5,417 కోట్లతో పనులు

**విజయవాడ, జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** అనంతపురం నుంచి గుంటూరువరకు ఉన్న జాతీయ రహదారి (544డీ)లో రెండు కీలక ప్యాకేజీలను నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. బుగ్గగిద్దలూరు మధ్య 135 కి.మీ, వినుకొండ -గుంటూరు మధ్య 84.80 కి.మీ కలిపి మొత్తం 219.80 కి.మీ (దాదాపు 220 కి.మీ.) విస్తరణ పనుల్లో రెండు ఎలైన్‌మెంట్లకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.5,417 కోట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) వెచ్చించనుంది. రెండు ప్యాకేజీల్లో 21 చోట్ల బైపాస్‌లు నిర్మించేందుకు అనుమతించింది. అనంతపురం నుంచి ముచ్చుకోట, బుగ్గ, కైప, గిద్దలూరు, వినుకొండ మీదగా గుంటూరు వరకు ఎన్‌హెచ్ 544డిఉంది. ఇందులో అనంతపురం నుంచి బుగ్గ వరకు నాలుగు వరుసలుగా విస్తరణ పనులు ఇప్పటికే జరుగుతున్నాయి. గిద్దలూరు-వినుకొండ మధ్య 135 కి.మీ రెండు వరుసలుగా విస్తరించి 2022లో అందుబాటులోకి తెచ్చి, దాని నిర్వహణ గుత్తేదారుకు అప్పగించారు. ఇక మిగిలిన బుగ్గగిద్దలూరు, వినుకొండ-బుగ్గ గిద్దలూరు మధ్య 135 కి.మీ విస్తరణలో 25 కి.మీ నల్లమల రక్షిత అటవీ ప్రాంతం మీదగా వెళ్తుంది. దీంతో అక్కడ రెండు వరుసలుగానే విస్తరించాలని భావించారు. రాష్ట్రప్రభుత్వ విజ్ఞప్తితో నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కమిటీ ఆమోదించింది. రక్షిత అటవీ ప్రాంతం కావడంతో నాలుగు వరుసలుగా విస్తరణకు అనుమతులు రాకపోతే ఆ 25 కి.మీ. రెండు వరుసలకే పరిమితం కావాలని కమిటీ సూచించింది.

అంకిరెడ్డిపల్లి, రాఘవరాజుపల్లి కనకాద్రిపల్లి, కొలిమిగుండ్ల, రామాపురం అవుకు, బనగానెపల్లె, కైప, అప్పలాపురం, టంగుటూరు, రాయపాడు తెల్లపురి, పసురపాడు, ఎస్.నాగుల వరం, దీబగుంట్ల, గాజులపల్లి, దిగువమెట్ట, గిద్ద లూరు మొత్తం 15బైపాస్‌లు, వినుకొండ-శ్యావల్య పురం, సంతమాగులూరుపాత మాగులూరు, పెట్లూరివారి పాలెం, జొన్నలగడ్డ, సాతులూరు, ఫిరంగిపురం బైపాస్‌లు వస్తాయి. బుగ్గగిద్దలూరు, వినుకొండ -గుంటూరు మధ్య నాలుగు వరుసల హైవే220 కి.మీ. మేర నిర్మాణం, 21 చోట్ల బైపాస్‌లు ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం తెలిపింది.




దావోస్‌లో బుధవారం కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

# గూగుల్ క్లౌడ్ విస్తరణ!

>> సంస్థల అధిపతులతో చర్చలు జరిపారు. గూగుల్‌తో ఇప్పటికే పలు ఒప్పందాలు మన రాష్ట్రం చేసుకుంది. ఈ క్రమంలోక్లౌడ్ ప్రొవైడర్‌లో ప్రపంచంలో మూడో అతి పెద్ద సంస్థ అయిన గూగుల్ క్లౌడ్.. తన ప్లాట్‌ఫామ్ కింద ఇప్పటికే భారత్‌లోని ఢిల్లీ, ముంబైలో రెండు క్లౌడ్ రీజియన్లు ఏర్పాటు చేసింది. ఇటీవల విశాఖపట్నంలో తమ డేటా సిటీ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ ఎంవోయూ కుదుర్చుకుంది. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని అభివృద్ధి చేయడానికి, రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను పెంపొందించేందుకు ఏపీతో ఒప్పందం చేసుకుంది. 2047 నాటికి భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా మొదటి, లేక రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయం. సంపదను సృష్టించటంలో, ప్రపంచ సమాజ సేవ చేయటంలో భారతీయులు ముందుంటారు. దావోస్ సదస్సుకు హాజరైన తెలుగువారందరినీ చూస్తుంటే భవిష్యత్తులో తన కలలు వాస్తవరూపం దాల్చుతాయన్న ఆత్మవిశ్వాసం పెరిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్‌ను అభివృద్ధి చెందిన నగరంగా మార్చేందుకు కృషి చేశాను. 25ఏళ్ల కిందట బిల్‌గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో భారత్‌లో తొలితరం ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణల ఆధారంగా, రెండో తరం ఆర్థిక సంస్కరణలను నేను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్తు సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఈ సంస్కరణలు అమలుచేసినందుకుగాను అప్పటి ఎన్నికల్లో ఓడిపోయాను. ఇప్పుడు ఆ సంస్కరణలే ఏపీకి సానుకూల ఫలితాలను అందిస్తున్నాయి.

**ఇంటింటా సౌర విద్యుత్తే లక్ష్యం**

ఏపీలో విద్యుత్తు ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయి. విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. దానితోపాటు సౌర విద్యుత్తు వినియోగంపై దృష్టి సారించాం. ఇందులోభాగంగా పిఎం సూర్యఘర్ కింద ఇంటింటా సౌర ఉత్పత్తిని చేసే వినూత్న విధానం అమలు చేస్తున్నాం. ఈవీల కొనుగోలు, సౌర ఫలకాల ఏర్పాటుకు ముందుకొస్తున్నవారికి రాయితీలు ఇస్తున్నాం. ఏపీలో ఐదు ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ జెన్కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిచేయబోతున్నాయి. మా రాష్ట్రంలో విస్తారమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటులో పోర్టులు ఉన్నాయి. అత్యంత తక్కువ ఖర్చుతో విద్యుత్తును అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అదే సమయంలో పర్యావరణాన్ని పరిరక్షించే చర్యలకు కూడా పెద్దపీట వేస్తున్నామన్నారు.

**పెట్రోనాస్ ప్రెసిడెంట్‌తో ముఖ్యమంత్రి చర్చలు..**

పెట్రోనాస్ ప్రెసిడెంట్, గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముహమ్మద్ తౌఫిక్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. పెట్రోనాస్ మలేషియాకు చెందిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కంపెనీ. ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మాలిక్యుల్స్‌కు సంబంధించి భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. 2030 కల్లా ఏడాదికి 5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించి కాకినాడ ప్లాంటులో రూ.13,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. పెట్రోకెమికల్ హబ్‌గా అవతరిస్తున్న మూలపేటలోనూ, అలాగే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లోనూ పెట్టుబడులు పెట్టాల్సిందిగా మహమ్మద్ తౌఫిక్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

**పెప్సీకో అధిపతులతో సమావేశం**

పెప్సీకో ఇంటర్నేషనల్ బెవరేజెస్ సిఈఓ యూజీన్ విల్లెంసెన్, పెప్సీకో ఫౌండేషన్ ఛైర్మన్ స్టీఫెన్ కెహోతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. పెప్సీకో ప్రపంచంలో రెండో అతిపెద్ద ఫుడ్ బెవరేజెస్. ఇప్పటికే ఏపీలోని శ్రీసిటీలో బాట్లింగ్ ప్లాంట్ నిర్వహిస్తున్న పెప్సీకో బెవరేజెస్... విశాఖపట్నాన్ని గ్లోబల్ డెలివరీ సెంటర్‌గా చేసుకుని పెప్సీకో డిజిటల్ హబ్‌ను ఏర్పాటు చేయవచ్చని ముఖ్యమంత్రి సూచించారు. గ్లోబల్ బిజినెస్ సర్వీస్ సెంటర్‌ను విశాఖకు విస్తరించాల్సిందిగా కోరారు. కుర్‌కురే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుతోపాటు పెప్సీకో తమ సస్టైనబిలిటీ చైన్‌ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఏపీఎఫ్‌పీఎస్‌తో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఐక్యరాజ్య ప్రైమ్ మినిస్టర్ కార్యాలయంలో ప్రతినిధి హమద్ అల్ మహీరిద్, ముంబదలా సీఈఓ ఖల్దూన్ బిన్ ఖలీఫా అల్ ముబారక్‌తోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీలను వివరించిన ముఖ్యమంత్రి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం ఏపీకి రావాలని వారిని ఆహ్వానించారు.ఈ రోజు సిఎం యునిలీవర్, డిపి వరల్డ్ గ్రూప్, ఆస్ట్రా జెనెకా సంస్థల అధిపతులను కలుసుకోనున్నారు. దావోస్ సమావేశాల్లో గ్రీన్‌కోతో ఎంవోయూ కుదుర్చుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం, హ్యూమన్ మిషన్ కొలాబరేషన్, గ్రీన్ హైడ్రోజన్ – పునరుత్పాదక విద్యుత్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరుకానున్నారు. ఏపీలో పెట్టుబడులకు వున్న అవకాశాలను చంద్రబాబు వివరించనున్నారు. రాష్ట్రంలో పరిశ్రమలకు ఉన్నఅవకాశాలు, ఉన్నతమైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడి దారులకు ఉన్న స్నేహపూర్వకమైన పాలసీలు, విభిన్న రంగాల్లో ఉన్న అవకాశాలపై పెట్టుబడిదారులకు చంద్రబాబు వివరిస్తారు. దావోస్‌లో జరిగిన కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌లు కలుసుకున్నారు.



బుధవారం దావోస్‌లో మాస్టర్ కార్డ్ హెల్త్ కేర్ మార్కెటింగ్ చీఫ్ రాజమన్నార్‌తో లోకేశ్ భేటీ దృశ్యం

# రాష్ట్రంలో 'మాస్టర్ కార్డ్'

>> కోసం రాష్ట్రంలో హెచ్‌వీడీసీ వంటి అధునాతన సాంకేతికత అమలుకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో 3 వేస్ట్‌టుఎనర్జీ ప్లాంట్‌లను కడప, అనంతపురం, తాడేపల్లిగూడెంలో ఏర్పాటుకు సంబంధించి గత ప్రణాళికలను పునఃపరిశీలించాలని కోరారు. కంపెనీ సహచరులతో చర్చించి ప్లాంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని భరత్ కౌశల్ హామీ ఇచ్చారు. రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ ద్వారా పబ్లిక్ సర్వీస్ డెలివరీని మెరుగుపరిచే వ్యవస్థలను హిటాచీ అభివృద్ధి చేస్తుందని వివరించారు. మాస్టర్ కార్డ్ హెల్త్ కేర్ మార్కెటింగ్ చీఫ్ రాజమన్నార్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు. దక్షిణాది రాష్ట్రాల్లో మాస్టర్ కార్డ్ కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉందని లోకేశ్ పేర్కొన్నారు. మాస్టర్ కార్డ్ హెల్త్ కేర్ మార్కెటింగ్ చీఫ్ రాజమన్నార్ స్పందిస్తూ... భారత్‌లో 'పాస్ కీ' చెల్లింపుల సేవలు ప్రారంభిస్తామని తెలిపారు. సురక్షిత ఆన్ లైన్ లావాదేవీల కోసం ఓటీపీ ఆధారిత సేవలు అందిస్తామని చెప్పారు.

**వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదికగా స్వనీతి రౌండ్ టేబుల్ సమావేశం**

దావోస్‌లోని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వేదికగా స్వనీతి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 'పర్యావరణ పరిరక్షణవాతావరణ ఉద్యమం భవిష్యత్తు' అనే అంశంపై ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి మంత్రి నారా లోకేశ్ కూడా హాజరయ్యారు. ఈ సమావేశానికి పోర్చుగల్ మాజీ ప్రధానితో పాటు జోర్డాన్ రాణి, యునెస్కాప్ చీఫ్ సైంటిస్ట్, తదితరులు హాజరయ్యారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో నారాలోకేశ్ మాట్లాడుతూ... కర్బన ఉద్గారాల నియంత్రణకు క్లీన్ ఎనర్జీ ఏకైక పరిష్కారం అన్నారు. సుస్థిర శక్తి వనరుల రంగంలో ప్రపంచ అగ్రగామి అయ్యేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని చెప్పారు. సంప్రదాయేతర ఇంధన రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు యత్నాలు చేస్తున్నామని వివరించారు. పునరుత్పాదక రంగంలో ఏపీ గణనీయ ప్రగతి సాధిస్తోందని నారా లోకేశ్ పేర్కొన్నారు. పునరుత్పాదక శక్తి రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల సాధన లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని... తద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ కల్పన జరుగుతుందని వివరించారు.

**డబ్ల్యూటీసీ ఛైర్మన్‌తో లోకేష్ చర్చలు**

లోకేశ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ అసోసియేషన్ గ్లోబల్ ఛైర్మన్ జాన్ డ్రూతో భేటీ అయ్యారు. ఏపీలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో వరల్డ్ ట్రేడ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆగ్నేయాసియా, మిడిల్ ఈస్ట్ ఆసియాతో భారత మార్కెట్‌ను అనుసంధానించడానికి వీలుగా ఆంధ్రప్రదేశ్‌లో ట్రేడ్ హబ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం భారత్‌లో 13 ప్రపంచ వాణిజ్య కేంద్రాలు పనిచేస్తున్నాయని జాన్ డ్రూ తెలిపారు. ఇందులో 7 నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. మరో 9 చోట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. భారతీయ వ్యాపారాలు, అంతర్జాతీయ మార్కెట్ల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, ఇండియా బేస్డ్ ట్రేడ్ హబ్‌లను ప్రాంతీయ మార్కెట్లకు అనుసంధానించాలని తాము భావిస్తున్నట్లు వివరించారు. ఏపీలో వరల్డ్ ట్రేడ్ సెంటర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

**స్మోక్ ఫ్రీ సిగరెట్ తయారీ యూనిట్**

రాష్ట్రంలో స్మోక్ ఫ్రీ సిగరెట్ తయారీ యూనిట్ నెలకొల్పాలని ఫిలిప్ మోరిస్ వైస్ ప్రెసిడెంట్ ఆండ్రియా గోంట్కోవికోవాను లోకేశ్ కోరారు. ప్రకాశం, గుంటూరు పరిసరాల్లో పెద్దఎత్తున పొగాకు సాగు చేస్తున్నందున ఆయా ప్రాంతాలు అనుకూలమని వివరించారు. గుంటూరులో రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తు చేసిన ఫిలిప్ మోరిస్ వైస్ ప్రెసిడెంట్ ఆండ్రియా, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**గ్లోబల్ కెపాసిటీ సెంటర్**

బహుళ జాతి ఐటీ సంస్థ సిస్కో ఉపాధ్యక్షురాలు ప్రాన్సిన్ కట్సౌదాస్‌నూ లోకేశ్ కలిశారు. విశాఖలో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. అమెరికాలోని భారతీయ ఐటీ వర్క్ ఫోర్స్‌లో 25 శాతానికిపైగా తెలుగువారేనని అన్నారు. భారత్‌లో అతిపెద్ద ఐటీ టాలెంట్ పూల్ ఉన్న ఆంధ్రప్రదేశ్ సిస్కో దీర్ఘకాల వ్యూహానికి అనువుగా ఉంటుందని, కంపెనీ తయారీ నెట్‌వర్క్‌ను విస్తరించాలని కోరారు. కృత్రిమ మేథ, నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీలో అత్యంత నైపుణ్యం కలిగిన ఐటీ వర్క్‌ఫోర్స్ తయారీకి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# హరిహరనాథశర్మ, లక్ష్మణరావు

>> బుధవారం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. అందులోభాగంగా తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ రేణుక ఎర్రా, జస్టిస్ నర్సింగరావు నందికొండ, జస్టిస్ తిరుమల దేవి ఎద, జస్టిస్ మధుసూధనరావు బొబ్బిలి రామయ్యలను నియమించింది. అలాగే తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు పలువురు న్యాయమూర్తులను ఎంపిక చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమైంది. అందుకు పలువురు న్యాయమూర్తుల పేర్లను కేంద్రానికి సిఫార్స్ చేసింది. వీరి నియమాకానికి సంబంధించి.. ఈ రోజు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసింది.ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తులుగా నియమితులైన వారిలో అవధానం హరిహరనాథ శర్మ 1968 ఏప్రిల్ 16, కర్నూలులో జన్మించారు. కర్నూలు ఉస్మానియా కళాశాల నుంచి బీఎస్సీ, నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రం పూర్తి చేశారు. 1994లో బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని కర్నూలు జిల్లా కోర్టులో న్యాయవృత్తి ప్రారంభించారు.

పదవులు: 2007లో జిల్లా జడ్జిగా ఎంపికై పలు హోదాల్లో పనిచేశారు. 2023 నుంచి ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు..

జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు: 1975 ఆగస్టు 3, ప్రకాశం జిల్లా కనిగిరిలో జన్మించారు. నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రంలో బంగారు పతకాలు సాధించారు. నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీజీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 2000లో న్యాయవాదిగా న్యాయవృత్తి ప్రారంభించారు. 2014లో జిల్లా జడ్జిగా ఎంపికై పలు హోదాల్లో సేవలందించారు. ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా కొనసాగుతున్నారు

# వేద విద్యార్థులు, డ్రైవర్ దుర్మరణం

>> శ్రీమఠం ఆధ్వర్యంలో పూజలు చేసుకోచ్చని కర్ణాటక కోర్టు కొద్దిరోజుల క్రితం తీర్పు వెలువరించింది.ఇందులో మంత్రాలయం భక్తులు,శ్రీమఠం సిబ్బంది సంబరాలు చేసుకోవాలని అందరూ మంత్రాలయం నుండి హంపికి బయలు దేరారు.ఇందులో భాగంగా ఓవాహనంలో మొత్తం 12 మందితో రాత్రి సమయంలో బయలుదేరారు.అయితే కర్ణాటకలోని సింధనూరు వద్ద వాహనం వెళుతుండగా వాహనం టైరు పంక్చరై వాహనం బోల్తాపడింది.ఇందులో ప్రయాణిస్తున్న వేదపాఠశాల విద్యార్థులు అభిలాష్, హైవదన, సుజయీంద్ర(20)డ్రైవర్ శివ(20) మొత్తం నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.ఇందులో అభిలాష్,హైవదన కర్ణాటక ప్రాంతానికి చెందిన విద్యార్థులు కాగా సుజయీంద్ర మాత్రం మంత్రాలయంకు చెందిన కృష్ణాచారి, జానకిల కుమారుడిగా గుర్తించారు.అదేవిధంగా డ్రైవర్ శివకూడా మంత్రాలయంకు చెందిన సోమన్న,కాశమ్మల కుమారుడుగా తెలుసుకున్నారు.ఐదుమందికి గాయాలయ్యాయి.ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఒకే ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో మంత్రాలయంలో తీవ్ర విషాధ చాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపట్ల సిఎం చంద్రబాబు,ప్రతిపక్షనేత జగన్ మంత్రాయలం ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి,టిడిపి ఇంఛార్జ్ రాఘవేంద్రరెడ్డి తమ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం తరుపున అదుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది.

## ఫిబ్రవరి 5న ప్రధానిమోడీ

# కుంభ్‌మేళాలో పవిత్రస్నానం

**న్యూఢిల్లీ, జనవరి 22:**యూపిలోని ప్రయాగరాజ్‌లో భారీ ఎత్తున జరుగుతున్న మహాకుంభ్‌లో ప్రధాని నరేంద్రమోడీ పవిత్రస్నానం ఆచరించేందుకు వెళ్లాలనినిర్ణయించుకున్నారు. ఫిబ్రవరి ఐదో తేదీన ప్రధాని మోడీ త్రివేణి సంగమ స్థలిలో పుణ్యస్నానం ఆచరిస్తారని బిజెపినేతలు చెపుతున్నారు. మరోవైపు ఈనెల 27వ తేదీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా త్రివేణిసంగమంలోపవిత్రస్నానం ఆచరించనున్నారు. గంగాహారతి కార్యక్రమంలోనూ పాల్గొంటారు. అధికారులతో భేటీ కానున్నారు. ప్రధాన కూడాళ్లవద్ద మరోసారి అధికారులు కూడా షా రాక సందర్భంగా గట్టిబందోబస్తు తనిఖీలుచేసారు. వచ్చేనెల ఒకటవ తేదీ ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌కడ్ దంపతులు, ఫిబ్రవరి 10వ తేదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాగ రాజ్‌కు రానున్నారు. దట్టమైన మంచు కప్పుకున్నప్పటికీ భక్తులు లక్షలాదిమంది పుణ్యస్నానాలు ఆచరించారు. జనవరి13న మ ఒదలైన కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీ పూర్తి అవుతుంది. మౌని అమావాస్య రెండో షహీస్నానం జనవరి 29న ఫిబ్రవరి మూడో తేదీ వసంతపంచమిరోజు మూడో షహీస్నాన్, ఫిబ్రవరి 12న మాఘపూర్ణిమ సందర్భంగా అత్యధికంగా భక్తులు వస్తారని అంచనా. ఫిబ్రవరి 26న మహాశివరాత్రితోకుంభమేళా ముగుస్తుంది. యుపి రాష్ట్ర గణాంకాలప్రకారం జనవరి 20 నాటికి 8.81 కోట్లమందికిపైగాభక్తులు పుణ్యస్నానాలుచేసారు.

# తప్పు చేసిన వ్యక్తి తప్పించుకోకుండా చేస్తాం

## హోంమంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ, జనవరి 22, ప్రభాతవార్తప్రతినిధి:** తప్పు చేసిన వ్యక్తి తప్పించుకోకుండా చేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. సురక్ష కమిటీలు, సిసి కెమెరాల ఏర్పాటు మంచి కార్యక్రమం భద్రత విషయంలో ప్రజలను భాగస్వామ్యం చేయడమేనన్నారు.పోలీస్ గా పనిచేయడం చాలా పెద్ద బాధ్యతన్నారు.విజయవాడ ప్రజలకు కీలకమైన బెంజి సర్కిల్ ట్రాఫిక్ ను నియంత్రించ గలిగామన్నారు. నగరంలోని ఎ ప్లస్ ఫంక్షన్ హాల్ నందు పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆధ్వర్యంలో ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనర్ రేట్‌లోని పోలీస్ స్టేషన్ పరిదిలో సురక్షా కమిటీల ప్రారంబోత్సవం, దాతల సహకారంతో నగరంలో ఏర్పాటు చేసిన 1000 సి.సి.కెమెరాలను ఈ రోజు మంత్రి అనిత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 700 నుంచి 800 హాట్ స్పాట్లను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.పోలీస్ వ్యవస్థ గర్వంగా గౌరవాన్ని స్వీకరించేలా పని చేస్తోందన్నారు.విజయవాడ వరదల నుంచి ప్రాణ నష్టంలేకుండా బయటపడడం పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం అనిర్వచనీయమన్నారు.లక్షల మంది దుర్గ భక్తులు వస్తున్నా అవాంతరం లేకుండా సీఎం మెచ్చుకునేలా పోలీసులు పని చేశారన్నారు.టెక్నాలజీని వినియోగించుకోవడంలో సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యలు అద్భుతం,ఆమోఘమన్నారు.డ్రోన్ సీసీ కెమెరాలు వంద మంది పోలీసు లతో సమానంఅన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. ప్రైవేట్ కార్యక్రమాలన్నింటిలో టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కలిగించే హోర్డింగ్లు, ఫ్లెక్సీ, బ్యానర్లకు ప్రజాప్రతినిధులు ప్రాధాన్యతనివ్వాలన్నారు. నేరరహిత సమాజంకోసం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ తీసుకున్న చర్యలకు అభినందనలు తెలిపారు.35 ఏళ్లుగా సేవలందిస్తున్నా నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీకి పెద్దపీట వేస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు చొరవకు అభినందనలు తెలిపారు.పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలందరినీ ఒకే తాటిపై ఒకచోట చేర్చిన విజయవాడ ఎంపీ శివనాథ్ అన్నకి అభినందనలుఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ సిపి రాజశేఖర్ బాబు కృషి ప్రశంసనీయం. బుడమేరు, భవానీ దీక్షల ఏర్పాట్లు సహా ప్రతి పనిలో ముందుండి నడిపిస్తున్న ట్రాఫిక్, క్రైమ్ డిసిపిలందరికీ అభినందనలు తెలిపారు.ప్రతి పోలీస్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సురక్ష కమిటీలను ప్రారంభించడం సంతోషంగా ఉంది, పోలీసులు పనితీరు, సాధించిన ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి, ఎన్.టి.ఆర్. జిల్లా పోలీసులు సాంకేతికత ద్వారా మంచి ఫలితాలు సాధించారు, ఎన్.టి.ఆర్. జిల్లాలో ఉన్న ఎంపి, ఏడుగురు ఎమ్మెల్యేలు ఇంతసేపు ఇక్కడ ఉండటం ఆనందం కలిగించింది, పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు పని తీరు ఆదర్శంగా నిలుస్తుంది, గతంలో పోలీసు అంటే కటువుగా ఉంటారు, అమ్మో పోలీస్ అనే పరిస్థితి ఉండేది, ఇప్పుడు అంతా మారింది ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారు, డిజిపి ముందుచూపు, సూచనలు పాటించి బెజవాడ పోలీసులు ప్రజల మన్ననలు పొందారు. ఒక వైపు డ్రోన్ లు, మరోవైపు సిసి కెమెరాల ద్వారా నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. ఎక్కడా ట్రాఫిక్ ఆగకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేసి చర్యలు తీసుకుంటున్నారు, విజయవాడ వరదల సమయంలో పోలీసులు పని తీరుతో ప్రజల మన్ననలు పొందారు, ప్రజలు కూడా పోలీసులు తీసుకునే నిర్ణయాలకు స్వాగతం పలుకుతూ సహకారం అందిస్తున్నారు, ఇప్పుడు సాంకేతికత ను ఉపయోగించుకుని పోలీసులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు, టెక్నాలజీ పేరు చెబితే గుర్తు వచ్చే మొదటి పేరు సిఎం నారా చంద్రబాబు నాయుడు, ఒక్క డ్రోన్ నేడు వంద మందితో సమానంగా పని చేస్తుంది. తప్పు చేసిన వ్యక్తి తప్పించుకోకూడదు అన్న చంద్రబాబు మాటలను ఆచరించేలా పోలీసులు పని చేస్తున్నారు, రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు రవాణా పూర్తిగా నిరోధిస్తాం, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లను బాగా ప్రచారం చేయాలి, ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే ఆ నెంబర్ లకు కాల్ చేసేలా ఉండాలి, కూటమి ప్రభుత్వం లో మంచి పోలీసింగ్ ద్వారా ప్రజలు ఒక ధైర్యం తో ఉన్నారు అని తెలియజేశారు. రాష్ట్ర డి.జి.పి. సి.హెచ్. ద్వారకా తిరుమలరావు ఐ.పి.ఎస్.గారు మాట్లాడుతూ.. సిసి కెమెరాల ద్వారా నేరాలను నియంత్రణ జరుగుతుంది, మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రం మొత్తం మీద లక్ష కెమెరాలు పెట్టబోతున్నాం, సురక్ష కమిటీల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నాం,డ్రోన్ కెమెరా ల కొనుగోలుకు ప్రజాప్రతినిధులు సహకారం అందించారు, కాలానుగుణంగా పోలీసింగ్ లో కూడా మార్పులు రావాలి, విజిబుల్ పోలీసింగ్ ఇన్ విజిబుల్ పోలిసింగ్ అని సి.ఎం గారు ఎప్పుడూ చెబుతుంటారు, సాంకేతికత ను వాడుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయి అన్నారు.

# న్యాయ విచారణ

>> భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే పలువురు భక్తులు గాయపడ్డారు. ఈ ఘటనను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఘటన జరిగిన తీరుపై ఆరా తీసిన చంద్రబాబు న్యాయ విచారణకు ఆదేశిస్తామని వెల్లడించారు. ఈ క్రమంలోనే తాజాగా జ్యుడిషియల్ విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## దావోస్‌లో పెట్టుబడిదారుల సదస్సుకు కాలినడకన లోకేష్

**విజయవాడ,జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో ఏపీ ప్రభుత్వ పెట్టుబడుల కోసం యత్నాలను ముమ్మరం చేసింది. దావోస్ లోని కాంగ్రెస్ సెంటర్‌లో ఓ సమావేశానికి నారా లోకేశ్ కాలినడకన వెళ్లడం ఓవీడియాలో కనిపించింది. తాము బస చేస్తున్న హోటల్ నుంచి వాహనంలో బయల్దేరిన లోకేశ్.,మార్గమధ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ లో వాహనం నిలిచిపోవడంతో, తన బృందంతో కలిసి ఆయన రోడ్డు మార్గంలో కాలినడకన కాంగ్రెస్(సదస్సు) సెంటర్ చేరుకున్నారు.

**వారం - వర్జ్యం**

తేది : 23-01-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
నవమి సా.5.38
విశాఖ తె.5.07
వర్జ్యం : ఉ.8.45-10.31
దు.ఉ.10.34-11.19
2) మ.3.05-3.50
రాహుకాలం – మ.1.30-3.00

**వార్తాఫలం**

మేషం : అధిక శ్రమను పంచుకోవడానికి నమ్మకస్తులైన వారికి కొన్ని బాధ్యతలు అప్పగిస్తారు.

వృషభం:లిఖిత పూర్వక ఒప్పందములకు వక్ర భాష్యములను తెచ్చే తుంటరి వర్గం పట్ల అప్రమత్తంగా ఉండండి.

మిథునం:బరువు బాధ్యతలకు దూరంగా కొంతకాలం ఒంటరిగా కాలం గడపాలనుకుంటారు.

కర్కాటకం : సుదూర ప్రాంత ప్రయాణాలలో ముఖ్యమైన వ్యవహారాలలో స్వల్పమైన ఆటంకాలు ఏర్పడతాయి.

సింహం: కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికిగాను కావలసిన సలహాలను పెద్దల నుండి తీసుకొంటారు.

కన్య : మారుతున్న కాలానికి అనుగుణంగా మీరూ మార్పును కోరుకుంటారు. వాహన యోగం.

తుల : నిష్కారణమైన తగాదాలు అపనిందలు తప్పకపోవచ్చు. జీవిత భాగస్వామితో వివాదాలు ఏర్పడతాయి.

వృశ్చికం: మిత్ర బృందంలోనికి కొత్తవారికి చోటు కల్పిస్తారు. మీ నడవడి సూటిగా ఉంటుంది.

ధనుస్సు: రొటీన్ సంతకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. అనుకోని ప్రయణాలు లాభిస్తాయి.

మకరం: న్యాయ నిపుణుల సలహాలను పరిగణలోనికి తీసుకుంటారు. నూతన ప్రణాళికలను రూపొందించుకుంటారు.

కుంభం: మీపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న వారిని గుర్తించి వారికి దూరంగా ఉంటారు.

మీనం : ఆర్థిక విలువైన పత్రాల భద్రతా విషయంలో జాగ్రత్తలు అవసరం. సోదరుల కలయిక.


– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కల్తీ నెయ్యి ఘటనలో ఏం తేల్చారు?

>> సర్కార్ కూడా కొన్ని ఆధారాలతో లడ్డూలకు కల్తీనెయ్యి వాడారని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై నిజానిజాలు తేల్చేందుకు సుప్రీంకోర్టు సిబిఐ సిట్‌ను నియమించి మూడువారాలు పాటు తిరుపతి,తిరుమలలలో, తమిళనాడు దిండిగల్, వైష్ణవిడైరీలో తనిఖీలు చేపట్టింది. కల్తీనెయ్యి ఎలా జరిగింది, ఎప్పుడు, ఏ సంస్థ టెండర్‌దారుడు సరఫరా చేసిన నెయ్యిలో జంతువుల కొవ్వునూనె, ఇతరత్రా పదార్థాల నూనె కలిపారనే వివరాలు సేకరించింది. ఈ కల్తీనెయ్యి పరీక్షలను గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబరేటరీ(పరిశోధనశాల)నుండి సేకరించారు. ఈ ఫలితాల్లో నెయ్యికల్తీ అయిన మాట వాస్తవమేనని,అయితే కొన్ని రకాల ఆహారపదార్థాల నూనెలు కలిపారనేది టిటిడి అధికారులు వెల్లడించారు. ఇప్పుడు ఆ పరీక్షా ఫలితాల నివేదికలతో బాటు కల్తీనెయ్యితో తయారుచేసిన లడ్డూలను కూడా గుజరాత్‌లోని ల్యాబ్‌లోనే పరీక్షించి రిపోర్టులు తెప్పించుకున్నారనేది విశ్వసనీయ సమాచారం. ఈ నివేదికలు ఆధారంగానే కల్తీనెయ్యి బాగోతం వెలుగుచూసిందనేది టిటిడి వర్గాల్లో ఆసక్తికర అంశం. ఆరుమంది సభ్యులు కల్తీనెయ్యి బాగోతంపై అన్ని కోణాల్లో విచారణ చేసి కీలక ఆధారాలు సేకరించారని తెలుస్తోంది..తిరుమల లడ్డూప్రసాదం తయారీలో మంచిశెనగపప్పు, జీడిపప్పు, చక్కెర, ఎండుద్రాక్ష, యాలకులు,కలకండ, పచ్చకర్పూరం తదితర మిశ్రమాలను వినియోగిస్తారు. లడ్డూధర 50రూపాయలు పెంచినా నాణ్యత లేదనేది గత ఐదేళ్ళలో భక్తుల అపరిమిత ఆరోపణలు. 175గ్రాముల బరువున్న లడ్డూలు గతంలోనే రోజుకు 3.50లక్షల వరకు తయారుచేశారు. 2021వ సంవత్సరం మార్చివరకు టిటిడికి లడ్డూల కోసం కర్నాటక మిల్క్‌ఫెడరేషన్‌కు చెందిన కెఎంఎఫ్ నందిని బ్రాండ్ నెయ్యి సరఫరా చేసింది. 2021 మార్చిలో జరిగిన టెండర్లలో నందిని ఎల్ 3గా నిలిచింది. అయినా ఎల్ 1, ఎల్ 2 కేటగిరిలో టిటిడికి అవసరమైన నెయ్యిలో కెఎంఎఫ్ 20శాతం సరఫరా చేసిందని టిటిడి వెల్లడి. ఆపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రీమియర్ ఎల్ 1,ఎల్ 2 ఆల్ఫా కంపెనీలు నెయ్యి సరఫరా చేసే టెండర్ దక్కించుకున్నాయి. తిరుమలలో లడ్డూ తయారీకి ప్రతిరోజూ 500లీటర్ల వరకు నెయ్యిని వినియోగిస్తుంది.

**'సిట్' విచారణ నివేదికలు సుప్రీంకు సమర్పించారా?:**

తిరుమల లడ్డూలను నాణ్యతగా, రుచిగా తయారుచేయడంలో పోటువిభాగం కీలకం. అందిన ముడిసరుకులతో నాణ్యతగా, రుచిగా తయారుచేసేది వైష్ణవబ్రాహ్మణులే. పోటుపై తొలిరోజునుండే సిట్ బృందం దృష్టి సారించింది. లడ్డూ తయారీలో బూంది కీలకం, ఇందుకు వినియోగించే నెయ్యి. శనగపిండి, యాలకులు, జీడిపప్పు,ఎండుద్రాక్ష, కుంకుమపువ్వు ఇలా వాటిని ఎక్కడ నుండి సరఫరా చేసుకున్నారు? కాంట్రాక్టర్లు ఏ ప్రాంతం వాసులు, ఎక్కడ నుండి పంపారు అనే వివరాలు సేకరించారు. టిటిడి మార్కెటింగ్ కొనుగోళ్ల జిఎం మురళీకృష్ణను, పోటులో కీలకంగా ఉన్న సూపరింటెండెంట్, ఎఇఒలను విచారణ చేశారు. తిరుమలలో నెయ్యిట్యాంకర్లను కూడా పరిశీలించారు. నెయ్యిట్యాంకర్లనుండి నమూనాలు సేకరించారు. గోడౌన్లలో ముడిసరుకుల నాణ్యతను సిట్ అధికారులు పరిశీలించారు. మరీ ఈ నివేదికల్లో ఆంతర్యంమాత్రం వెలుగుచూడటం లేదు.



బుధవారం ప్రయాగ్‌రాజ్‌లోని సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్, మంత్రులు

# త్రివేణి సంగమంలో యోగి కేబినెట్ పవిత్ర స్నానం

**ప్రయాగరాజ్, జనవరి 22:** ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రయాగరాజ్‌లో బుధవారం ప్రత్యేక కేబినెట్‌సమావేశం నిర్వహించారు. అనేక ముఖ్యప్రతిపాదనలను చర్చించి ఆమోదించారు. గంగానదిపై ఆరులైన్ల వంతెన నిర్మించాలనినిర్ణయించారు. ప్రయాగరాజ్ మరియు పరిసర ప్రాంతాల స్థిరమైన అభివృద్ధిపై దృష్టిసారించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రయాగరాజ్‌ని మీర్జాపూర్, భదోహి, కాశీ,చందౌలికి కలుపుతూ ఘాజీపూర్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేకి అనుసంధానంచేస్తూ గంగా ఎక్స్‌ప్రెస్‌వే పొడిగింపును చేపడుతున్నట్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ కేబినెట్‌భేటీ అనంతరం తెలిపారు. ఆ తర్వాత యూపి సీఎం యోగి, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్‌మౌర్య, బ్రజేష్ పాఠక్, మంత్రులు కూడా పవిత్ర త్రివేణి సంగమంలో పవిత్రస్నానాలుచేసారు.

# తిరుమల సమాచారం

## ఫిబ్రవరి 4న ఒకేరోజు ఏడువాహన సేవలు

### - రథసప్తమికి తిరుమల ముస్తాబు



**తిరుమల,జనవరి 22ప్రభాత వార్త ప్రతినిధి:** మాఘ మాసం సప్తమి తిధి ఘడియల్లో ఫిబ్రవరి 4వతేదీ మంగళవారం ఒకేరోజు ఏడు కొండల దేవుడు ఏడువాహనాలపై ఊరేగి భక్తులను కటాక్షించ నున్నారు. సూర్యజయంతినే రథ సప్తమి అని కూడా పిలుస్తారు. తిరుమలలో ఈ వేడుకలను మినీబ్రహ్మోత్సవమ్‌గా నిర్వహిస్తారు. ఆ రోజు ఉదయం5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఉభయదేవేరులతో కలసి సప్తవాహనాలపై ప్రత్యక్షమిస్తారు. రథసప్తమిన తొలివాహనంగా ఉదయం 5.30గంటలకు సూర్యప్రభవాహనంతో మొదలై చివరగా రాత్రి 7గంటలకు చంద్రప్రభవాహనసేవతో వాహనసేవలు ముగుస్తాయి. సాధారణంగా ఏడాదిలో వరుసగా తొమ్మిదిరోజులు పాటు 16వాహనాలపై ఊరేగే శ్రీవేంకటేశ్వరుడు రథసప్తమిన ఒకేరోజు ఏడువాహనాలను అధిరోహించి భక్తులకు దర్శనమిస్తాడు. రథసప్తమి వేడుకలకు భక్తులు అశేషసంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు, షెడ్లు, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, ఆలయం పరిసరాల్లో రంగవల్లులు తీర్చిదిద్దడం పనులు జోరుగా సాగుతున్నాయి. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు. సూర్యజయంతి (రథసప్తమిన)రోజున ఫిబ్రవరి 4వతేదీ తిరుమలలో ఏడువాహనసేవలు జరుగుతాయి. ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే ఆర్జితసేవలు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దుచేశారు.

## మహాకుంభమేళా చిత్రకూట్‌లో శ్రీనివాసకల్యాణం

### - గోవిందనామస్మరణలతో భక్తుల తన్మయత్వం



**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** మహాకుంభమేళా సందర్భంగా త్రేతాయుగంలో శ్రీరాముడు సీతాదేవి, లక్ష్మణుడితో కలసి 12సంవత్సరాలు అరణ్యవాసం చేసిన పవిత్రమైన స్థలం మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో బుధవారం ఉత్తరాది అహోబిల మఠంలో కన్నులపండువగా శ్రీనివాసకల్యాణాన్ని జరిపించారు. ముందుగా తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవర్లను కల్యాణవేదిక వద్దకు వేంచేపుచేశారు. అక్కడ ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు వేదపండితులు వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మాంగళ్యపూజ, మంగళసూత్రధారణ మొదలైన ఘట్టాలతో శాస్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. చివరగా స్వామిఅమ్మవార్లకు నక్షత్రహారతి ,మంగళహారతి సమర్పించడంతో కల్యాణం విజయవంతంగా ముగిసింది. అక్కడ తిలకించిన భక్తులు పులకించారు. ఈ కార్యక్రమంలో 1008 రాజ్‌గురు పీఠాధీశ్వర్ స్వామిబద్రిప్రసన్నాచార్యజీ మహారాజ్, టిటిడి ఎస్టేట్ అధికారి గుణభూషన్‌రెడ్డి, బొక్కసం సూపరింటెండెంట్ గురురాజస్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో యదుగిరి యతిరాజస్వామి



**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** దైవనామస్మరణ, భక్తిభావంతోనే భక్తులకు మంచి జరుగుతుందని బెంగుళూరు మేల్కొటేమఠం పీఠాధిపతి యదుగిరి యతిరాజస్వామి తెలిపారు. బుధవారం ఉదయం శిష్యులతో కలసి తిరుమలకు వచ్చిన స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ ఆలయసాంప్రదాయంగా స్వాగతం పలికారు. మహద్వారం నుండి ఆలయంలోనికి చేరుకున్న స్వామి తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం మూలవిరాట్టును దర్శించుకున్నారు. వేదాశీర్వచనం అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమలలో దుకాణాలపై రెవెన్యూవిజిలెన్స్‌కన్నెర్ర



**తిరుమల,జనవరి 22ప్రభాత వార్తప్రతినిధి:** భక్తుల సేవపేరుతో రకరకాల దుకాణాలు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారులు తమకు కేటాయించిన స్థలంలోగాక అదనంగా స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై టిటిడి రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు కన్నెర్రజేశారు. ఆక్రమణలపై తొలగించడం షరామామూలే అయినా మళ్ళీ వ్యాపారులు తమ దుకాణాల స్థలాన్ని గాక ఇంకా అధికంగా ఖాళీస్థలం ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీనిపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందిన ఫిర్యాదుతో ఇప్పటికే పలుదఫాలుగా దాడులు చేసినా తాజాగా బుధవారం ఉదయం తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్, మినీవే ప్రాంతాల్లో ఈ ఆక్రమణలను తొలగించారు. దుకాణాదారులు తమకు కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు.

## నేటితో అధ్యయనోత్సవాలు ముగింపు



**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాలు గురువారం సాయంత్రంతో ముగుస్తున్నాయి. గత నెల 30వతేదీ ప్రారంభమైన ఈ అధ్యయనోత్సవాలు 25రోజులపాటు సాగింది. స్వామివారి ప్రాశస్త్యంపై 12మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు గోష్టిగానం చేస్తున్నారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4వేల పాశురాలను 25రోజుల పాటు తిరుమలేశుని ఆలయంలోపల రంగనాయకుల మండపంలో వైష్ణవులు పారాయణం చేశారు. తొలి 11రోజులు పగల్‌పత్తుఅని, మిగిలిన 10రోజులు రాపత్తుఅని వ్యవహరిస్తారు. 22వరోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వరోజు రామానుజ నూట్రందాది. 24వరోజులు స్వామివారి శాత్తుమొర, 25వరోజు (నేడు)అధ్యయనోత్సవాలు పూర్తవుతాయి.

# తిరుపతి సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి రూ.6కోట్లు

### శ్రీకాళహస్తిలోని బాలికల హాస్టళ్లను మోడల్‌గా తీర్చి దిద్దుతాం: కలెక్టర్



బాలికల హాస్టల్ ప్రారంభించి విద్యార్థులకు సూచనలిస్తున్న కలెక్టర్

**తొట్టంబేడు,జనవరి 22 ప్రభాతవార్త** బాలికలు ఆహ్లాద వాతావరణంలో చదువుకునేలా సాంఘీక సంక్షేమ కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అన్నారు. బుధవారం శ్రీకాళహస్తిలోని బాలికల వసతి గృహాన్ని ప్రారంభించిన శాసనసభ్యుడు, కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతిజిల్లాలో సాంఘీక సంక్షేమ శాఖ హాస్టళ్ళలో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ. 6కోట్లు మంజూరు చేసిందన్నారు. శ్రీకాళహస్తిలోని ఈ హాస్టల్‌ను రాష్ట్రంలోనే నెంబర్‌గా మోడల్‌గా అభివృద్ధి చేస్తామని వివరించారు. ంరెండు నెలల్లో సదుపాయాలుకల్పిస్తామన్న శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పట్టుబట్టి నెలలోనే బాగు చేయించాలని కలెక్టర్ ప్రసంసించారు. సమాజంలో బాలికల విద్య ఎంతో అవసరం అన్నారు. జిల్లా సాంఘీక సంక్షేమ శాఖాధికారి చెన్నయ్యతో కలసి వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఎంఎల్‌ఏ సొంతంగా పనులు ప్రారంభించి అక్కడున్న విద్యార్థులకు 48రోజులలో వసతి గృహంలో ఉన్నటువంటి టాయిలెట్స్ రూమ్స్, కిచెన్ బాగు చేయించటం బాలికల విద్యపట్ల శాసనసభ్యుడుకి గల గుర్తింపుకు నిదర్శనం అని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎంఎల్‌ఏ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్‌మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 6కోట్లు నిధులుమంజూరు చేసి ఉందన్నారు. శ్రీకాళహస్తిలోని హాస్టల్‌ను ఆదర్శంగా తీసుకొని ఇతర ప్రాంతాల్లో హాస్టళ్ళను తీర్చిదిద్దుతామని వివరించారు. శ్రీకాళహస్తిలో ఏడు హాస్టల్స్ ఉన్నాయని వాటిలో నాలుగు ఎంఎల్‌ఏ సొంత నిధులతో బాగు చేసారన్నారు. మిగిలిన వాటిని త్వరలోనే ప్రభుత్వ నిధులు మంజూరు చేసి బాగు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వరన్ ప్రకటించారు. శ్రీకాళహస్తి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తాను నెల ముందు పట్టణంలోని హాస్టళ్ళను తనిఖీ చేసామన్నారు. అయితే అక్కడ విద్యార్థులు దయనీయ స్థితిలో చదువుకకుంటున్నారని కనీసం సరైన వసతులు కాదు కదా బాత్‌రూంలకు సరైన తలుపులు కూడా లేదన్నారు.

ఈ పరిస్థితి తన నియోజకవర్గంలో ఉండటం తనకు అవమానం అనిపించిందన్నారు. రాబోవు రోజుల్లో జిల్లా కలెక్టర్ సహాయంతో కంప్యూటర్లు, బెడ్లు, ఆర్వో ప్లాంటు, వాషింగ్ ఏరియా, కిచెన్, లు ఏర్పాటుకు భరోసా ఇచ్చారన్నారు.

ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్, శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఇఓ టి. బాపిరెడ్డి, ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



## గోవిందరాజస్వామి ఆలయంలో కియోస్క్

**తిరుపతి, జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** సామాన్య భక్తులు సులభంగా రూపాయి నుండి లక్షరూపాయల వరకు విరాళాన్ని అందించేందుకు వీలుగా టిటిడి తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో కియోస్క్‌యంత్రాన్ని ఏర్పాటుచేసింది. ఎస్‌బిఐ ఆధ్వర్యంలో ఈ కియోస్క్‌యంత్రం ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ మునికృష్ణారెడ్డి, ఎస్‌బిఐ డిజిఎం లేఖామీనన్, ఆర్‌ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కాగా ఇప్పటికే టిటిడిలో ఎస్‌బిఐ ఆధ్వర్యంలో ఐదు కియోస్క్‌యంత్రాలు తిరుమల, తిరుపతి, దేవునికడపలోని ఆలయాల్లో వినియోగంలో ఉన్నాయి.

## రోడ్డు ప్రమాదంలో వేద విద్యార్థుల మృతిపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు సంతాపం

**విజయవాడ జనవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటకలోని సింధనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ముగ్గురు వేద విద్యార్థులు మరిణించడంపై మాజీ ఎఈసెం వైయస్. జగన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి కర్ణాటకలోని హంపీ ఆరాధన కార్యక్రమాలకు వెళ్తుండగా వాహనం బోల్తా పడిన ఘటనలో ముగ్గురు వేదపాఠశాల విద్యార్థులు , డ్రైవర్ చనిపోయిన ఘటన అత్యంత బాధాకరం. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను అన్నారు.

# ఐపిఎస్ అధికారి ఎన్.సంజయ్ బెయిల్‌పై తీర్పు వాయిదా

**విజయవాడ జనవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** సీఐడీ పూర్వ చీఫ్, ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ కేసులో ముందస్తు బెయిల్‌పై తీర్పును ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. గత ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక శాఖ డీజీగా, సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన కాలంలో సంజయ్ తన హోదాను అడ్డుపెట్టుకొని నిధులు దుర్వినియోగం చేశారంటూ ఏసీబీ అధికారులు కేసునమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిలు కోసం సంజయ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న క్రిత్యావ్ సంస్థ డైరెక్టర్లు శరణు వినయకుమార్, పాలవలస వెంకట తులసీరాం, సౌత్రికా సంస్థ డైరెక్టర్లు శరణు సూర్యలలిత వీరమాచనేని శ్రీహరిత దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును వాయిదా వేస రూ.1.75 కోట్ల మేర ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని ఏసీబీ తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టులో వాదనలు వినిపించారు. అగ్ని ఎన్వోసీ వెబ్‌సైట్, యాప్ అభివృద్ధి నిర్వహణ , 15 ట్యాబ్‌ల సరఫరా ఒప్పందం పేరుతో సౌత్రికా టెక్నాలజీస్ అండ్‌ఇన్‌ఫ్రా సంస్థకు సీఐడీ తరపున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై అవగాహన సదస్సుల నిర్వహణ ఒప్పందం పేరుతో క్రిత్యావ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రజాధనం దోచిపెట్టారన్నారు. పనులు పూర్తికాకముందే ఒప్పందం చేసుకున్న వారం రోజుల్లోనే సౌత్రికా టెక్నాలజీస్ సంస్థకు సొమ్ములు చెల్లించారని తెలిపారు. ఆ సంస్థలతో కుమ్మక్కై నిధులు దారిమళ్లించారని కోర్టుకు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సులక క్రిత్యావ్ సంస్థతో 2024 జనవరి 30న ఒప్పందం జరిగిందని, అదేరోజు చెల్లింపులు చేశారని ఏజీ వెల్లడించారు. వాస్తవానికి ఒప్పంద తేదీకి ముందే సీఐడీ అధికారులు సమక్షంలో సదస్సులు నిర్వహించారు. క్రిత్యావ్ సంస్థ సదస్సులు నిర్వహించకుండానే తప్పుడు బిల్లులు సమర్పించింది. కాంట్రాక్టు ఒప్పదం సంస్థలతో సంజయ్ కుమ్మక్కై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసారన్నారు. ఆ సొమ్ము తిరిగి సంజయ్‌కి చేరిందా లేదా అనేది దర్యాప్తులో తేలాలి. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారనే వాస్తవాలనూ వెలుగులోకి తేవడానికి సంజయ్‌ని కస్టోడియల్ విచారణ చేయాల్సి ఉంది. సంజయ్‌కి ముందస్తు బెయిలిస్తే దర్యాప్తునకు విఘాతం కలుగుతుంది. బెయిలు పిటిషన్‌ను కొట్టేయాలి అని ఏజీ పేర్కొన్నారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ లేదని కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటా రన్నారు. బెయిలు మంజూరుచేయాలని కోరారు. రెండు వైపులా వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

# విఐపిలకు సమయంకేటాయింపు: సామాన్య భక్తులకు సుదర్శనం

### సిసి కెమెరాలు:డ్రోన్లతో పర్యవేక్షణ - శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



విలేకరుల సమావేశంలోమాట్లాడుతున్న ఎంఎల్ఏ, కలెక్టర్, ఇఓ, ఆర్‌డిఓ

**శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే శివయ్య పండగను నభూతో అన్నట్లు నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నామని స్థానికశాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్, ఇఓ టి. బాపిరెడ్డి వివరించారు. బుధవారం పరిపాలనా భవనంలోని సమావేశం హాలులో జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఇప్పటి వరకు చేపట్టిన పనులను, చేపట్టాల్సిన పనులకు సంబందించి సుమారు మూడు గంటల పాటు సమీక్షించారు. తరువాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోవు మహ శివరాత్రి బ్రహ్మోత్సవాలలో విఐపిలకు ప్రత్యేకంగా ఉదయం సాయంత్రం సమయం కేటాయిస్తామన్నారు. సామాన్య భక్తులకు సుదర్శనమే లక్ష్యంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. సిసి కెమెరాల ఏర్పాట్లు డ్రోన్లతో పర్య వేక్షించనున్నట్లు వివరించారు. శ్రీకాళ హస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు సుదర్శనం సత్వర దర్శనానికి అధికారులకు ఆదేశించినట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి వివరించారు. క్యూలైన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వచ్చిన భక్తుడు అర్థగంటలో దర్శనం చేసుకొని బయటకు వచ్చేటట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది తాము సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శివరాత్రి పర్వదినాన 'స్వామి ముందు కూర్చొని ముందు తమ దర్శనం చేసుకునే' వాతావరణం ఉండదన్నారు. శివరాత్రి రోజుల భక్తులువాయులింగేశ్వరుని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తాం తప్పా 'కుటుంబపెత్తనం' ఉండదని సుధీర్‌రెడ్డి వివరిం చారు. శివరాత్రి 13రోజులు 24 గంటలు నీళ్ళు, భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తా మన్నారు. ఈ ఏడాది శివరాత్రికి ప్రముఖ సినీనటులను ఆహ్వానిస్తు న్నట్లు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రీకాళ హస్తీశ్వరుని బ్రహ్మో త్సవాలకు సంబంధించి ఉత్తేజంగా చూస్తుంటారన్నారు. అందుకే ఈ సారి ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. మరో సమావేశం ఫిబ్రవరి 1న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, దేవాదాయశాఖ మంత్రులతో సమీక్ష ఉంటుందని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి 13రోజుల్లో కనీసం పది లక్షల మంది భక్తులు దర్శించుకుంటారనే అంచనాలతో ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. ఎక్కడా భక్తులు నిరీక్షించకుండా టిక్కెట్లు కోసం ఇబ్బంది పడకుండా సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్ టిక్కెట్లు జారికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ వివరించారు.

## సంక్రాంతి ప్రత్యేక బస్సులతో రూ.21.11 కోట్ల భారీ రాబడి-

### రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**విజయవాడ జనవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి తమ స్వగ్రామాలు, పట్టణాలు, నగరాలకు వచ్చి. తిరిగి వెళ్లిన వారికోసం ఏపీఎస్‌ఆర్టీసీ నడిపిన 9097 ప్రత్యే బస్సులను నడిపింది. తద్వారా రూ. 21.11 కోట్ల రాబడి వచ్చింది. ఆ మేరకు ప్రణాళికాబద్ధంగా ఆర్టీసీ బస్సులను నడిపించి ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూసుకున్నామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డి తెలిపారు. అంచనాలకు అనుగుణంగా ఆర్టీసీ ఆదాయం లభించిందన్నారు. తొలుత 7200 బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేయగా, ప్రయాణికుల రద్దీ పెరగడంతో 9097 బస్సులు నడిపినట్లు వివరించారు.. సాధారణ రోజుల్లో ఆర్టీసీ రోజువారీ ఆదాయం సగటున రూ. 16-17 కోట్లు కాగా ప్రత్యేక బస్సుల కారణంగా ఈ నెల 20న ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ. 23.71 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈనెల 13 నుంచి 20 వరకు ప్రత్యే బస్సులు నడపగా ఇందులో మూడు రోజులు రూ. 20 కోట్లకు పైగా రాబడి సమకూరింది. అదనపు ఛార్జీలు లేకుండా బస్సులు నడపడంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల వైపు మొగ్గు చూపినట్లు తెలిపారు. సంక్రాంతి రద్దీ సమయంలో ఆర్టీసీ బస్సులు సరిపోకపోతే స్థానికంగా సమీప పట్టణాలకు ప్రయాణికులను తరలించేందుకు ప్రైవేటు బస్సులు ,స్కూల్ బస్సులు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. దీంతో ఈ నెల 11 న గుంటూరులో నాలుగు ప్రైవేటు బస్సులను వినియోగించారు. 12న విజయవాడలో నాలుగు స్కూల్ బస్సుల్లో ప్రయాణికులను తరలించారు.

# అమరావతి నిర్మాణానికి హడ్కో ద్వారా రూ.11 వేల కోట్ల రుణం

### - పురపాలక మంత్రి పి.నారాయణ



**విజయవాడ,జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం శుభవార్తచెప్పింది. రాజధాని నిర్మాణానికి రూ. 11 వేల కోట్లు విడుదల చేయాలని హుడ్కో నిర్ణయించింది. ఈ మేరకు ముంబైలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి హడ్కో ద్వారా రూ. 11 వేల కోట్ల రుణం కోసం తమ ప్రభుత్వం సంప్రదింపులు జరిపిందని ఆయన గుర్తు చేశారు. ఈ సంప్రదింపులతో హడ్కో సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ హడ్కో నిర్ణయంతో రాజధాని అమరావతి పనులు వేగవంతమవుతాయని ఆయన స్పష్టం చేశారు. గతేడాది మే, జూన్ మాసంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఆంధ్రప్రదేశ్ ఓటరు పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో గత ఐదేళ్లుగా.. అంటే 2019 నుంచి 2024 మే మాసం వరకు వైసీపీ పాలనలో రాష్ట్ర రాజధాని ఏదో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. రాజధాని అమరావతితోపాటు రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి తాము సైతం సహాయ సహకారాలు అందిస్తామంటూ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అగ్రనేతలు, ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సైతం ప్రకటించిన విషయం విధితమే. ఇక కేంద్రంలో ఎన్డీయే సర్కార్, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కేంద్ర బడ్జెట్‌లో సైతం అమరావతి నిర్మాణానికి నిధులు సైతం కేటాయిస్తోంది.

## జైళ్ల శాఖలో డ్రైవర్ పోస్టులకు మార్చి 2న రాతపరీక్ష

**విజయవాడ.జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** జైళ్ల శాఖ డ్రైవర్ పోస్టు లకు మార్చి 2న రాత పరీక్ష నిర్వహిస్తున్నామని జైళ్ల శాఖ డైరక్టర్ జనరల్ కుమార్ విశ్వజిత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైళ్ల శాఖలో 5 డ్రైవర్ పోస్టు లకు గాను గతంలో నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్ లో పాల్గొని అర్హత సాధించిన 311 మందికి ఈ ఏడాది మార్చి 2న వ్రాత పరీక్షను నెల్లూరు జిల్లా మూలపేట లోని ఏపీ స్టేట్ ట్రైనింగ్ అకాడమి ఫర్ రిఫార్మేషన్ సర్వీసెస పాత సెంట్రల్ జైల్ ఆవరణలో నిర్వహించనున్నామని తెలిపారు. ఎల్ఎంవీ అభ్యర్థులు ఉదయం 8గంటలకు, హెచ్ఎంవీ అభ్యర్థులు మధ్యాహ్నం 12గంటలకు పరీక్షా కేంద్రానికి హాజరుకావాల్సి ఉంటుం దన్నారు. నిర్దేశించిన సమయానికి హాజరుకాలేని అభ్యర్థులను పరీక్షా ప్రాంగణంలోకి అనుమతించబడరు అని చెప్పారు. మరింత సమాచారం కోసం సంబంధిత వెబ్ సైట్ ను సందర్శించాలని సూచించారు.

## ఆచార్య బేతవోలు రాంబ్రహ్మంకు డాక్టర్ ఉమర్ ఆలీషా పురస్కారం

### అవార్డుతో పాటు,రూ.50,116 నగదు బహూకరణ



**విజయవాడ, జనవరి22, ప్రభాత వార్తప్రతినిధి:** తెలుగునాట అత్యంత ప్రతిష్టాత్మక సాహిత్య అవార్డు" డాక్టర్ ఉమర్ ఆలీషా పురస్కారం ఈ ఏడాది ప్రముఖ సాహితీవేత్త ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు లభించింది. 554 ఏళ్ళ కితం పిఠాపురంలో నెలకొల్పబడిన శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠానికి డాక్టర్ ఉమర్ ఆలీషా 1928 నుంచి1945 వరకు షష్ఠ పీఠాధిపతిగా, ప్రముఖ కవిగా తెలుగు సాహిత్యంలో అవధాన ప్రక్రియతో సహా అనేక సంగతుల్లో నిష్ణాతులుగా నిలిచి ప్రసిద్ధిపొందారు. ఎంపీగాను సేవలు అందించారు. ఆయన పేరిట గత 35 ఏళ్ళగా సాహితీ సమితి ఏర్పడి కవులను కళాకారులకు పురస్కారాలు అందిస్తున్నారు. ఈ ఏడాది ఈ అవార్డు ఆచార్య బేతవోలుకు లభించింది. విశిష్ట జ్ఞాపిక రూ. 50,116 నగదు పురస్కారంగా అందిస్తారు. ఉమర్ ఆలీషా పురస్కారాలతో లబ్ధప్రతిష్టులకు నిర్దేశిత వార్షికాల్లో శ్రీహుస్సేన్ షా కవి పురస్కారాలు సమితి ఆధ్వర్యంలోనే అందజేస్తారు. ఈ నెల 23న పశ్చిమ గోదావరి భీమవరంలో డాక్టర్ ఉమర్ ఆలీషా 80వ వర్ధంతి, సాహితీ సమితి 32 వార్షికోత్సవ సభలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు అవార్డును కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణం రాజులు అందజేస్తారు.


నేరం చేసిన వాడిని శిక్షించడమే ప్రధానం కాదు. ఆ నేరం చేయడానికి ఏ పరిస్థితులు అతడ్ని పురికొల్పాయో వాటిని తొలగించడం ప్రధానం.

-ఎమ్.ఎన్.రాయ్

# భూగర్భజల సంక్షోభం?


నీటిని నీలిబంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలి బంగారమే అత్యంత విలువైంది. గొంతు తడారి పోతున్న వ్యక్తికి కావల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దురదృష్టం ఏమిటంటే వేసవిలో నీరు గగనమైపోతున్నది. వర్షాకాలంలో అంచానకు మించి వర్షాలు కురుస్తున్నా వేసవి వచ్చేసరికి నీటికష్టాలు ఇబ్బడిముబ్బడిగా ఏర్పడుతున్నాయి. ఈసారి కూడా ఎండాకాలంలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చే పరిస్థితులు గోచరిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో భూగర్భ మట్టాలు యేడాదియేడాదికి దిగజారిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా కూడా భూగర్భజలాల వాడకం ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. ఇందులో ఎనభై శాతానికిపైగా వ్యవసాయానికి, పదిహేను శాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం నానాటికీ తీవ్రస్థాయిలో పెరుగుతున్నప్పటికీ ఆ మేరకు భూగర్భ జలాల భర్తీకి ప్రయత్నాలు జరగకపోవడంతో మట్టాలు నానాటికీ తగ్గిపోతున్నాయి. మరొకపక్క గోదావరి, కృష్ణా, గంగా, యమున, కావేరి లాంటి జీవ నదుల నుండి కోట్లాది ఎకరాలకు సరిపడే నీరు నిరుపయోగంగా సముద్రం పాలవుతున్నది. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా దాదాపు మూడువందల ఘనపుకిలో మీటర్లకుపైగా భూగర్భజలాలు భారత్‌లో వినియోగించుకుంటున్నారు. దేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా, వీటిలో మూడో వంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలు తోడేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా బ్లాకులు పరిధిలోకి చేరుకొని దేశంలో భూగర్భజలాలు మరింత అడుగంటిపోతాయి. భారత్‌లో బోరుబావుల సంఖ్య గత అరవైయేళ్లలో దాదాపు నూటయాభై రెట్లుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉన్నది. వీటివల్ల కోట్లాది మంది సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవమే అయినా నీటి సంరక్షణ పద్ధతులు పాటించకుండా పొదుపు విస్మరించడంతో నానాటికీ బోరుబావుల మీద అధికంగా ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తుందని భూగర్భశాస్త్ర నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భూగర్భ జలాలను వృథాచేయడం కూడా పెరిగిపోతున్నది. పంజాబ్‌లో డెబ్బైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటకలో, తమిళనాడుల్లో నలభైశాతంపైగా భూగర్భజలాలు వాడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు దశాబ్దాల్లో దేశ వనరుల్లో అరవైశాతంపైగా హరించుకుపోతాయని ప్రపంచబ్యాంకు గతంలో ఒక నివేదికలో హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు రాజస్థాన్, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లో యేటా అరవైలక్షల కోట్ల లీటర్ల మేర భూగర్భజలాలను తోడేస్తుండడంతో సముద్ర మట్టాల్లో దాదాపు ఐదుశాతం పెరుగుదల నమోదు అవుతుందని గతంలో జరిపిన అధ్యయనంలో వెల్లడయింది. మరొకపక్క దేశంలో అధికశాతం జిల్లాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవే కావని, కేంద్రప్రభుత్వం అంగీకరించడం కలవరపరిచే పరిణామమే. గతంలో ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం 254 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో ఇనుము 224 జిల్లాల్లో ఫ్లోరైడ్, 162 జిల్లాల్లో క్షారత, 34 జిల్లాల్లో భూగర్భజలాలలో పాషాణస్థాయి అధికంగా ఉన్నట్లు వెలుగుచూసింది. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పాషాణం లాంటి లోహాలను భూగర్భజలాల నుంచి తొలగించడం కష్టతరంగా మారుతుందని అధికార వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఉచిత విద్యుత్ సరఫరాకూడా బోరుబావుల సంఖ్య పెరగడానికి కారణం అవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అంతగా అమలు కాకపోకవడం కూడా మరొక కారణంగా చెప్పొచ్చు. ఇక కొన్ని పరిశ్రమలు ప్రధానంగా శీతలపానీయాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. ఇంకొక పక్క దేశవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో కూడా వాడకం పెరిగిపోతున్నది. పాలకులకు చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహన లోపించిన కారణంగానే భూగర్భజలాల సమస్య రోజురోజుకు తీవ్ర రూపం దాలుస్తుందనే ఆందోళనలను తోసిపుచ్చలేం. భూగర్భ జలాల మట్టాల పెంపునకు దేశవ్యాప్తంగా చర్యలు తీసుకోవాల్సిన తరుణమిది. తెలంగాణ ప్రభుత్వం గతంలో మిషన్ కాకతీయ కార్యక్రమం తర్వాత చెరువులు, కుంటల్లో పూడికలు తీయించి మరమ్మత్తులు చేయించడంతో చాలా ప్రాంతాలలో భూగర్భజలాలు కొంతమేరకు పెరిగాయని చెప్పొచ్చు. కానీ అవి వాడుతున్న భూగర్భ జలాల మట్టాల ను భర్తీ చేయలేకపోతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు మంచినీటి సమస్య తీవ్రరూపం దాలు స్తున్నది. కోట్లాది మంది ప్రజలు పడరానిపాట్లు పడుతు న్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. కేవలం కలుషిత నీరువల్లనే దాదాపు ఇరవైఎనిమిది రకాల వ్యాధులు సంభవిస్తున్నాయని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. మరొకపక్క దేశవ్యాప్తంగా కోట్లాది రూపాయల మంచినీటి వ్యాపారం జరుగుతున్నది. యేడాది యేడాదికి ఆ వ్యాపారం విస్తరించిపోతున్నది. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాలి.

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్షిక్

అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.



వి.జాన్సన్

# ప్యాకేజీలతో సరా! సొంత గనులివ్వరేం!

**విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మినహా దేశంలో అన్ని ఉక్కు కర్మాగారాలకు 'కాప్టివ్ మైన్స్' (మూల గనులు) ఉన్నాయి. ప్లాంట్ నిరంతరం పని చేయడానికి వీలైనంత ఎక్కువ బఫర్ స్టాక్‌ను ఉంచుకోవడానికి వీలుగా వెంటనే ఇనుప ఖనిజం గనులను కేటాయించవలసిన అవసరం ఉంది. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంతంగా గనులు కేటాయించడం అవసరం. దీనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పకుండా కేంద్రప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ప్యాకేజీ ప్రకటించడం కేవలం కంటితుడుపు చర్య మాత్రమే. స్టీల్ ప్లాంట్‌కు ఉన్న సమస్యలకు అది ఎంత మాత్రమూ శాశ్వత పరిష్కారం కాదు.**

చిమ్మె.జాన్ బర్నబాస్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరు దశాబ్దాల క్రితం అమృతరావు అనే దళితుడు నిరాహార దీక్ష చేయగా 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అంటూ పెద్ద ఉద్యమానికి దారితీసింది. అప్పటి విశాఖ పట్టణం, లోక్‌సభ సభ్యుడు తెన్నేటి విశ్వనాథం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విశాఖ ఉక్కు కోసం కమిటీల్వ ఏర్పడి నిరాహార దీక్షా శిబిరాలు అన్ని పట్టణాలలో ఏర్పాటు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తీవ్రమైన నిరసనలు చేపట్టారు. ఈ పోరాటంలో అనేక మంది ప్రజలు ప్రాణాలర్పించారు. సుదీర్ఘమైన పోరాటంతో దిగివచ్చి ఆనాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఆంధ్రప్రదేశ్‌కు ఉక్కు ఫ్యాక్టరీని ప్రకటించి విశాఖ పట్టణంలో ఏర్పాటుకు అంగీకరించింది. ఇలా పోరాట ఫలితంగా ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్రప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంతో తెలుగు ప్రజలు తీవ్ర ఆవేదన చెందారు. దాదాపు ఐదు సంవత్సరాల నుంచి విశాఖపట్టణంలో నిరసనలు, నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, సభలు అన్నీ ఏర్పాటు చేశారు. అందులో పనిచేస్తున్న కార్మికులు, వాటి అనుబంధ సంఘాలు వారికి సంఘీభావం తెలుపుతున్న ప్రజలు ప్రజాసంఘాలు ఆందోళనతో పాల్గొంటున్నారు. దాదాపు వెయ్యిరోజుల నుంచీ నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. తాజాగా ఈ నిరసనలను శాంతింప చేయడానికీ, ప్రజలను మభ్యపెట్టడానికే కేంద్రప్రభుత్వం 11వేల 500 కోట్ల నిధులతో ఒక ప్రత్యేక ప్యాకేజీని ఈ ఉక్కు ఫ్యాక్టరీని ప్రకటించింది. కానీ వాస్తవానికి ఉక్కు ఫ్యాక్టరీకి కావలసింది ప్యాకేజీలు కాదు సొంత గనులు కావాలి. రాష్ట్రానికి సమీపంలో ఉన్న ముడిఖనిజం గనులతోనే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పునరుజ్జీవింప చేసే విధంగా యోచించాలి. అదే ఆంధ్ర ప్రజల ఆకాంక్ష. కేంద్రప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీకేవలం కంటి తుడుపు చర్య మాత్రమే. ఈప్యాకేజీని రాష్ట్ర ప్రజలు అంగీకరించడం లేదు. ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకొని ప్రభుత్వమే దానిని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేట్‌పరం చేయబోమనే ప్రకటన ఇంత వరకూ కేంద్రప్రభుత్వం చేయడం లేదు. తెలుగుదేశం జనసేన, భారతీయ జనతా ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కలిసివచ్చే లోక్‌సభ సభ్యుల మద్దతుతో కేంద్రప్రభుత్వాన్ని ఇప్పుడే ఒప్పించాలి. కేంద్రప్రభుత్వం ఆధారపడి ఉన్నది కాబట్టి ఈ సమయంలో కాకుండా భవిష్యత్తులో కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వ మాటను అంగీకరించే పరిస్థితిఉండదు. కేంద్రప్రభుత్వం రూ. 11,500 కోట్ల ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కూడా ఆమోదించింది. దీనికి అనుకూల మీడియా కేంద్రం 'విశాఖ ఉక్కుకు ప్రత్యేక ప్యాకేజీ' అంటూ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. కేంద్రం నిర్ణయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటిస్తూ 'ఇది భారీ పునరుద్ధరణ ప్యాకేజీ స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కుపోర్ట్ ఆథారిటీ స్టీల్‌ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్లతరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కును ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణమే అమలులోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి. ఆగస్టు నాటికి మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోనికి వస్తాయి. ముడి ఖనిజం కోసం ఎన్ఎమ్‌డిసితో చర్చి



స్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కుది కీలకపాత్ర. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ది కీలకపాత్ర. అంటూ అధికారికంగా కేంద్రమంత్రి ప్రకటించారు. అయితే ఆచరణలో కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని గౌతమ్ అదానీకి అప్పచెప్ప డానికి గత నాలుగు సంవత్సరాలుగా తీవ్ర ప్రయత్నం చేసిన నేపథ్యంలో తాజా ప్రకటన కాస్త ఊరట నిచ్చిందనుకున్నా ఉక్కు ఫ్యాక్టరీ భవిష్యత్‌పై ఇంకా ఆందోళన తొలగలేదు. విశాఖఉక్కు ఫ్యాక్టరీని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాతో విలీనం చేయడానికి కేంద్రప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోంది? ఈ ప్రశ్న ఉదయిస్తోంది. విశాఖఉక్కును బలోపేతం చేయడానికి అవసరమైన గనులను కేంద్ర ప్రభుత్వం కేటాయించకుండా ఒకరకంగా విశాఖ ఉక్కును బలహీనపరుస్తున్నదనే చెప్పాలి. బలోపేత చర్యలు చేపట్టకుండానే ఇప్పుడు ప్యాకేజీ ప్రకటించింది. ఎంతో మంది కార్మికులు విశాఖ ఉక్కు నిలబెట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గతఐదు సంవత్సరాల నుంచి కేంద్రప్రభుత్వ చర్యలను తిప్పికొడుతున్నారు. ప్రజాపోరాటాలకు భయపడే కేంద్రప్రభుత్వం ఈ ప్యాకేజీ ప్రకటించింది. ఒక పథకం ప్రకారం మోడీప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీని నష్టాల్లోకి నెడుతున్నదనే సందేహం రాక మానదు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు మద్దతు అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంతకు ముందు అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి కూడా విశాఖ ఉక్కు పరిరక్షణ కొరకు కృతనిశ్చయంతో ప్రయత్నం చేయలేదు. ప్రతి సంవత్సరం 7:3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖఉక్కు కర్మాగారం 2023–24లో రూ.4,848.86కోట్లు, 2022–23లో రూ. 2,858.74 కోట్లు నష్టాన్ని మూటగట్టుకొన్నది. ఉక్కు ఉత్పత్తి కొరకు పెట్టుబడి కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. కర్మాగారం నడవడానికి చేసిన అప్పులు పెరగడం, తగినంత ముడిసరుకులు లేకపోవడం, ఇతర సమస్యలు దీనికి అదనం. ఉత్పత్తిలో విశాఖ స్టీల్ ప్లాంట్ 120 శాతం రేటింగ్ సామర్థ్యంతో ప్రసిద్ధి చెందింది. గతంలో లాభాలు ఆర్జించింది. పాత ఆర్థిక వనరులను ఉపయోగించి ఉత్పత్తి 3.4మిలియన్ టన్నుల నుంచి 7:3మిలియన్ టన్నుల సామర్థ్యానికి పెరిగింది. మూలధన పెట్టుబడి, ముడిసరుకు సరిపడినంత సమకూరకపోవడంతో ప్రస్తుతం 50శాతం సామర్థ్యంతోనే నడుస్తున్నది. ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా పునరుద్ధరిస్తే వీలైనంత త్వరగా లాభాల్లోకి వస్తుంది. దీనికోసం వెంటనే మూలపెట్టుబడిని ఏర్పాటు చేసి అవసరమైన బ్యాంక్ రుణాలు తీసుకునేందుకు 'లెటర్ ఆఫ్ కంఫర్ట్' జారీ చేయాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మినహా దేశంలో అన్ని ఉక్కు కర్మాగారాలకు 'కాప్టివ్ మైన్స్' (మూల గనులు) ఉన్నాయి. ప్లాంట్ నిరంతరం పని చేయడానికి వీలైనంత ఎక్కువ బఫర్ స్టాక్‌ను ఉంచుకోవడానికి వీలుగా వెంటనే ఇనుప ఖనిజం గనులను కేటాయించవలసిన అవసరం ఉంది. విశాఖఉక్కు కర్మాగారానికి సొంతంగా గనులు కేటాయించడం అవసరం. దీనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పకుండా కేంద్రప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ఎన్నికలసమయంలో ఇచ్చినహామీని నిలబెట్టుకోవాలి. ప్యాకేజీ ప్రకటించడం కేవలం కంటితుడుపుచర్య మాత్రమే. స్టీల్ ప్లాంట్‌కు ఉన్న సమస్యలకు అది ఎంత మాత్రమూ శాశ్వత పరిష్కారంకాదు. ఇచ్చిన ప్యాకేజీ కేవలం రెండులేదామూడు నెలలకు మాత్రమే సరిపోతుంది. ప్యాకేజీలతో ఒరిగేదేమీ లేదు. స్టీల్‌ప్లాంట్‌కు 17వేల కోట్ల రూపాయలు అప్పులున్నాయని చెప్పుతున్న ప్రభుత్వం ప్యాకేజీ పేరుతో కేవలం 11,500కోట్ల రూపాయలు కేటాయించడం సమస్యకు పరిష్కారంకాదు. విశాఖస్టీల్ ప్లాంట్‌ను కాపాడడానికి కేంద్రప్రభుత్వం 'కాప్టివ్‌మైన్స్' కేటాయించి స్టీల్‌అథారిటీ ఆఫ్‌ఇండియాలో విలీనం చేయడం ఒక్కటే శాశ్వతపరిష్కార మార్గం. ●

# పర్యాటక రంగంపై యుద్ధాల ప్రభావం

కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రైన్ యుద్ధం ఎప్పుడు ఆగుతుందో తెలియదు కాని రోజుకో మలుపు తిరుగుతోంది. ఇరు పక్షాలు మాటల తూటాలు పేలుస్తున్నాయి. ఒకరి కీలక ప్రాంతాలపై మరొకరు దాడి చేశామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కి మాట్లాడుతూ 38 వేలకు పైగా శత్రు సైన్యం ను హతం చేశాం అని చెప్పారు. రష్యా ప్రధాన భూభాగం ఖిక్స్కి లో ఉక్రెయిన్ దళాలు ఉధృతంగా పోరు సల్పుతున్నాయి. మా దాడిలో రష్యా సైన్యం ఉత్తర కొరియా సైన్యం మరణించారు. అదే సమయంలో రష్యా కూడా మేము ఉక్రైన్ సైనికులను తమ బలగాలు హతమార్చాయని రష్యా ప్రకటించింది. ఇలా రెండు దేశాలు పరస్పర ప్రకటనలు చేయడం చూస్తున్నదే. ఇద్దరిలో ఎవరిది పై చేయో అర్థం కావడం లేదు. ప్రోక్రోస్కి ప్రాంతంలో రెండు దీటుగా పోరాడుతున్నాయి. ఫలితంగా ఉక్రైన్ లోని ఖర్కివ్, సుమి ప్రాంతాలలో రష్యా బాంబులు వేస్తోందని ఉక్రైన్ ఆరోపించింది. ఇది ఇలా ఉండగా రష్యా మిలిటరీ ఆస్తులు ధ్వంసం చేశామని జెలెన్ స్కి ప్రకటించారు. వెంటనే రష్యా కూడా ఓ ప్రకటన జారీ చేసింది. ఉక్రైన్ మాపై ప్రయోగించిన అమెరికా క్షిపణులను, డ్రోన్లను కూల్చి, కోలుకోలేని దెబ్బ తీశామని రష్యా ప్రకటించింది. ఇలా రెండు దేశాలు వ్యూహ ప్రతివ్యూహాలతోనే సరిపెట్టుకుంటున్నాయి. దేశ క్షేమంకోసం ఎవరూ చూడటంలేదు. ఇక అభివృద్ధి ఎక్కడ ఉంటుంది. ఎవరి భూభాగాల పరిరక్షణకు వాళ్ల మార్గం సుగమం చేసు



కుంటున్నారు. రెండు దేశాలు ఏభూభాగం పై దాడి చేద్దామా అనే సమాలోచనలు చేస్తున్నారు కాని శాంతికి అడుగు ముందుకు పడటం లేదు. అసలు ఆదిశలో అవి ఆలోచించడం లేదు, ప్రయత్నాలు చేయడంలేదు. రెండు దేశాలు కూడా ఏ కీలక ప్రాంతం పై దాడిచేద్దామా అనే ఆలోచనతో ఉన్నాయి. ఇటువంటి సమయంలోరష్యాను దర్శించటానికి ఇక పర్యాటకులు ఎలా వస్తారు. అదేవిధంగా ఉక్రెయిన్‌లో వైద్య విద్యను అభ్యసించటానికి విదేశీ విద్యార్థులు ఎలా వస్తారు? రెండు దేశాలు గణనీయ మైన ఆదాయాన్ని కోల్పోతున్నాయి. రష్యాలో పర్యాటకులు ఎవరూ అడుగు పెట్టడం లేదు. ఉక్రైన్ లోని మెడికల్ కళాశాలలో కూడా విదేశీ విద్యార్థులు లేరు. పోరు తగ్గి మాములు పరిస్థితులు వచ్చినా కొంత కాలం ఎవరూ ఆయా దేశాలలో అడుగు పెట్టరు. ఎందుకంటే పునర్నిర్మాన పనులలో అవి నిమగ్నమై ఉంటాయి. విదేశీ ధనం రావాలి అంటే రెండుదేశాలు శాంతి వాతావరణం నెలకొల్పాలి. వీటి సయోధ్యకు అమెరికా నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏ విధమైన చర్యలు తీసుకుంటాడో, ఒక వేళ యుద్ధం ఆగితే అతని చొరవతోనే ఆగిపోవాలి. ఉక్రైన్ కు ఆయుధ సరఫరా ఇక అందించం, శాంతి కోసం ప్రయత్నం చేస్తాం అందుకు ఇతర దేశాలు కూడా కలసిరావాలి అని పిలుపు ఇవ్వవచ్చు. దీనికి భారత్ సంసిద్ధతవెలిబుస్తుంది. రష్యా కూడా యుద్ధాన్ని సమాప్తిచేసి దెబ్బతిన్న ఉక్రైన్‌కు ఆర్థిక సహకారం అందచేసి తన ఉదారతను చాటుకోవాలి. ఉక్రైన్ కూడా చేతనైనంత సహాయ, సహకారాలు రష్యాకు అందచేయాలి. రెండు దేశాలు చాలా వరకు తీవ్రంగా దెబ్బతిన్నాయి కాబట్టి, ఒకరికొకరు దాడి, ప్రతిదాడి చేసుకోకుండా దేశం ,పౌరులకోసం, ప్రగతి, అభివృద్ధి, శాంతి కోసం అడుగు ముందుకు వేయాలి. ●

# ప్రజావాక్కు



## ఏమిటీ హత్యలు, ఆత్మహత్యలు?

ఇవి కొత్త కాకపోయినా ఈ మధ్య మరీ ఎక్కువయ్యాయి. భార్య భర్తలు మస్పర్థలతో పవిత్ర వివాహ బంధానికి ఏమాత్రం విలువనివ్వక ఒకరినొకరు చంపుకుంటున్నారు. ఇక ప్రేమించలేదని, పెద్దలు ఒప్పుకోలేదని, పరువు హత్యలు. ఇలా బహురూపాలలో జీవితాలు నాశనమైపోతున్నాయి. పిల్లలు సెల్ ఫోన్లను వదలటం లేదు. మందలిస్తే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరికి ఫోన్లను అలవాటు చెయ్యొద్దు మొర్రోఅనిమేధావులు పేపర్లలో టీవీలలో మొరపెట్టినా కన్నవారికి జ్ఞానోదయం కాకపోవటం మిక్కిలి విషాదకరం. ఇకపోతే కోల్‌కతాహాస్పిటల్ హత్యాచారం కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌కు చనిపోయే వరకూ జీవిత ఖైదువిధించడం, అలాగే ప్రియుడికి కూల్ డ్రింక్‌లో విషం కలపి హతమార్చిన యువతికి మరణ శిక్ష ఖరారు చేయడం చాలామంచిపని. హత్యలు, మానభంగాలు చేసిన వారికి సైబర్ క్రిమినల్స్‌కు మరణ దండనే సరియైన తీర్పు కాగలదు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

మహిళా సాధికారతకావాలని అనుకుంటే మరింత ఊతం పొదుపుసంఘాలకు అందించడంఅవసరం. ఉపాధి హామీలోఒక వ్యక్తికి ఉన్నఅర్హత కలిగిన 100రోజుల పని పూర్తి చేయించడం ద్వారా ఉన్నతి కార్యక్రమం ద్వారా మరింత మంది మహిళలను వ్యాపార వేత్తలుగా సొంత వ్యాపారస్తులుగా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడం సాధ్యం అవుతుంది. ఆహార రంగాలు, బట్టల పరిశ్రమ కుట్లు అల్లికలు వాతావరణం వేడెక్కకుండా చేపట్టేపేపర్ ప్లేట్ల పరిశ్రమలకు యజమానులుగా మహిళలు ఎదిగే అవకాశము ఉంది. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్ లాంటిరాష్ట్రాలు నేత పరిశ్రమ హబ్‌లుగా తీర్చిదిద్దే అవకాశం ఉంది.

-భారత అవినాష్, జనగామ

## ప్రమాదకరం

ఈమధ్య కొందరు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డుదాటుతున్న పాదచారులని ఢీ కొడుతూవారి ప్రాణాలు పోవడానికి, అంగవైకల్యానికి కారణమవుతున్నారు. అంతేకాదు రాంగ్‌రూట్లో వెళుతూ ఇతర వాహనదారులని ఇబ్బందిపెడుతున్నారు. ప్రమాదాలకుకారకులవుతున్నారు.

-ఎం.సాగర్, నల్గొండ

## నకిలీ డాక్టరేట్లు

విద్యార్థులు ఏళ్ల తరబడి రాత్రింబవళ్లు చదివి డాక్టరేట్ పట్టా తీసుకుంటుంటే, వివిధవిభాగాల్లో ప్రముఖులు, పలు రంగాల్లో అత్యున్నత సేవలుఅందించిన వారికిగుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చెస్తున్నాయి. పలుయూనివర్సిటీలు అయితే అలాంటి గౌరవడాక్టరేట్ల విశిష్టమైనపట్టాకు విలువ లేకుండా చేస్తున్నారు. కొందరు ప్రబుద్ధులు నకిలీ యూనివర్సిటీలను పెట్టి, డబ్బులు తీసుకొని గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేస్తున్నారు. అత్యంత గౌరవప్రదమైన డాక్టరేట్లను సంతలో కూరగాయలను అమ్మినట్టు అమ్ముతున్నారు. దేశంలో కొందరు నకిలీ యూనివర్సిటీల నిర్వాహకులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకొని, ఏజెంట్ల ద్వారా ప్రచారం చేసుకుని ఫేక్ డాక్టరేట్లను యథేచ్ఛగా విక్రయిస్తునాయన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా ఈ నకిలీ దందా జోరుగా సాగుతున్నా ప్రభుత్వ పరంగా నియంత్రణా చర్యలు చేపట్టడం దురదృష్టకరం. ఇటువంటి నకిలీ డాక్టరేట్లతో కొందరు యునివర్సిటీలలో అధిక వేతనాలకు ఉద్యోగాలు కూడా పొందుతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## సిబ్బందిని నియమించాలి

దేశవ్యాప్తంగా పులుల అభ్యరణ్యాలనిర్వహణకు దేశవ్యాప్త విధానం ఉండాలని సుప్రీంకోర్టు సూచించడం ఎంతో అవసరం, విలువైనది. ఏపిలో కొన్ని జిల్లాల్లో పులి ప్రయాణికులకు ఎదురుపడిన భయానక స్థితికి ప్రభుత్వ యంత్రాంగం సవాలుగా తీసుకొని చర్యలు చేశారు. ఇచ్చట ఇతర శాఖల సమన్వయం కోసం దేశవ్యాప్త విధానం రాష్ట్రాలకు ఎంతో మార్గదర్శకం. దీని అమలు కొంత భయాన్ని నివారిస్తుంది. సిబ్బంది అందుబాటు కూడా ముఖ్యం.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి!

పిల్లలు చెడు అలవాట్లకు బానిసలవడానికి ముఖ్య కారణం గారాబమే! పిల్లలను గారాబంగానే పెంచాలి, కాని అది హద్దుమీరినట్లయితే కొంప మునుగుతుంది చిన్నతనంలోనే పిల్లలు చేసే తప్పులను వెంటనే సరిదిద్దాలి. పసిపిల్లలు వాళ్లకేం తెలుసు అని అశ్రద్ధ చేస్తే, అవే క్రమంగా పెద్దవై వారి జీవిత పతనానికి కారణం అవుతాయి. తల్లిదండ్రులు కాస్త తీరిక చేసుకొని రోజుకు కనీసం ఒక గంటసేపయినా పిల్లల వద్ద కూర్చుని చదివించాలి.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

# నిరుద్యోగుల ఆశలు తీరేనా?

శ్రవణ్ కుమార్

మన దేశంలో మిగితా రాష్ట్రాలు భౌగోళికంగా ఏర్పడితే, తెలంగాణ ఒక భావోద్వేగా రాష్ట్రం. కదిలిస్తే ఇక్కడ అమర వీరుల తల్లుల కన్నీళ్లు కన్పిస్తాయి. నీళ్లు, నిధుల కోసం నాయకులు కొట్లాడితే కొలువులే కొలమానంగా తొలి నుండి తుది తెలంగాణ ఉద్యమంలో కొట్లాడింది విద్యార్థులే. తెలంగాణ వస్తే కోరుకున్న కొలువు వస్తదని, గొప్పగా బతుకుతాం అని విద్యార్థులు తమ జీవితాలని లెక్కచేయకుండా, ప్రాణాలని పణంగా పెడితే ఆ త్యాగాల పునాదులపై తెలంగాణ పురుడుపోసుకున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తొలి ఫలితం విద్యార్థులకే దక్కాలి. అది వారిహక్కు కూడా. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో నిరుద్యోగుల నిరాశనీ, అసంతృప్తినీ, ఆందోళనీ అర్థం చేసుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు పదేపదే మాది నిరుద్యోగుల ప్రభుత్వం అని, మా ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల బాధలు, సమస్యలు వినడానికి సిద్ధంగా ఉన్నదని ప్రకటించడం అంటే ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై సీరియస్‌గా ఉందనే విశ్వాసాన్ని నిరుద్యోగులకి కల్పించారు. కాంగ్రెస్ పార్టీ తనమేనిఫెస్టోలో పెట్టిన 2లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండరు అనేది ఒక సంచలనం. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలని శరవేగంగా భర్తీచేసి కొత్త సంవత్సరంలో పకడ్బందిగా జాబ్ క్యాలెండరు అమలు చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు పడుతున్నాయి. టీజీపిఎస్సీ ఛైర్మన్ పదవీకాలం పూర్తి కాకముందే కొత్త ఛైర్మన్‌ని నియమించడం మంచి పరిణామం. కోచింగ్ సెంటర్ల దోపిడీ నుండి గ్రామీణ పేద విద్యార్థులకీ విముక్తి కల్పించి, తల్లిదండ్రులకి లక్షల రూపాయల కోచింగ్ ఫీజు భారం తగ్గించేలా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తాం అని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత జాబ్ క్యాలెండరు అమలుకు ముందే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లని ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత ఖరీదైనా కోచింగ్‌ని ఉచితంగా అందించడంతోపాటు వసతి సౌకర్యం కల్పించాలి. కమ్మటి మాటలతో కడుపు నింపుతున్నదని, కానీ కొలువులు ఇవ్వకుండా కాంగ్రెస్ నిరుద్యోగులని నిలువునా మోసం చేస్తున్నదని నిరుద్యోగులంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. సంవత్సరం తిరిగేలోపే ఇచ్చిన హామీలని నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం నిరుద్యోగులని నమ్మించి మోసం చేసిందని నిరుద్యోగులంతా భగ్గుమంటున్నారు. కొలువుల కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పైకోటి ఆశలు నిరుద్యోగులు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వచ్చి సంవత్సరం పూర్తి అయ్యింది. రెండులక్షల ఉద్యోగాలు దేవుడెరుగు, 12వేల ఉద్యోగాలు ఇచ్చి 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రభుత్వం చెప్పుకుంది. ఇచ్చింది లేదు ఇచ్చేది లేదు అయినా నాయకులు పోటాపోటీగా కృతజ్ఞత సభలు ఎందుకు పెడుతున్నారో అర్థంకావడం లేదు. నిరుద్యోగులంటే నిరక్షరాస్యులు కాదు, చదువుకున్న వారిని కూడా సునాయసంగా మోసం చేస్తాం అంటే ఎలా? ఉద్యోగాల ఊసే లేదు. గౌరవ ముఖ్యమంత్రి పదేపదే చెప్తున్నా 55000 ఉద్యోగాల రికార్డు గురించి పరీక్ష రాసిన నిరుద్యోగులకి, పరీక్ష పట్టిన ప్రభుత్వానికి తెలుసు కానీ సామాన్య ప్రజలకి తెలియదు. ఇదే వాళ్ల బలం. పదేపదే రికార్డు స్థాయిలో ఉద్యోగాలని భర్తీ చేస్తున్నాం అని చెప్తూ ఇటు ప్రజల దృష్టిని ఆకర్షిస్తూ, అటు జాబ్ క్యాలెండరు, 2లక్షల ఉద్యోగాలని తొక్కిపెడుతు



న్నారు. చివరికి అప్పులంటూ, వర్గీకరణ అంటూ కాలయాపన చేస్తున్నారని నిరుద్యోగులంతా ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఉద్యోగాల భర్తీవిషయంలో ఎస్సీ వర్గీకరణఅడ్డంకి కాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తాం అంటూనే జాబ్ క్యాలెండరుని ఇటీవల విడుదల చేసింది. జాబ్ క్యాలెండరు అమలులో, ఉద్యోగాల భర్తీ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లోరాని అడ్డంకి తెలంగాణలో ఎందుకు వస్తున్నది?. నిరుద్యోగులు ఎన్నో కలలు కన్నారు, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే 2లక్షల ఉద్యోగాలని, జాబ్ క్యాలెండరు ద్వారా భర్తీ చేస్తుందని అనుకున్నారు. అంతే కాని అప్పులతో నిరుద్యోగుల జీవితాలని ముడివేయడం నిజంగా బాధాకరం. ప్రస్తుతం ఉన్న అప్పులు గత ప్రభుత్వం చేసిన అప్పులే, అయినా అప్పటి ప్రభుత్వం మీద ఉద్యోగాలు భర్తీ చేయడంలేదు అని ప్రస్తుత ప్రభుత్వ పెద్దలుపోరాడారు కదా, కొట్లాడారు కదా? అప్పుడు మీరు అప్పులుతో ఉద్యోగాలని ఎందుకు ముడిపెట్టలేదు? మేనిఫెస్టోలో పెట్టిన రెండు లక్షల ఉద్యోగాలని భర్తీ చేయాలనీ నిరుద్యోగులంతా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సు పెంపు చేస్తున్నట్టు, ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఉద్యోగుల వయస్సు పెంపు ప్రతిపాదనలని సిద్ధం చేయాలనీస్వయంగా ముఖ్యమంత్రి ఆదేశించడంతో మళ్లీ నిరుద్యోగులలో తీవ్ర నిరాశ నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొలువు వస్తదనీ అనుకున్న నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్టే, ప్రభుత్వం ఇచ్చిన హామీనీ నిరవేర్చకుండా రిటైర్మెంట్ వయస్సు పెంపు అనేది నిరుద్యోగుల కలలకి మరణ శాసనమే. యేండ్లకేండ్లు కుటుంబాలకి దూరంగా, అర్ధ ఆకలితో, అగ్గిపెట్టే అంత సైజు గదిలో ఉంటూ, అప్పులు చేస్తూ పోటీ పరీక్షలకి ప్రాణం పెట్టి చదివే నిరుద్యోగులపై కోలుకోలేని విధంగా కాంగ్రెస్ చేస్తున్న మోసంపై పోరాటం చేయాలనీ నిరుద్యోగులంతా నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఆర్థిక ఇబ్బందులు అనే కారణంతో ప్రభుత్వం రిటైర్ అయ్యే ఉద్యోగుల అన్ని రకాల బెనిఫిట్స్ చెల్లించకుండా తాత్కాలిక ఉపశమనం కోసం ఇలా ప్రభుత్వమే నిరుద్యోగుల ఉద్యోగ కలలని సమాధి చేస్తదని ఊహించలే. పేదరికం కారణంగా తల్లిదండ్రులకి ఆర్థిక భారం కాకూడదనే కారణంతోట్యూషన్ చెప్పడమో, రోజంతా క్యాటరింగ్ వెళ్లడమో, కరపత్రాలు పంచడమో, రాపిడో, జొమాటో, స్విగ్గివంటి పనులు చేస్తూ దయానియా పరిస్థితిలో, బాధని భరిస్తూ, దుఃఖన్ని దిగమింగుతూ పోటీ పరీక్షలకి సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వం నిరంకుషంగా ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంచడంపై రానున్న రోజులలో ఈ సమస్యపై మరో తెలంగాణ తరహా ఉద్యమం చేయాలనే ఆలోచనలో నిరుద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకి ఇచ్చిన హామీని నెరవేర్చకుండా, ఇలా ఉద్యోగాల వయస్సు పెంచుకుంటూఉన్న ఉద్యోగాలని, జాబ్ క్యాలెండరు అమలు చేయకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని, అవసరమైతే త్వరలో ఢిల్లీలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఎలా మోసం చేసిందో ఢిల్లీ ఓటర్లకి వివరించాలని నిరుద్యోగులు నిర్ణయం తీసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన గ్రూప్ 1 ఉద్యోగాలనీ ప్రభుత్వం ఏదోతప్పుడు జీవో 29 తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీల ఉద్యోగాలని లక్కోవాలనీ చూస్తున్నది. ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన జీవో 29తీసుకువచ్చిందని నిరుద్యోగులంత ప్రభుత్వంపై పోరాడారు. ఇ జీవో 29ప్రత్యేకత ఏమిటంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్ పాటించకుండా కేవలం మెరిట్‌కే ప్రాధాన్యతఇవ్వడంవల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వంటి బలహీన వర్గాల వారి కలలకి మరణశాసనం జీవో29. ఇప్పటికి జీవో 29 రాజ్యాంగ బద్ద మని హై కోర్ట్‌కానీ, ఏన్యాయస్థానం తెల్చాలే. కేవలం సాంకేతిక కారణంతో, కేసువేయడంలో జాప్యం అనే కారణంతో హై కోర్ట్ 29పై ఉన్నకేసులన్నింటిని కొట్టివేసింది. నిరుద్యోగమే లేని తెలంగాణకోసం ప్రభుత్వం కృషి చేయాలి. ఎప్పటికప్పుడు ఖాళీఅయ్యే ప్రతి ఉద్యోగాన్ని, భర్తీ అయ్యేలా ప్రభుత్వం కృషి చేయాలి. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జన్మతః పౌరసత్వం రద్దుపై
# 22 రాష్ట్రాలు న్యాయపోరాటం

## తొలి అడుగులోనే వివాదాస్పదంగా ట్రంప్ నిర్ణయాలు



**వాషింగ్టన్ డిసి, జనవరి 22:** వివాదాలతో సవారీచేయడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అలవాటుగా మారిపోయింది తన తొలివిడత అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో అనుసరించిన దూకుడు కూడా ఏమాత్రం తగ్గ లేదు. ఆయన ప్రమాణస్వీకారంచేసిన తర్వాత చేసిన తొలి సంతకాలు ఇపుడు ఆయనకు వివాదాలు తెచ్చిపెడుతున్నాయి. తాజాగా అమెరికా రాజ్యాంగం 14వ అధికరణం కింద ప్రవేశపెట్టిన జన్మతఃపౌరసత్వ హక్కు చట్టాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించి అందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకంచేసారు. శతాబ్దానికి పైగా అమలులో ఉన్న ఈ చట్టాన్ని రద్దుచేయడం వల్ల అమెరికాలో పుట్టిన పిల్లలకు ఇపుడు పౌరసత్వం లభించే అవకాశాలు లేకుండా పోతున్నాయి. వీటిపై ఇపుడు డెమొక్రాట్ల ఆధ్వర్యంలోని 22 రాష్ట్రాలు ఉద్యమిస్తున్నాయి. న్యాయపరంగా పోరాటానికి దిగుతున్నాయి. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్, వలస వాదుల సంఘాలు, తల్లులు కాబోతున్నవారు ట్రంప్ సంతకం చేసిన వెనువెంటనే కోర్టుల్లో పోరాటానికి పిటిషన్లు దాఖలుచేసారు. 22 డెమొక్రాట్ల అధీనంలోని రాష్ట్రాలతోపాటు కొలంబియా జిల్లా, శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి చెందిన వారు బోస్టన్, సియాటెల్‌కోర్టుల్లో దావాలు వేసారు.

అధ్యక్షుడు తనఅధికారాలు, పరిధినిమించి వ్యవహరించారని, అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని, అమెరికా గడ్డపై జన్మించినవారికి పౌరసత్వం మంజూరు అనేది దానంతటదే వస్తుందని అయితే ట్రంప్ ఉత్తర్వుకారణంగా ఇపుడు అన్నీ నిలిచిపోయేప్రమాదం ఉందని ప్రవాసభారతీయులందరూ కలిసి మరో దావావేసారు. ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేకుండా సుమారు 1.50 లక్షలమంది ఏటా అమెరికాలో జన్మిస్తున్న వారికి ఇపుడు పౌరసత్వం లేకుండాపోయే ప్రమాదం ఏర్పడుతుందని మసాచుసెట్స్ అటార్నీజనరల్ ఆండ్రియా జాయ్ కాంప్‌బెల్ అన్నారు. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ఆధారంగా 1868 నుంచి కూడా ఎవరు అమెరికాలో జన్మించినా వారికి ఆదేశ పౌరసత్వం లభిస్తుంది. ఇమ్మిగ్రేషన్ నేషనాలిటీ చట్టం 1952 ప్రకారం ఈ పౌరసత్వం మంజూరవుతుంది. 1868లోనే అమెరికా 14వ సవరణను ధృవీకరించారు. నాలుగేళ్ల అమెరికా సివిల్‌వార్ తర్వాత సుప్రీంకోర్టు నిర్ణయం ప్రకటిస్తూ ఆఫ్రికన్ అమెరికన్లకు పౌరసత్వ హక్కులేదన్నారు. ఆఫ్రికన్ అమెరికన్లకున్న ప్రాథమిక హక్కులు హరించవేసేవిధంగా ఈనిర్ణయం ఉందని అప్పట్లో అమలుచేయలేదు. బానిసలుగా వచ్చిన వారు అమెరికా పౌరులు కాలేరని అందువల్ల ఫెడరల్‌ప్రభుత్వంనుంచి వారికి రక్షణ లభించదని సుప్రీంకోర్టు డ్రెడ్ స్కాట్ వర్సెస్ సాన్‌ఫోర్డ్ కేసులో పౌరసత్వం మంజూరును తిరస్కరించింది. ఇపుడు ట్రంప్ ద్వారా ఈ వివాదాన్ని మళ్లీ రాజేసినట్లయింది. తండ్రి అమెరికన్ పౌరుడు కాకపోయి ఆతని భార్య అంటే జన్మించిన బిడ్డతల్లి అక్రమంగా అమెరికాలో ఉంటూ ప్రసవించినప్పటికీ ఆబిడ్డకు పౌరసత్వం మంజూరు కాదని ట్రంప్ ఉత్తర్వులు చెపుతున్నాయి. తాత్కాలికంగా చట్టబద్ధంగా తల్లి అమెరికాలో ఉన్నా, విద్యార్థి, టూరిస్టు వీసాలపై ఉన్నవారు, తండ్రి అమెరికా పౌరుడు కాకపోయినా లేదా శాశ్వత నివాసి కాకపోయినా వారిపిల్లలకు పౌరసత్వం వర్తించదు. ఇప్పటికిప్పుడు లెక్కలుచూస్తే అమెరికాలో 11 మిలియన్ల వరకూ అక్రమ వలసదారులున్నారు. గతేడాది జనవరినాటికి ఉన్న ఈ గణాంకాలు ఇపుడు 14 మిలియన్లకు పెరిగే అవకాశం ఉంది. వారి అమెరికాలోపుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం ఇచ్చే అవకాశం ఇవ్వాలి. ఇపుడు ట్రంప్ ఉత్తర్వులప్రకారం అయితే వారికి మెడికెయిడ్ ఆరోగ్య బీమాకూడా వర్తించదు. వారు పెద్దవారయి చట్టబద్ధంగా ఓటింగ్‌లో పాల్గొనడం, ఉద్యోగాలుచేస్తుంటే వారికి పౌరసత్వం ఇవ్వమంటే ఎలా అని రాష్ట్రాలు ఇపుడు కోర్టుల్లో వాదనలు వినిపిస్తున్నాయి. ఆయనకు నచ్చింది ఆయనకు చేసుకుపోతున్నా చివరకు కోర్టులు నిర్ణయిస్తాయని ఆయన సొంతంగా ఏదీ నిర్ణయించడానికి లేదని ట్రంప్ నిర్ణయం లక్షలాదిమందికి నచ్చలేదని అన్నారు. ఇపుడు చట్టరూపంలోకి రావాలంటే ప్రతినిధుల సభలో మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం అవుతుంది. సెనేట్‌లో రిపబ్లికన్లకు 53 మంది ఉన్నారు. 220 మంది ప్రతినిదులసభలో ఉంటే గ్రాండ్‌ఓల్డ్‌పార్టీకి ఇక మెజార్టీపరంగా ఢోకాలేదని అందుకే ట్రంప్ దూకుడుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఇపుడు మసాచుసెట్స్, న్యూహ్యాంప్‌షైర్‌లలో నాలుగు కేసులు నమోదయ్యాయి. నాలుగు రాష్ట్రాలు అయితే వాషింగ్టన్‌లో వేరవేరు కేసులు దాఖలుచేసారు. ఐదో లాసూట్ మేరిలాండ్ ఫెడరల్‌కోర్టులో దాఖలు చేసారు. గర్భిణీలబృందం ఈ కేసును దాఖలు చేసింది. అయితే ఇప్పటికిప్పుడు తాత్కాలిక ఉపశమనం వీరికి లభించవచ్చన్న భావన వ్యక్తం అవుతోంది. ప్రకృతి వైపరీత్యాలున్న దేశాలు, సాయుధ విప్లవాలున్న దేశాలు, అత్యంత తీవ్రస్థాయి సంఘటనలు చోటుచేసుకున్న దేశాలకు కొంత ఉపశమనం లభించవచ్చన్న అంచనాలున్నాయి. మొత్తం 17 దేశాలకు సంబంధించి పదిలక్షలమంది ప్రజలకు ఈ బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ సమస్యాత్మకం కానున్నదనే చెప్పాలి. ఈ దావాలతోపాటు నేషనల్ ట్రెజరీ ఉద్యోగుల సంఘం కూడా ప్రత్యేక లాసూట్ దాఖలు చేసింది. 37 ఏజెన్సీలకు ఈ ఏజెన్సీ ప్రాతినిధ్యం వహిస్తోంది.



## మణిపూర్ బీరేన్‌సింగ్ సర్కార్‌కు జెడియు మద్దతు ఉపసంహరణ

### ఏకైక జెడియు ఎమ్మెల్యే ఇపుడు ప్రతిపక్షంలోకి...

**ఇంఫాల్, జనవరి 22:** బీహార్ సిఎం నితీష్ కుమార్ ఆధ్వర్యంలోని జెడియు ఈశాన్యరాష్ట్రం మణిపూర్‌లోని బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. ఆపార్టీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే ఇపుడు ప్రతిపక్ష బెంచ్‌ల్లో కూర్చుంటున్నారు. మణిపూర్‌ప్రభుత్వ స్థిరత్వంపై ఈ ప్రభావం మచ్చుకయినా ఉండకపోయినా ఓపక్క బీహార్‌లో కీలక మిత్రపక్షంగా కొనసాగుతూ మణిపూర్‌లో ప్రతిపక్షంగా మారడాన్ని ఎవ్వరూ కూడా ఊహించని విషయంగా చెపుతున్నారు. కోన్రాడ్ సంగ్మా ఆధ్వర్యంలోని నేషనల్‌పీపుల్స్ పార్టీ కూడా మణిపూర్‌లో బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు ఆరుస్థానాలు గెలిచింది. ఎన్నికల తర్వాత కొన్ని నెలలకే ఐదుగురు ఎమ్మెల్యేలు బిజెపికి వెళ్లిపోయారు. దీనితో అధికారపార్టీ నంబర్లు మెజార్టీకి అనుగుణంగా మారాయి. ప్రస్తుతం బిజెపికి అసెంబ్లీలో 37 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో నాగా పీపుల్స్ ఫ్రంట్ ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు మద్దతివ్వడంతో ఇపుడు మెజార్టీ తగ్గుతుందన్న ప్రశ్న ఉదయించదు. బీరేన్‌సింగ్ జెడియు బీహార్ యూనిట్‌ను రన్‌చేస్తున్నారు. గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు ఆయన లేఖరాసారు. 2022లో జరిగిన ఎనినకల్లో మణిపూర్‌లో ఎన్నికలు జరిగాయి. జనతాదళ్ యునైటెడ్ నుంచి గెలిచిన ఆరుగురు అభ్యర్థులు వెనక్కి వచ్చేసారు. కొన్ని నెలల తర్వాత ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపికి పార్టీ ఫిరాయించారు.

స్పీకర్ ట్రిబ్యునల్‌లో ఈ అంశం పెండింగ్‌లో ఉంది. ఇండియా కూటమిలో జెడియు భాగస్వామి అయిన తర్వాత బిజెపి ఆధ్వర్యంలోని ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించింది. ఇపుడు ఏకైక జెడియు ఎమ్మెల్యేకు సీటింగ్ కూడా మార్చారు. మహ్మద్ అబ్దుల్ నసీర్‌కు విపక్ష బెంచ్‌ల్లో స్థానం కల్పించారు. నితీష్ కుమార్ ఆధ్వర్యంలోని జెడియు ఈ ఏడాది ఎన్నికల్లో 12 స్థానాలు గెలిచింది. బిజెపి మెజార్టీ మార్కు చేరేందుకువీలుగా మిత్రపక్షాలకు సైతం సీట్లు లభించాయి.

బిజెపి, జెడియులు బీహార్‌లో మిత్ర పక్షంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ఈఏడాదే జరగాల్సి ఉంది. జెడియు అధ్యక్షుడు బీహార్‌సీఎం నితీష్‌కుమార్ రాజకీయంగా ఎత్తుపల్లాలను చవిచూసిన వ్యక్తికావడంతో తిరిగి ఎన్డీయే కూటమిలోకి వచ్చేసారు.

## ఫెడరల్ డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బందికి లేఆఫ్‌లు!

### మెమో జారీ చేసిన ట్రంప్ కార్యవర్గం

**వాషింగ్టన్, జనవరి 22:** అగ్రరాజ్యానికి రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పాలనలో దూకుడు పెంచారు. ఇప్పటికే గత అధ్యక్షుడు జో బైడెన్ ఇచ్చిన 78 ఆదేశాలను రద్దు చేస్తూ డజన్ల కొద్దీ కార్యనిర్వాహక ఆదేశాలను జారీ చేశారు. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫెడరల్ డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బంది అందరికీ లేఆఫ్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వారందరినీ సెలవులో ఉంచాలని ఆదేశిస్తూ ట్రంప్ కార్యవర్గం ఓ మెమో జారీ చేసింది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డైవర్సిటీ, ఇన్‌క్లూజన్ ప్రోగ్రామ్‌లను నిర్వీర్యం చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఈ నేపథ్యంలోనే సిబ్బంది నిర్వహణ కార్యాలయం మెమో విడుదల చేసింది. దాని ప్రకారం డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బంది అందరినీ వేతనంతో కూడిన సెలవుపై పంపించాలని సంబంధితఏజెన్సీలకు ఆదేశాలు అందాయి. ఈ విభాగాలకు చెందిన అన్ని వెబ్ పేజీలను కూడా ఈ గడువులోగాతొలగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దీంతో పాటు డిఇఐ సంబంధిత శిక్షణ కార్యక్రమాలను తక్షణమే ముగించాలని ఏజెన్సీలకు సూచించారు. ఈ విభాగాలు చేసుకున్న ఒప్పందాలనుకూడా రద్దు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కొన్ని వెబ్ సైట్లను తొలగించారు.

వచ్చే శుక్రవారం నాటికి వీరికి లేఆఫ్‌లు ఇచ్చి ఫెడరల్ సిబ్బంది సంఖ్యలో కోత విధించాలని ట్రంప్ సర్కార్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాలకోతపై నూతనఅధ్యక్షుడి యంత్రాంగం నుంచి ఇంకా ప్రకటన వెలువడలేదు. అయితే తాజా నిర్ణయం ఎంతమందిపై ప్రభావం చూపనుందనేది ఇంకా స్పష్టం కాలేదు.



## ఓటమి తప్పదని తెలిసే ఆప్ రోజుకో హామీ

### ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, జనవరి 22:** దేశరాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ ప్రచారం ఊపందుకుంది. బిజెపి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాల్గొని ఆమ్ ఆద్మీపార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసారు. ఢిల్లీలో ఆప్‌కు ఓటమి తప్పదని, అది తెలిసేరోజుకో హామీ ఇస్తోందని, ఆపార్టీ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందని, దీనిపై అధికార పార్టీని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఆప్‌మోసాలకు శీష్‌మహల్ ఒక ఉదాహరణ అని ఢిల్లీ ఎన్నికల్లో కార్యకర్తలవల్లే బిజెపికి విజయం దక్కుతుందన్నారు. పోలింగ్‌కేంద్రంలో 50 శాతం ఓట్లు బిజెపికేపడేలా కార్యకర్తలు ప్రచారం చేయాలని మోడీ సూచించారు. ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ ఢిల్లీలో ప్రచారం హోరెత్తుతోంది. ఈసారి ఎలాగైనా రాష్ట్ర అధికారం చేపట్టాలని పట్టుదలతో ఉన్న బిజెపి అడుగడుగునా ఆప్ పై అవినీతి ఆరోపణలు, మద్యం పాలసీ, నేతల అరెస్టులను ప్రస్తావిస్తోంది. ప్రధానంగా ఇపుడు శీష్‌మహల్ అంటూ కేజ్రీవాల్ అద్దాలమేడ నిర్మించుకున్నారంటూ ప్రధాని తనదైనశైలిలో ఆరోపణలుచేస్తూ దూసుకుపోతున్నారు. ఆప్‌కూడా అందుకు తక్కువేమీ కాదన్నట్లుగా ఓపక్క లేఖాస్త్రాలు సంధిస్తూ, బిజెపిని ఇరుకున పెట్టేప్రశ్నలు సంధిస్తోంది.

## కోటలో మరో ఇద్దరు జెఇఇ విద్యార్థుల ఆత్మహత్య

**జైపూర్, జనవరి 22:** రాష్ట్రంలోని కోటలో కోచింగ్‌కు వస్తున్న అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఈనెలలోనే మొత్తంగా ఆరుగురు ఆత్మహత్యలపాలయ్యారు. అస్సాంకు చెందిన నాగాంవ్‌కు చెందిన పరాగ్ అనే విద్యార్థి విద్యార్థి బుధవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆతడు నివసిస్తున్న మహావీర్‌నగర్ ప్రాంతంలోని ఆతని ఇంట్లోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఇపుడు ఆత్మహత్యలకు కోట హబ్‌గా మారడంతోపాటు చెడ్డపేరు వస్తోందని విద్యాసంస్థలు కూడా కలవరపాటుకు గురవుతున్నాయి. వర్సిటీ ప్రవేశపరీక్షలు, పోటీపరీక్షల్లో తమ సత్తాను నిరూపించుకునేందుకుగాను విద్యార్థులు ఎక్కువగా రాజస్థాన్‌లోని కోటకు వస్తున్నారు. పరాగ్ ఉదంతానికి కొన్ని గంటలముందే అఫ్సాషేక్ అనే యువతి కూడా




హాస్టల్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. ఆమె గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన షేక్ వైద్యకళాశాలలో ప్రవేశం కోసం నీట్ పరీక్షకు సిద్ధం అవుతోంది. ఈ మృతదేహాలను పోస్టుమార్టం కోసం పంపించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. ఈనెలలోనే 19 ఏళ్ల నీరజ్ ఐఐటి జెఇఇకోసం చదువుకుంటున్న యువకుడు 7వ తేదీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆ తర్వాత 24 గంటలకే 20 ఏళ్ల అభిషేక్ అనే జెఇఇ విద్యార్థి మరణించాడు. ఇక ఈనెల 16వ తేదీ 18 ఏళ్ల అభిజిత్ జెఇఇకోసం శిక్షణకు వచ్చి ఆత్మహత్యకుపాల్పడ్డాడు. 24 గంటలు గడిచిన వెంటనే మనన్‌శర్మ అనే యువకుడు జెఇఇకోసమే వచ్చి ఆత్మహత్యచేసుకున్నాడు. పరీక్షలకు నాలుగురోజులకు ముందే జెఇఇ అభ్యర్థి ఒకరు ఆత్మహత్యచేసుకున్నాడు. గత ఏడాది 17 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా మొత్తం 38 కేసులునమోదయితే వాటిలో 23 కేసులు ఆత్మహత్యలుగా పోలీసులు నిర్ధారించారు. గత ఏడాది ఈ ఆత్మహత్యలు పెరుగుతున్న క్రమంలో విద్యార్థుల సంఖ్య తగ్గినప్పటికీ కోచింగ్ సంస్థలకు రూ.3500 కోట్లు ఆదాయం లభించింది.

## ఆర్జీకర్ ఘటనలో దోషికి మరణశిక్ష విధించాలి




### హైకోర్టును ఆశ్రయించిన బెంగాల్ సర్కార్

### దోషి, సిబిఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాతే పిటిషన్‌ను స్వీకరిస్తామన్న కోర్టు

**కోల్‌కత్తా, జనవరి 22:** ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కార్ కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అందరి వాదనలు విన్న తర్వాతే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకుంటామని న్యాయస్థానం తెలిపింది. దోషి సంజయ్‌రాయ్, సిబిఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఆ పిటిషన్‌ను స్వీకరిస్తామని స్పష్టం చేసింది. ఈ కేసుపై విచారణ జరుపుతామని తెలిపింది. కాగా ఈ కేసులో నిందితుడికి సియాల్దా కోర్టు విధించిన శిక్ష సరిపోదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయడాన్ని సిబిఐ వ్యతిరేకించింది.

కేసును విచారించిన సంస్థగా శిక్ష విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు తమకు మాత్రమే ఉందని ఇందులో జోక్యం చేసుకునే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొంది. గతేడాది ఆగస్టు 9 రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన కేసుపై ఇటీవల విచారణ జరిపిన కోల్‌కతాలోని సియాల్దా కోర్టు నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని వివరించింది. దీనిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్ సర్కార్ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది.



## ట్రంప్ వ్యాఖ్యలకు పనామా అధ్యక్షుడు ఘాటుగా కౌంటర్

**దావోస్, జనవరి 22:** పనామా కాలువ తమదేనంటూ గత కొన్నిరోజులుగా వ్యాఖ్యలుచేస్తున్న డొనాల్డ్‌ట్రంప్ ఇటీవల తన ప్రమాణస్వీకారం సమయంలోనూ ప్రస్తావించారు. ఆ కాలువను తప్పకుండా వెనక్కి తీసుకుంటామని ఘంటాపథంగా చెప్పారు. దీనిపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తీవ్రంగా స్పందించారు. ఈ కాలువను అమెరికా తమకేం బహుమతిగా ఇవ్వలేదని ఘాటుగా అన్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ములినో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పనామాకాలువపై ట్రంప్ చెప్పిన ప్రతిమాటను కూడా మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఎందుకంటే అదంతా నిజం కాదని, ఆకాలువ అమెరికానుంచి మాకు బహుమతిగానో, రాయితీగానో వచ్చింది కాదని, ఆ కాలువ మాదేనని మాకు మాత్రమే సొంతం అని చెప్పారు. ప్రమాణస్వీకారంలో ట్రంప్ మాట్లాడుతూ పనామా కాలువను చైనా పరోక్షంగా నిర్వహిస్తోందని మేం దాన్ని చైనాకు ఇవ్వలేదని పనామాకు ఇచ్చామని ఇపుడు దాన్ని వెనక్కి తీసుకుంటామని అన్నారు. ఈ వ్యాఖ్యలపైనే ములినో స్పందించారు. అంతేకాకుండా ఈ కాలువ విషయంలో చైనా ఎలాంటిజోక్యంలేదని ఆయన స్పష్టంచేసారు. పనామా ప్రజలు ఇలాంటిప్రకటనలతో తప్పుదారి పట్టించలేదరన్నారు. పనామా కాలువను 1914లో అమెరికా నిర్మించింది. ఆ తర్వాత ఇరుదేశాలమధ్య జరిగిన ఒప్పందంమేరకు 1999 డిసెంబరులో దీన్ని పనామాకు ఇచ్చేసింది. అయితే అమెరికా వాణిజ్య, నావికాదళ నైకలనుంచి పనామా దేశం భారీగా ఫీజులు వసూలుచేస్తోందని వీటిని తగ్గించాలని ట్రంప్ డిమాండ్ చేసారు. లేని పక్షంలో ఆ కాలువను వెనక్కి తీసేసుకుంటామని హెచ్చరించారు. దీనితో రెండుదేశాల మధ్య వివాదం రాజుకుంది.

## తుర్కియే ప్రమాదంలో 76కు పెరిగిన మృతుల సంఖ్య



**అంకారా, జనవరి 22:** వాయవ్య తుర్కియేలోని ప్రముఖ స్కీ రిసార్టుహోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతులసంఖ్య పెరిగింది. ఇప్పటివరకూ 76 మందిచనిపోయినట్లు అధికారికంగా ప్రకటించారు. మరో 51 మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్సలుపొందుతున్నారు. బోలు ప్రావిన్స్‌లోని కర్తాల్కాయ రిసార్టులోని 12 అంతస్తుల గ్రాండ్ కర్తాల్ హోటల్ రెస్టారెంట్‌లో తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన సమయంలో 234 మంది హోటల్‌లో ఉన్నట్లు అంచనా. ఆదేశ అంతర్గత మంత్రి ఆలీ యెర్లికాయ మాట్లాడుతూ కర్తాల్‌కాయలోని 12 అంతస్తుల హోటల్‌లో తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగిందని రిసార్టుగదుల్లోని తెరలను ఉపయోగించి కిందకు దిగేందుకు యత్నించారని అదికారులు తెలిపారు.

## కుంభమేళాలో మహాప్రసాదాన్ని వడ్డించిన రాజ్యసభ ఎంపి సుధామూర్తి!

**ప్రయాగ్‌రాజ్, జనవరి 22:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభమేళాను సందర్శించుకున్నారు ప్రముఖ వితరణశీలి, రాజ్యసభ ఎంపి సుధామూర్తి. మూడు రోజుల పర్యటన నిమిత్తం ప్రయాగ్‌రాజ్ చేరుకున్న ఆమె పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. స్థానిక ఇస్కాన్ క్యాంప్‌ను సందర్శించి భక్తులకు స్వయంగా మహాప్రసాదాన్ని వడ్డించారు. తొలుత ఇస్కాన్ కిచెన్‌కు వెళ్లిన ఎంపి అక్కడి వలంటీర్లతో కొంతసేపు ముచ్చటించారు. మెషిన్లతో భోజన తయారీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌంటర్ వద్ద నిలబడి కుంభమేళాకు వచ్చిన భక్తులకు చపాతీ, భోజనం వడ్డించారు. ఈ మహా కుంభమేళాను ఆమె 'తీర్థరాజ్'గా అభివర్ణించారు. తన పూర్వీకులకు తర్పణం వదిలేందుకు ఇక్కడకు వచ్చానని చెప్పారు. మహాకుంభమేళాలో ప్రముఖ ఆధ్యాత్మిక సేవాసంస్థ ఇస్కాన్, అదానీ గ్రూప్‌తో కలిసి నిత్యం లక్షమంది భక్తులకు భోజనాలు సమకూరుస్తోంది. తమ శిబిరాల్లో ఈ భోజనాలు వండి ప్రయాగ్‌రాజ్‌లోని కేంద్రాలకు చేరవేస్తోంది. ఆహారం పంపిణీకి అదానీ గ్రూప్ వంద వాహనాలు, వలంటీర్లనుసమకూర్చింది. దీంతో పాటు గీతా ప్రెస్‌తో కలిసి కుంభేమేళాకు వచ్చిన భక్తులకు ఆర్తి సంగ్రహ పుస్తకాలను ఉచితంగా అందిస్తోంది. అదానీగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదానీ కూడా తన కుటుంబంలో కలిసి ఇస్కాన్ శిబిరాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఇక్కడ భోజన తయారీలో వారు పాలుపంచుకున్నారు. యాత్రికులకు స్వయంగా వడ్డించారు..

## ఆటోడ్రైవర్‌ను ఆప్యాయంగా హత్తుకున్న సైఫ్ అలీఖాన్

**ముంబయి, జనవరి 22:** తన ప్రాణాలను కాపాడిన ఆటోడ్రైవర్‌ను బాలివుడ్ నటుడు తన నివాసానికి పిలిపించుకుని ఆతడిని ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని తన ప్రాణాలు కాపాడావని కృతజ్ఞతలు చెప్పారు. ఆటోడ్రైవర్ భజన్‌సింగ్ రాణా దాడిజరిగినరోజు ఆటోతో పోతుండగా ఒక మహిళ బిగ్గరగా అరుస్తూ రోకోరోకో అంటూ వచ్చిందని, వెంటనే తాను అక్కడ రక్తంతో తడిసిన ఒక వ్యక్తిని చూసానని వెంటనే ఆటోలో ఎక్కించుకుని అక్కడికి సమీపంలోనే ఉన్న లీలావతి ఆసుపత్రికి తీసుకుని వెళ్లినట్లు చెప్పారు. అంతకుముందు ఆసుపత్రిలోనే నటుడు రాణాను లీలావతి ఆసుపత్రిలో కలిసి ఆతడికి కృతజ్ఞలు తెలిపారు. సైఫ్ ఆలీఖాన్ రాణా పక్కనే నిలుచుని చిరునవ్వుతో ఫోటోలకు పోజులిచ్చారు.

ఇదిలాఉంటే సకాలంలో స్పందించి ముఖ్యమైన వ్యక్తులు,ఒక సెలబ్రిటీ నటుడికి సకాలంలో చికిత్స అందేవిధంగా స్పందించినందుకుగాను ముంబయిలోని ఒక ప్రైవేటు సంస్థ ఆటో డ్రైవర్‌కు 11 వేల రూపాయల నగదు బహుమతి నిచ్చింది. అంతేకాకుండా భజన్‌సింగ్‌ను దుశ్శాలువతో సత్కరించింది. తనకు మధ్యాహ్నం 3.30 గంటలకు టైమ్ ఇచ్చారని, తాను అక్కడికి వెళ్లేసరికి 4-5 నిమిషాలుగడిచాక లోనికివెళ్లానని,ఆయన కుటుంబం మొత్తం తనను పలకరించారని, అందరూ తనను ఎంతో గౌరవంగా చూసారని అన్నారు.

## ఆరోగ్యశాఖలో 'ఆప్' రూ. 382 కోట్ల అవినీతి: అజయ్ మాకెన్

**న్యూఢిల్లీ, జనవరి 22:** దేశరాజధానిలోని ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్‌పై కాంగ్రెస్ విరుచుకుపడింది. ఆరోగ్యశాఖలో ఆప్ సర్కార్ రూ.382 కోట్ల అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లీకైన నివేదికలోని వ్యత్యాసాలను పేర్కొంటూ ఆప్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ 14 కాగ్ నివేదికలు చూపుతున్నాయని తెలిపారు. అవినీతిపై పోరాటం చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారని దుయ్యబట్టారు. ఢిల్లీ మద్యం పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ నివేదిక పేర్కొందని అన్నారు. ఆప్ నేతలు తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోఅని అసెంబ్లీలో నివేదికలను ప్రవేశపెట్టకుండా నిలిపివేస్తున్నారని ఆరోపించారు. కొవిడ్ మహమ్మారి సమయంలో కేంద్రం మంజూరు చేసిన నిధులలో 56 శాతం నిధులను ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి వినియోగించుకోవడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు.ఆసుపత్రుల్లో రోగుల కోసం పడకలను పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఆసుపత్రుల్లో పడకలు, ఇతర సౌకర్యాలను కాగ్ తనిఖీ చేసిందని, సిబ్బంది కొరత కారణంగా ఉన్నట్లు గుర్తించిందని అన్నారు.

## మాకు స్మశాన స్థలం ఇవ్వండి మహా ప్రభూ...- రోడ్డుపై బైటాయించిన దళితులు

# పోలీసులతో వాగ్వాదం, ఉద్రిక్తత

**తణుకు, జనవరి 22(ప్రభాత వార్త):** తణుకు పట్టణంలోని ఇరగవరం కాలనీలోని స్మశాన స్థలంపై వివాదం ముదిరింది. ఈ స్థలం తమకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా స్థానిక దళిత సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నారు. అయితే బుధవారం స్మశాన స్థలాన్ని శుభ్రం చేసుకుంటూ ఉండగా పోలీసులు అడ్డుకోవడంతో వివాదం రేగింది. ఇరగవరం కాలనీ శివారులోని సుమారు 3 ఎకరాల స్మశాన స్థలంలో చెట్లు తొలగించడంతోపాటు తుప్పలను తొలగించుకోవడానికి స్థానికులు సన్నాహాలు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ దృష్టికి స్థానికులు తీసికెళ్లారు. అయితే మున్సిపాల్టీకు చెందిన స్థలం కాబట్టి సంబంధిత సిబ్బంది శుభ్రం చేయించి ఇస్తారని చెప్పడంతో అందుకు నిరాకరించిన స్థానికులు దళితులకు సంబంధించిన స్థలమనీ పూర్వీకుల నుంచి సంఘానికి చెందిన స్థలంగా కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. అయితే మంగళవారం స్మశాన స్థలంలో చెట్లు నరికేయడంతో మరోవర్గం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

**రోడ్డుపై బైటాయింపు...**

వివాదం మరింత ముదరడంతో ఇరగవరం రోడ్డులోని స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట రోడ్డుపై టెంట్లు వేసి నిరసన తెలియజేశారు. ఈ సమయంలో పట్టణ సీఐ కొండయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది చేరుకుని టెంట్లు తొలగించేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయంగా కొమరవరం రోడ్డు నుంచి రాకపోకలను మళ్లించారు. ఇదిలా ఉంటే తమను అవమానరంగా మాట్లాడిన



మున్సిపల్ కమిషనర్ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ స్మశాన స్థలంలో అనుమతులు లేకుండా చెట్లు నరికివేయడంతో పోలీసులు సాయంతో అడ్డుకున్నట్లు చెప్పారు. మున్సిపాల్టీకు చెందిన స్థలంలో తమ సిబ్బంది శుభ్రం చేసి అప్పజెబుతామని చెబుతున్నట్లు చెప్పారు.

# పాలకొల్లు నియోజక వర్గంలో

# రూ 100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఏటిగట్టు పటిష్టతకు శాశ్వత పరిష్కారం.
- పంచాయితీలకు జవసత్వాలు
- రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి రామానాయుడు...



**యలమంచిలి...నరసాపురం ప్రభాతవార్త :** పాలకొల్లు నియోజక వర్గంలో ఆరునెలల కాలంలో 60 గ్రామాలకు రూ 100 కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని,రానున్న కాలంలో దశలు వారీగా అన్ని పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం యలమంచిలి మండలం ఊటాడ, యలమంచిలి, అడవిపాలెం గ్రామాల్లో కోటి రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి రామానాయుడు శ్రీకారం చుట్టారు. ఆయన స్వయంగా మోటరు సైకిల్ నడుపుతూ ప్రజలకు అభివాదాలు చేసు కుంటూ, యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంటూ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామాలలో ప్రజలు అడుగడుగునా మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఏటుగట్టు పటిష్టతకు శాశ్వత చర్యలు తీసుకుని ఈ ప్రాంత ప్రజలను ముంపు నుండి కాపాడతామని, ఎవరు ఆందోళన చెందవలసిన పనిలేదన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులతో పాటు పంచాయతీల సొమ్మును కూడా దారి మళ్ళించి, పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులను కాజేసి సర్పంచులను బిక్ష మెత్తుకునేలా చేస్తే, నేటి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులిచ్చి,గ్రామ పాలక వర్గాన్ని గౌరవంగా తలెత్తుకునేలా చేసిందన్నారు. గత ప్రభుత్వ అధినేత వేల కోట్ల ప్రజాధనంతో విలాస వంతమైన ప్యాలెస్ లు నిర్మించుకుంటే, నేడు చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడం ద్వారా పరిశ్రమలు, పారిశ్రామిక వేత్తలను రప్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. గత పాలనలో నివాసయోగ్యం కాని స్మశానాలు, చెరువులు, ముంపు ప్రాంతాలు,పల్లపు భూములు వంటివి పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చి కమీషన్లు తీసుకుని నిరుపేదలను మోసం చేశారని అన్నారు. ఒకేసారి పింఛన్లను పెంచి మూడు నెలలు బకాయిలతో నగదును ప్రతి ఇంటికి వెళ్ళి పంపిణీ చేశామన్నారు. ల్యాండు టైటిలింగు రద్దు చేసి ప్రజలు ఆస్తికి భద్రత కల్పించామని, 200 అన్నా క్యాంటీన్లు ప్రారంభించి నిరుపేదలకు కేవలం 15 రూపాయలకే మూడు పూటలా భోజనం పెడుతున్నామన్నారు. మరో ఎనభై అన్నా క్యాంటీన్లు త్వరలో ప్రారంభిస్తామని, నిరుపేదలు ఎవ్వరూ ఆకలితో అలమట్టించకూడదన్నది ప్రభుత్వ ఆలోచన,ఆశయం అని అన్నారు. మా హయాంలో ఒక హెక్టారుకు ఇన్పుట్ సబ్సిడీ రూ 20 వేల రూపాయలు ఉంటే గత ప్రభుత్వం రూ 16 వేలకు రూపాయలకు తగ్గించిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక హెక్టరుకు ఇన్పుట్ సబ్సిడీ రూ 25 వేల రూపాయలకు పెంచామన్నారు. గత ప్రభుత్వం ఒక్క డిఎస్సీ గాని ఒక ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేక పోయిందని, మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం ద్వారా 16,500 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశామని వచ్చే విద్యా సంవత్సరం లోపుగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. నిరుపేద కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత గ్యాసు సిలిండర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నారని వీరికి తోడుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారాలతో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు గ్రంధి నాగవెంకట పవన్ కుమార్,డిఇలు కలవకొలను దుర్గారామ స్వామి,పి.శ్రీనివాస రావు, రామాయణం త్రిమూర్తులు, యంపిడివో కార్యాలయ ఏవో జి. శ్రీనివాస రావు,పంచాయతీ రాజ్ సహాయక ఇంజనీరు వై.వి.ఆర్. నాగేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు,గ్రామ సర్పంచులు బుడితి జయరాజు, బర్రె మేరీ, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు,బోనం నాని, ఉన్నమట్ల కబర్ధి,బొప్పన హరి కిషోరు,తోటకూర అప్పల నరసింహా రాజు, చిట్టూరి సీతారామాంజనేయులు, అరిమిల్లి రామ శ్రీనివాసు, కడలి గోపాలరావు,మాత రత్నరాజు,తాళ్ళ నాగరాజు, కోడి విజయ భాస్కర్,పీతల శ్రీనివాసు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

## దీపం పథకంపై గ్యాస్ డీలర్లు, పౌర సరఫరాల అధికారులతో సమావేశం.

### జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి.

**ఏలూరు టౌన్ , జనవరి, 22, ప్రభాత వార్త :** దీపం పథకం లబ్దిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల పై విచారించి 17 మంది ఎల్ పిజి డీలర్లకు నోటీసులు ఇవ్వడం జరిగిందని జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో బుధవారం దీపం పథకం అమలుపై జిల్లాలోని గ్యాస్ డీలర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపం పథకంపై లబ్దిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ అనంతరం రుజువు అయ్యిన యెడల సదరు గ్యాస్ ఏజెన్సీల పై తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆదే విధంగా సంబంధిత ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న సిలిండర్లకు తాము చెల్లించిన నగదు మూడు రోజుల్లోపు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని పలువురు లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేశారని ఆమె తెలిపారు. లబ్దిదారులు దీపం 2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ. 80 నుండి రూ. 150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్ లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అటువంటి చర్యలకు పాల్పడితే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డీలర్లు బాధ్యత వహించాల్సివుంటుందని హెచ్చరించారు. గ్యాస్ వినియోగదారులు, వారికిచ్చిన రశీదులో ముద్రించి ఉన్న ధర కంటే అదనంగా చెల్లించనవసరం లేదని, కాకుండా లబ్దిదారుల నుండి గ్యాస్ ఏజన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేసినట్లయితే, వినియోగదారుడు సంబంధిత అయిల్ మార్కెటింగ్ కంపెనీ సేల్స్ అధికారికి, మండల తహశీల్దార్/పౌర



సరఫరాల తహశీల్దార్ లేదా జిల్లా పౌర సరఫరాల అధికారి వారికి ఫిర్యాదు చేయాలని లేదా టోల్ ఫ్రీ నెం 18004256453/1967 టోల్ ఫ్రీ నెంబర్లుకి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చున్నారు. వినియోగదారుడు గ్యాస్ సిలిండర్ తీసుకును సమయములో తూకములో తేడా ఉన్నట్లు అనుమానం ఉన్నయడల సదరు డెలివరీ బాయ్స్ ద్వారా తూకం సరిచూచుకోవాలన్నారు. ప్రతీ గ్యాస్ కంపెనీ డెలివరీ సమయంలో" హ్యాండిల్ వేయింగ్ స్కేలు" వినియోగదారుని వద్దకు తీసుకువెళ్లాని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అర్హులయిన దీపం .2 పథకం లబ్దిదారుల యొక్క డేటా ఈకెవైసి, ఆధార్ సీడింగ్ , బ్యాంకు లింకింగ్ ఇతర రైసు కార్డు సమస్యలు ను ఎప్పటి కప్పుడు తెలుసుకొని సమస్యలను త్వరితగతిన పరిస్కరించి వారి ఖాతా లో సబ్సిడీ పడేటట్లు చూడాలని డిఎస్ఓ ను ఆదేశించారు. సమావేశంలో డిఎస్ఓ ఆర్ . ఎస్ .ఎస్ సత్యనారాయణ రాజు, హెచ్ పిసిఎల్ ఎం . వెంకటేశ్వర్లు, ఐఓసిఎల్ ప్రసాద్ , తూనికల కొలతల ఇన్స్పెక్టర్, పౌర సరఫరా డిప్యూటి తహశీల్దార్లు , జిల్లాలో గల గ్యాస్ డీలర్లు అందరూ పాల్గొన్నారు.

## వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయకర్

**నరసాపురం, జనవరి 22: ప్రభాతవార్త :** ఆలిండియా వీవర్స్ పెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ను ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విప్ మరియు శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ చేతుల మీదుగా స్థానిక వారి ఆఫీస్ వద్ద క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ సంయుక్త కార్యదర్శి అలంక నాగేశ్వరరావు, నరసాపురం కర్ణ భక్త ల సంఘం అధ్యక్షులు సమతం వెంకటేశ్వరరావు , ట్రెజరర్ సమతం శివప్రసాద ,డాక్టర్ లైసెట్టి రాజేంద్ర ప్రసాద్ , ఆకాశపు వేణు, బాసిన కోటి, మావూరి ఆనంద్, ఉటుకూరి చంటి, జిలగం వెంకట సత్యనారాయణ, తుతిక శ్రీనివాసరావు, నక్కిన హరి,నల్ల వెంకట్రావు,తిప్ప



శ్యాంప్రసాద్,కటకం కామేశ్వరరావు , తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గాదిరాజు బాబును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి,మాజీ మంత్రి చెరుకువాడ


**భీమవరం జనవరి 22 ప్రభాతవార్త :** డిఎన్నార్ కళాశాల అసోసియేషన్ సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు )ను వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మాజీ మంత్రి శ్రీ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరితోపాటు మాజీ ఎఎంసి చైర్మన్ తిరుమాని ఏడుకొండలు,హరిబాబు రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ,డా గోపాలకృష్ణరాజు చిన్నపిల్లల వైద్యులు, డా .రాజన్ రాజు ఇ ఎన్ టి స్పెషలిస్ట్ ,డా బాలకృష్ణ ఎన్టీ నిపుణులు,డా విశ్వనాధరాజు, గోట్టిముక్కల సూర్యనారాయణరాజు టీడిపి లీడర్,శ్రేయోభిలాషులు భీమవరంలోని పట్టణంలోని ప్రముఖులు వచ్చి బాబును



పరామర్శించి, సోమరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించి సంతాపం తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

**కాళ్ళ జనవరి 22(ప్రభాతవార్త):** మండలంలోని కాళ్ళకూరుస్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో హుండీ లెక్కించగా రూ. 21,31,807/–లు ఆదాయం ఇచ్చినట్లు కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. స్వామివారి దేవస్థానము నందు 97 రోజులుకును రూ: 21,31,807/–లు వచ్చినట్లు ఆయన తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆకివీడు సమూహ దేవాలయాల కార్యనిర్వహణ అధికారి అల్లూరి సత్యనారాయణ రాజు సమక్షమున ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగిందన్నారు. గ్రామస్తులు, భక్తులు, మహిళా మండలి సభ్యులు దేవదాయ ధర్మాదాయ శాఖ ఆకివీడు సమూహ దేవాలయాల కార్యనిర్వహణ అధికారి శ్రీఅల్లూరి.సత్యనారాయణ రాజు సమక్షమున



హుండి తెరిచి లెక్కించడం జరిగిందన్నారు.

# బీజేపీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలిగా ఐనంపూడి శ్రీదేవి

## -సేవా రంగాల్లో మేటి శ్రీదేవి

**తణుకు, జనవరి 21 (ప్రభాత వార్త):** భారతీయ జనతా పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలుగా తణుకు పట్టణానికి చెందిన ఐనంపూడి శ్రీదేవి నియమితులయ్యారు. ప్రస్తుతం తణుకు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా శ్రీదేవి వ్యవహరిస్తున్నారు. అత్తిలి మండలం కంచుమర్రు గ్రామానికి చెందిన కొత్తపల్లి రామరాజు, రంగమ్మ దంపతుల కుమార్తె ఐనంపూడి శ్రీదేవి 1975 డిసెంబర్ 12వ తేదీన జన్మించారు. తండ్రి వ్యవసాయం చేస్తుండగా తల్లి గృహిణి. శ్రీదేవి పదో తరగతి చదువుతుండగా వివాహం జరిగింది. వివాహానంతరం ఇంటర్, డిగ్రీ ప్రైవేట్‌గా పూర్తి చేశారు. చిన్నతనం నుండి ఇతరులకు సాయపడాలనే ఆకాంక్ష, సోషల్ సర్వీస్‌లో ఇష్టంతో జాతీయ నాయకులు, ప్రముఖుల పుస్తకాలు, కథల పుస్తకాలు ఎక్కువగా చదివేవారు. అలాగే చిన్నతనం నుండి దేవుని పూజలు, సేవలు ఎక్కువగా చేస్తూ ఉండేవారు. వివాహం అనంతరం భర్త ఐనంపూడి రామరాజు వ్యాపార రీత్యా శ్రీదేవి కుటుంబం 15 సంవత్సరాలు ఫోటోగ్రఫీ వ్యాపార రంగంలో విదేశంలో (దుబాయ్) స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా కుమారుడు ఐనంపూడి హరీష్ వర్మ బీటెక్ పూర్తి చేశారు. కుమార్తె ఐనంపూడి అశ్విని ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసి ప్రస్తుతం పీజీ చేస్తున్నారు. 2010 సంవత్సరంలో తిరిగి స్వదేశానికి వచ్చి ఫోటోగ్రఫీ వ్యాపారంగంలో (బాబా డిజిటల్ ల్యాబ్) లేటెస్ట్ టెక్నాలజీని పరిచయం చేస్తూ బాబా మేడంగా అందరికీ సుపరిచితులుగా పేరుగాంచారు. 2012లో అప్పటి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు భూపతిరాజు శ్రీనివాసవర్మ, దివంగత పైడికొండల మాణిక్యాలరావు, కోడూరి లక్ష్మీనారాయణ, టీవీఎస్ వర్మ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరి అనేక పదవులు అలంకరించి అందరి మన్ననలు పొందారు. సేవా రంగంలో 2020లో తణుకు రోటరీ క్లబ్ అధ్యక్షురాలుగా, వ్యాపార రంగంలో 2018లో తణుకు ఏరియా ఫోటో స్టూడియో సంఘం అధ్యక్షురాలిగా, రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీలో పలు పదవులను చేపట్టారు. అందరినీ కలుపుకొంటూ సీనియర్ నాయకులు పాకా వెంకట సత్యనారాయణ, నార్ని తాతాజీ, జిల్లా పెద్దలు, సీనియర్ నాయకుల ప్రోత్సాహంతో వారి అడుగుజాడల్లో నడుస్తూ అంచలంచెలుగా పదవులను అలంకరించారు. 2025లో నూతనంగా భారతీయ జనతా పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులుగా ఎన్నిక అయ్యారు. 2023లో భారతీయ జనతా పార్టీ తణుకు నియోజవర్గ కన్వీనర్‌గా, 2021లో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలుగా,



2015లో మహిళా మోర్చా రాష్ట్ర సెక్రటరీగా, 2013లో బేటి బచావో, భేటీ పడావో రాష్ట్ర కన్వీనర్‌గా, 2012లో మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు చేపట్టి పార్టీలో అజాతశత్రువుగా పేరుగాంచి భారతీయ జనతా పార్టీ పశ్చిమగోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా ఐనంపూడి శ్రీదేవి ఎన్నిక కావడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కాళీపట్నం భూముల పై జె.సి. రాహుల్ కుమార్ రెడ్డి విచారణ



**భీమవరం జనవరి 22 ప్రభాతవార్త :** మొగల్తూరు మండలం కాళీపట్నం జమీందారి భూములు రద్దు చట్టం అనుసరించి కాళీపట్నం భూముల యజమానులకు రైతు వారి పట్టాలు మంజూరు కొరకు 20 మంది రైతులకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్, సెటిల్మెంట్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం విచారణ చేపట్టట్టారు . ఈ సమావేశంలో సంబంధిత అధికారులు భూమి యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంబంధిత భూ యజమానులు వారి వద్ద ఉన్న హక్కు పత్రాలు దాఖలు చేయాలని మరియు వారికి సంక్రమించిన హక్కు పత్రం రుజువు, ఎంజాయ్మెంట్ దరిమెల రైతు వారి పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు.

## పోలీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో పోలీస్ డైరీ ఆవిష్కరణ చేసిన ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్

**ఏలూరు టౌన్, జనవరి 22,ప్రభాత వార్త :** ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ పోలీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రూపొందించిన పోలీస్ డైరీ ని ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎంతో కష్టపడి సిబ్బందికి నిత్యం ఉపయోగపడే విధముగా అన్ని అంశాలలో క్రోడీకరించి సిబ్బందికి డైరీని రూపొందించిన ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం మరియు ఆర్ఐ పవన్ కుమార్ ఎంతో కష్టపడి డైరీ ని రూపొందించారని వారిని అభినందించినారు. ఈ డైరీ ప్రతి ఒక్క సిబ్బంది ప్రతిరోజు నిర్వర్తించే ఉద్యోగ నిర్వహణ కార్యక్రమాలలో చాలా ఉపయోగకరంగా ఉంటుందని సిబ్బందికి కావాల్సిన అన్ని అంశాలలో సహాయపడుతుందని దీన్ని రూపొందించినటువంటి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించినారు. ఈ కార్యక్రమంలో




జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు , ఏ ఆర్ అదనపు ఎస్పీ ఎన్ ఎస్ ఎస్ శేఖర్ ఏలూరు డిఎస్పీ డి టి సి బి ఎస్ పి ప్రసాద్ రావు ఏ ఆర్ డి ఎస్ పి చంద్రశేఖర్ , పోలీస్ ప్రధాన కార్యాలయం ఏ.ఒ బి.వి.ఎస్ ఆర్.కె నాయక్ , పోలీస్ కార్యాలయం సువర్చల , ఆర్ఐ పవన్ కుమార్ , పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ శానం రమేష్ బాబు పోలీస్ సిబ్బంది మరియు ప్రధాన కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు

## ఈనెల 24న అండర్-23 బాస్కెట్బాల్ పురుషుల జట్టు ఎంపికలు

**పెనుమంట్ర, జనవరి-22, ప్రభాతవార్త:** మండలంలోని మార్టేరు ఎస్విజి జిల్లా పరిషత్ ఉన్నత నత పాఠశాల నందు ఈనెల 24వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుండి అండర్-23 పురుషుల బాస్కెట్ బాల్ ఎంపికలు జరుగునని పిడి కర్రీ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నందు ఈనెల 28వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగబోవు ఆంధ్రప్రదేశ్ 01వ అంతర్ జిల్లాల అండర్ -23 పురుషుల మరియు మహిళల బాస్కెట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు . ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలకు హాజరగు క్రీడాకారులు 2002 జనవరి నెల ఒకటో తారీకు తరువాత జన్మించిన వారై ఉండవలన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డు మరియు డేట్ అఫ్ బర్త్ సర్టిఫికేట్ వెంట తీసుకుని రావలన్నారు. మరిన్ని వివరములకు ప్రెసిడెంట్ కె.కృష్ణారెడ్డి (77804 84313) సెక్రెటరీ గవ్వ శ్రీను (94403 49534) ట్రెజరర్ కె మురళీకృష్ణ (94411 71933) సంప్రదించవలెనని తెలిపారు.

# బిజెపికి ఒక సహకార సంఘం అయినా దక్కేనా!

**చాట్రాయి, జనవరి 22, ప్రభాతవార్త :** చాట్రాయి మండలంలో సహకార సంఘాల అధ్యక్ష ఎన్నిక ఇంకా ఒక కొలిక్కి రాలేదు. మండలంలో ఏడు సహకార సంఘాలు ఉంటే ఒకటి జనసేనకు మరొకటి బిజెపికి కేటాయించాలని మిగిలిన 5 తెలుగుదేశం పార్టీకి చెందిన వారికి కేటాయించాలని అధిష్టానం నుండి ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది. మండల కేంద్రమైన చాట్రాయి సహకార సంఘం జనసేనకు కేటాయించేందుకు రంగం సిద్ధం అయినప్పటికీ నేటికీ ఓ కొలిక్కి రాలేదు. రోజురోజుకు మలుపులు తిరుగుతూ అభ్యర్థి ఎవరనేది ఖరారు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అయితే భారతీయ జనతా పార్టీకి పోలవరం సహకార సంఘాన్ని కేటాయించాలని ఆదేశాలు వచ్చినట్లు మొదట్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. కానీ భారతీయ జనతా పార్టీకి కేటాయించే పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములై ఉన్నందున బిజెపికి ఒక సంఘాన్ని కేటాయించాల్సిందేనని మండల బిజెపి అధ్యక్షులు ఓబిళ్ళనేని రాజా, సీనియర్ బీజేపీ నాయకులు గద్దం సంజీవరెడ్డి పలువురు డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై మంత్రి పార్థసారథి కూడా పెద్దగా స్పందించిన దాఖలాలు లేవని విమర్శలు వినవస్తున్నాయి. కూటమి ఒప్పందం ప్రకారం తమకు కేటాయించకుంటే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని బిజెపి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇది ఏమైనా సహకార సంఘాల అధ్యక్ష ఎంపిక ప్రక్రియ మొదలైన నాటి నుండి మండలంలో మంత్రి పార్థసారథి పై పలు విమర్శలు తెలుగుదేశం నాయకులే గుప్పించటం విడ్డూరంగా ఉందని చెప్పాలి. జనసేన బిజెపిని పక్కన పెడితే స్వపక్ష నాయకులే బహిరంగంగా మంత్రిపై



విమర్శలు చేయడం ఏ పరిస్థితికి దారితీస్తుందని అనుమానం ప్రతినోటా వినపడుతోంది. గ్రామస్థాయిలో ఉన్న నాయకుల సలహాలు తీసుకోకపోవడం వల్లే ఈ విమర్శలకు కారణమని తెలుస్తోంది. ఏది ఏమైనా ఒకసారి మంత్రి చాట్రాయి మండలానికి వచ్చి పరిస్థితిపై సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం ప్రతినోటా వినపడుతోంది.

# అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ట

## ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా బయ్యనగూడెంలో శోభాయాత్ర

**జంగారెడ్డిగూడెం,/ కొయ్యలగూడెం, ప్రభాతవార్త :** అయోధ్య బాల రాముని ప్రాణప్రతిష్ట జరిగి ఏడాది పూర్తి అయిన సందర్భంగా కొయ్యలగూడెం మండలం బయన్నగూడెం గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభ యాత్ర ఘనంగా నిర్వహించారు. బయ్యనగూడెంలోని పెద్ద రామాలయం నుండి శోభాయాత్రను ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రారంభించి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన శోభా యాత్రలో పెద్ద సంఖ్యలో హిందూ బంధువులు జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ పాల్గొన్నారు. ప్రతి ఏడాది జనవరి 22వ తేదీని పవిత్రంగా



భావించి శోభాయాత్ర నిర్వహించుకోవాలని, అందరూ కులాలకు అతీతంగా ఐకమత్యంతో మెలగాలని గారపాటి చౌదరి అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద కృష్ణ ప్రభుదాసు, ఎర్రవుల బాబి, కలలగంటి శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారుల నరకయాతన

## అటువైపు చూడని ఆర్ అండ్ బి శాఖ అధికారులు

ఏలూరు టౌన్, **జనవరి 22,ప్రభాత వార్త :** ఏలూరు జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న రోడ్డు పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. చోదిమెళ్ళ నుంచి వంగూరు అడ్డ రోడ్డు ప్రధాన రహదారి పై వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చవిచుస్తున్నారు. చోదిమెళ్ళ నుండి బైపాస్ రోడ్డు వరకు ఎన్నో రోజులుగా పాడైపోయిన ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. నిరంతరం చెదిమెళ్ళ నుండి వంగూరు వెళ్లే రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి పాడైన రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



## 25న చాంబర్స్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

## దాదాపు 1500 మందికి ఉద్యోగ అవకాశాలు

**పాలకొల్లు ప్రభాతవార్త :**
25వ తేదీ , శనివారం నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ మరియు ఛాంబర్స్ డిగ్రీ కళాశాల సౌజన్యంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. కళాశాల చైర్మన్ కె.వి ఆర్ నరసింహారావు ఈ మెగా జాబ్ మేళాను ప్రారంభించుటకు గౌరవ జన వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్నారని, జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి నరసాపురం ఆర్డిఓ దాసి రాజు , డిఎస్పి డాక్టర్ జి శ్రీ వేద గౌరవ అతిథులుగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు.
జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి గమాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో 20 నుంచి 25 అరబిందో, హెటిరో, మెడ్ ప్లస్ అపోలో ఫార్మసీ వంటి ఫార్మా కంపెనీలు, యాక్సిస్ బ్యాంక్ ఇండస్ బ్యాంక్ వంటి బ్యాంకింగ్ సెక్టార్లు, ప్రముఖ ఐటీ కంపెనీలు, జాతీయ అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ జాబ్ మేళాలో వెయ్యి నుండి 1500 ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. అలాగే కళాశాల సెక్రటరీ కె.వి సీతారామరాజు మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి సంస్థతో కలిసి చాంబర్స్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించుకోవాలని ఆయన కోరారు. కళాశాల ట్రెజరర్ ఆర్ ప్రవీణ్ భాను గారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉన్న వారికి ఇది మంచి అవకాశం అని ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యతో పాటు వివిధ రకాలైన నైపుణ్యాలలో శిక్షణ ఇస్తున్న సంస్థ చాంబర్స్ డిగ్రీ కళాశాలని ఇటువంటి సంస్థల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు మెగా జాబ్ మేళా నిర్వహించడం సంస్థకు గర్వకారణమని, పాలకొల్లు మరియు పాలకొల్లు పరిసర ప్రాంతాలలో ఉన్న అలాగే జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకుని మంచి ఉన్నత స్థితిలో ఉండాలని మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్న మేనేజ్మెంట్ కి, స్కిల్ నైపుణ్య అభివృద్ధి సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఈ లోకమాన్ డిస్టిక్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వీ వరలక్ష్మి, కళాశాల చైర్మన్ శ్రీ కె.వి నరసింహారావు కళాశాల సెక్రటరీ కె.వి సీతారామరాజు కళాశాల ట్రెజరర్ శ్రీ ప్రవీణ్ భాను గారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు గారు మరియు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టీ. వాల్గా, ప్లేస్మెంట్ ఆఫీసర్ యు జానకి రామయ్య మరియు టి.మీనా పాల్గొన్నారు.

## దేవాదాయ భూముల పరిరక్షణకు సమిక్షిగా కృషి చెయ్యాలి..



ఏలూరు... ప్రభాతవార్త :జిల్లాలో దేవాదాయ భూముల పరిరక్షణకు జిల్లాయంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో భూ పరిరక్షణ కమిటీ ఏర్పడింది. ఈ నేపధ్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూముల పరిరక్షణ, లీజుదారుల నుండి లీజు మొత్తాలను వసూలుచేయడం తదితర అంశాలపై దృష్టిసారించాలని నిర్ణయించారు. జిల్లాలో25 మండలాల్లో దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను మండలాల వారీగా సమగ్ర నివేదికను తయారుచేసి శుక్రవారం నాటికల్లా వివరాలు సమర్పించాలని కలెక్టర్ దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నివేదికలో మండలాల్లో ఉన్న దేవాదాయ శాఖ మొత్తం భూమి (సర్వే నెంబర్లతో), అన్యాక్రాంతమైన భూమి, లీజుకిచ్చిన భూమి, ఖాళీగా ఉన్న భూమి, సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశించారు. దీని ఆధారంగా రెవిన్యూ పరంగా చేయవల్సిన ప్రక్రియను సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి, మండల తహశీల్దార్లకు తెలియపర్చాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ భూముల పరిరక్షణకు సూచించిన మార్గదర్శకాలను సంబంధిత శాఖ అధికారులు అధ్యాయనం చేసి దేవాదాయ భూముల పరిరక్షణకు సమిక్షిగా కృషిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, అడిషనల్ ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బి. స్మరణ్ రాజ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనరు వి. హరిసూర్యప్రకాష్, ఆర్డివోలు అచ్యుత అంబరీష్, ఎం.వి. రమణ, నగరపాలక సంస్థ కమీషనరు ఎ. భానూప్రతాప్, డిపివో కె. అనురాధా, ల్యాండ్ సర్వే ఎస్ హెచ్ ఎండి అన్సారీ, జిల్లా రిజిస్ట్రార్ కె. శ్రీనివాసరావు, వివిధ దేవాలయాల ఇవోలు, ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీయే ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి మహర్దశ

### - రెండు గ్రామాలకు ఒకే రోజు రూ 5 కోట్లు అభివృద్ది పనులకు శ్రీకారం

పోడూరు,జనవరి 22,ప్రభాత వార్త : రాష్ట్రంలో ప్రజా కూటమి ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధి జోడు గుర్రల్లా తీసుకు వెళ్ళుతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం పోడూరు మండలం వేడంగి, కొమ్ము చిక్కాల గ్రామాల్లో రూ 5 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు,శిలాఫలకాలాలను మంత్రి ఆవిష్కరించారు. అడుగడుగునా ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు కలసి పెట్టుబడులు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తున్నారని అన్నారు.యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయని, దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా రూ 750 నుండి 2 వేలు రూపాయలు మాత్రమే పెన్షన్లు ఇస్తున్నారని, మన ఆంధ్రప్రదేశ్ లో రూ 4 వేలు,రూ 6 వేలు,రూ 10 వేలు, రూ 15 వేలు రూపాయలు ప్రతి నెల 1 వ తేదీ ఉదయాన్నే ప్రతి ఇంటికి వెళ్లి ఇస్తున్నామని అన్నారు.సాక్షాత్తు మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు సేవలు కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారని అన్నారు.అన్నా క్యాంటీన్లు ద్వారా పేదవానికి రూ 15 రూపాయలకే మూడు పూటలు భోజనాలు పెడుతున్నామని, వచ్చే నెలలో రాష్ట్రంలో 80 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని రాష్ట్ర జలవనురులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు



యస్.యం.ఫాజిల్,యంపిడివో బి.మంగాకుమారి, డిఇలు కలవకోలను దుర్గారామ స్వామి,పి.శ్రీనివాస రావు, రామాయణం త్రిమూర్తులు, ఈవోపిఆర్టి కె.యం.వైభవతి, యంపిపి సబ్బితి సుమంగళి, జడ్పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, గ్రామ సర్పంచి చెల్లబోయిన పద్మ పార్వతి శారద,ఎంపీటీసీ నాగరాజు సుజాత, ఎర్రంశెట్టి నరసింహ,నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, పితాని వెంకట్ ఎమ్. వీర వెంకట సత్యనారాయణ, పాలవలస తులసీరావు, బొక్క నాగేశ్వరరావు,దేవరపు దొరబాబు, దానరి రత్నరాజు, గొట్టుముక్కల రఘురామరాజు,కొండేటి ప్రసాద్, కే ఎస్ ఎన్ రాజు, బొలిశెట్టి మంగయ్యానాయుడు,కోడి విజయ భాస్కర్, గ్రామ సచివాలయం సిబ్బంది, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బొంతువారిపాలెం లో పశువైద్య శిబిరం

అత్తిలి – జనవరి 22 ( ప్రభాత వార్త ):అత్తిలి గ్రామపంచాయతీ పరిధిలోని బొంతు వారి పాలెం లో ఉచిత పశు ఆరోగ్య శిబిరం ను జంతు సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆల్తి మాట్లాడుతూ అన్ని పశువులకి కోళ్ళకి ,కుక్కలకి వ్యాధి నిరోధక టీకాలు ఎప్పటికప్పుడు వేయించుకోవాలని తద్వారా అంటూ వ్యాధుల్ని అరికట్టి అన్ని రకాల పశువులని ఆరోగ్యంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గేదెలకి ఆవులకి 50 గాలికుంటు వ్యాధి నిరోధకటేకాలు , కోళ్లకి 125 కొక్కెర వ్యాధిని టీకాలు సిబ్బందివేశారు. దూడలకు నట్టల నివారణ , ఎదకు రానిపశువులకి, చూలు కట్టని పశువులకి పరీక్షలు చేసి ఉచితంగా మినరల్ మిక్సర్ మందుల్ని అందజేశారు.

## పశు వైద్య శిబిరాలు

అత్తిలి – జనవరి 22 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జంతు సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్ కుమార్ తెలిపారు. 23 న కొమ్మర, గుమ్మంపాడు , 24 న కంచుమర్రు , 25 న ఆరవల్లి , బల్లిపాడు , 27 న మంచిలి , కేఎస్ గట్టు , 28 న స్కిన్నెర పురం , ఈడూరు 29 న వరిగేడు , ఎల్ ఎన్ పురం , 30 న పాలి , దంతుపల్లి , 31 న పాలూరు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు . పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు కె . నరసింహారావు ఆధ్వర్యంలో శిబిరాలు జరుగు తాయన్నారు .

## ఒలంపియాడ్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార :ఆల్ ఇండియా క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో జంగారెడ్డిగూడెం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు స్కూలు ప్రిన్సిపల్ డి. శ్రీనివాస్ బుధవారం మీడియాకు తెలిపారు. ఏడుగురు విద్యార్థులు నగదు బహుమతి, 21 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్ సర్టిఫికెట్, 18 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్స్ అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపల్ శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఓ. శ్రీనివాస్, రామ్మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రీ సర్వే నూరు శాతం పూర్తి చేయాలి -జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

తణుకు: జనవరి 22 ( ప్రభాత వార్త ) :ఇరగవరం మండలము పోడలాడ గ్రామం లో బుధవారం జరుగుతున్న రీ సర్వే ను క్షేత్రస్థాయిలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడి అధికారులు ముందుగా మీకు నోటీసులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.పలు సూచనలు తెలిపారు. సంబంధిత అధికారులు సంబంధిత భూమి యజమానులకు ముందుగా నోటీసులు అందజేసి వారి సమక్షంలో వారి సలహా ప్రకారమే రీ సర్వే చేయాలని ఆదేశించారు. భూమి విషయంలో దీర్ఘకాలిక ఉన్న భూ సమస్యలను జిల్లా అధికారులు దృష్టికి తీసుకువచ్చి సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రీ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

**క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంట బోధిని పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ పి రాహుల్ కుమార్ రెడ్డి**

ఇరగవరం మండలంలోని యర్రాయి చెరువు గ్రామం నందు సర్వే నెంబరు 142 పంట బోధి 350 రైతుల సంబంధించిన వ్యవసాయ భూములకు నీరు అందక దీర్ఘకాలిక సమస్యగా ఉన్నదని పి జి ఆర్ ఎస్ లో రైతులు జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి రైతులు తీసుకురాగా తీసుకురాగా సమస్యను పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. రైతులు స్థానికంగా నివాసం ఉంటున్న వారితో చర్చించి పరిష్కరించాలని పంట బోదే పరిష్కారానికి చర్యలు చేపట్టి జెసిబి ద్వారా పంట బోధను తవ్వి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను పరిష్కరించటంతో జిల్లా జాయింట్ కలెక్టర్ తీరు రాహుల్ కుమార్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఇరగవరం గ్రామంలో సర్వే నెంబరు 406 గ్రామ కంట భూమి లో 70 సెంట్లు వక్ఫ బోర్డు వారికి ఉన్నదని భూమిని నిషేధిత జాబితా నందు వక్ఫ బోర్డు ఆదేశాలు మేరకు గ్రామకంతం భూమి క్రైమ్ విక్రయాలు నిలుపుదల చేయాలని రెవిన్యూ సదస్సులో కోరగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ బోర్డ్ భూమిని సబ్ డివిజన్ చేసి నివేదికను అందజేయాలని తహసిల్దార్ ను ఆదేశించారు. దీర్ఘకాలికంగా ఉన్న వక్ఫ్ బోర్డ్ సమస్యను అధికారులతో చర్చించి పరిష్కారం చేసినందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ పి రాహుల్ కుమార్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఖరీఫ్ సాగులో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సకాలంలో గోనే సంచులు అందించి



ఆర్ ఎస్ కె లద్వారా ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించడం మరియు రైతులు యొక్క ఖాతాల్లో 48 గంటల లోపు డబ్బులు పడేటట్లు చేసి రైతులకు అన్ని విధాలుగా ఆదు కోవటం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డికి అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రబి సీజన్లో కూడా రైతులకు అన్ని విధాల సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్డీవో ఖతీబ్ కౌశల్ భానో, తాసిల్దార్ ఎం సుందరరాజు, మండల సర్వే అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### రీ-సర్వే వర్క్ ను పరిశీలించిన ఆర్డీవో దాసిరాజు



పోడూరు, జనవరి–22, ప్రభాతవార్త: పోడూరు మండలం మట్టపర్రు గ్రామంలో పైలెట్ విలేజ్ గా ప్రారంభమైన రీ–సర్వే వర్క్ ను నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు బుధవారం సందర్శించి, తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు సయ్యద్ మౌలానా ఫాజిల్, సర్వేయర్ చిరంజీవి, ఆర్ ఐ కె. రాంబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో శ్రద్ధ వహించాలి



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త :రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అమలులో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మిగిలిని శాఖల సిబ్బంది శ్రద్ధ వహించాలని జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి మరియు జిల్లా జి.ఎస్.డబ్ల్యూ.ఎస్. నోడల్ అధికారి కె. సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడివో కృష్ణప్రసాద్ అధ్యక్షతన డివిజనల్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు పాల్గొన్నారు. డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం. రాజు, డివిజన్లోని అందరి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, డివిజనల్ ఆసిస్టెంట్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెంలో కార్మికులు నిరసన కార్యక్రమం



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉద్యోగ, కార్మిక వర్గాలపై కార్పొరేట్ సంస్థల వారికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు కె.వి. రమణ పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో కార్పొరేట్ సంస్థల అధికారులు ప్రతి కార్మికుడు, ఉద్యోగుస్తుల పని గంటలను ఎక్కువ పెంచాలని, వారానికి 9 గంటలు చేయాలని ప్రకటించటాన్ని ఖండిస్తూ దేశ వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేయాలని ఐఎఫ్టియు జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కమిటి అధ్యక్షులు కె.వి.రమణ పాల్గొని ప్రసంగించారు. జాతీయ కమిటీ ప్రచురించిన కరపత్రాలు విడుదల చేశారు.

## గిరిజన దర్బార్లో వినతుల స్వీకరణ



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త : ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కె.ఆర్.పురం ఐటిడిఎ పి.ఓ . కె.రాములు నాయక్ తెలిపారు. ఐటిడిఎ కార్యాలయంలో పి.ఓ. రాములు నాయర్ గిరిజన దర్బార్ నిర్వహించి, నినతులు స్వీకరించారు.

## జంగారెడ్డిగూడెం లెనిన్ శతజయంతి ఉత్సవాలు



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: రష్యా విప్లవయోధుడు కమ్యూనిస్టు సిద్ధాంత కర్త లెనిన్ శతజయంతి ఉత్సవాలు జంగారెడ్డిగూడెం సిపిఎం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగాయి. లెనిన్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి పట్టణ కన్వీనర్ పి. సూర్యారావు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. మండల కార్యదర్శి ఎం. జీవరత్నం అధ్యక్షతన సభ జరిగింది. పలువురు లెనిన్ జీవిత విశేషాలు, పోరాటాలు వివరించారు.

## డయాలసిస్ యూనిట్ కు నిధులు మంజూరు పట్ల హర్షం .

అత్తిలి – జనవరి 22 ( ప్రభాత వార్త ):అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డయాలసిస్ సెంటర్ కు 75 లక్షలు మంజూరు చేసిన కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ వర్మ కు అత్తిలి లయన్స్ క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు . వారు కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ కు,తణుకు ఎంఎల్ఏ ఆరి మిల్లి రాధాక్రిష్ణ ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. అత్తిలి క్లబ్ ప్రతినిధులు దాసం బాబ్జి , సింగులూరి చంద్రశేఖర్ , యాతం రాంబాబు వర్ధినీడి శివ , సన్నిధి సూర్యనారాయణ



గుప్తా తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గట్టిం మాణిక్యాలరావు కూడా పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించిన ఛైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త : జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పరిధిలోని 25వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి ప్రారంభించారు. గతంలో మున్సిపల్ సాధారణ నిధులు నుండి 25 లక్షలతో సిసి రోడ్డుకు శంకుస్థాన జరిగింది. కాని అప్పటి ఎన్నికల కారణంగా పనులు వాయిదా వేయడంతో మరలా ఇప్పుడు ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కొమ్మని వెంకటరమణ, రాష్ట్రకోఆపరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, వైసీపీ నాయకులు బత్తిన చిన్నా, గుబ్బల అబ్రాస్, గెద్దాడ శ్రీనివాసరావు, కంచుమర్తి



ప్రకాష్, తల్లాడ శ్రీను, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## లెనిన్ కు ఘన నివాళులు

పోడూరు(పెనుగొండ ), జనవరి–22, ప్రభాతవార్త: కారల్ మార్క్స్ శ్రమ దోపిడి సిద్ధాంతాన్ని అవగాహన చేసుకుని సోషలిజం సాధించిన మహా మేధావి, పోరాట వీరుడు లెనిన్ కు సిపిఎం పార్టీ బుధవారం ఘన నివాళులర్పించింది. లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా పెనుగొండ సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద జిల్లా నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు ప్రజల మధ్య ఏమి చేయాలో, ఎలా చేయాలో నేర్పిన గొప్ప మార్గదర్శి లెనిన్ అన్నారు. మార్క్సిజం సారాన్ని కార్మికులకు అందించడంలో, నియంతృత్వ సామ్రాజ్యవాదాన్ని, మతవ్యవస్థలను కూల ద్రోసి అక్టోబర్ సోషలిస్టు విప్లవాన్ని సోవియట్ యూనియన్ లో తీసుకురావడంలో లెనిన్ చేసిన ఎనలేని కృషి మరువలేనిదన్నారు. కామ్రేడ్ లెనిన్ 108 సంవత్సరాల క్రితం సాధించిన మహా విప్లవ సోషలిజ చైతన్యాన్ని ఆయన చూపిన మార్గంలో ప్రపంచ పీడితుల విముక్తి కి



మనందరం అంకితమవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నీలాపు ఆదినారాయణ, కడలి చంద్రకాంత్, వరహాల రెడ్డి, మాదాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అందె నాగ బసవన్న మృతి వైకాపాకు తీరనిలోటు మాజీ మంత్రి చెరుకువాడ

పోడూరు(ఆచంట ), జనవరి–22, ప్రభాతవార్త: వైసీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు అందె నాగ బసవన్న మృతి పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి చేరుకువాడ శ్రీరంగనాధరాజు అన్నారు బుధవారం మండలంలోని ఏ. వేమవరం లో బసవన్న సంతాప సభ నిర్వహించారు. అనంతరం అయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అభివృద్ధికి అన్నివేళలా కృషిచేసిన నాయకుడు బసవన్న అని కొనియాడారు, ఇటీవల ఏ. వేమవరంలో చనిపోయిన వైసీపీ నాయకుడు రుద్రాక్షాల సోమన్న కుటుంబాన్ని పరామర్శించి, వారి కుమారు డు రుద్రాక్షల సత్యనారాయణ కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీ రంగనాథరాజు వెంట ఆచంట మండల సర్పంచ్ ల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ ఏ. వేమవరం సర్పంచ్ జక్కంశెట్టి చంటి, కొడమంచిలి రాజు



వీరభద్రం, కోట వెంకటేశ్వరరావు, గుడిమెట్ల రామలింగం, కోమటి సూరిబాబు, బళ్లారి నాగేశ్వరరావు,పెచ్చెట్టి సత్యనారాయణ, కొవ్వల సురేష్, కుక్కల కిరణ్ తదితరులు ఉన్నారు.

## ఆడపిల్లను ఉన్నతస్థానం నిలపాలి :కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి

భీమవరం జనవరి 22 ప్రభాతవార్త :ఆడపిల్లలు ప్రశాంతమైన సురక్షిత వాతావరణంలో పెరిగేందుకు రక్షణగా నిలుస్తూ, వారి విద్యకు, అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం వహించేలా ప్రతి ఒక్కరు తోడ్పాటునివ్వాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు “బేటి బచావో బేటి పడావో”(ఆడపిల్లలను రక్షించండి – ఆడపిల్లలకు చదువు చెప్పండి) కార్యక్రమాన్ని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జువ్వలపాలెం రోడ్డులోని (బాంబే స్వీట్స్ షాప్ వద్ద) మహాత్మ గాంధీ విగ్రహం నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు కార్యక్రమంపై అవగాహనపై బైక్ ర్యాలీని జరిపారు. మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బైక్ ర్యాలీని స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బైక్ ను డ్రైవ్ చేస్తూ ర్యాలీలో పాల్గొనడం విశేషం. 200 బైక్ లతో ప్రత్యేకంగా



మహిళలు, విద్యార్థినులు బైక్ ర్యాలీలో పాల్గొని జిల్లా కలెక్టర్ ను అనుసరించారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రారంభమైన బైక్ ర్యాలీ జువ్వలపాలెం రోడ్ లోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనంకు చేరుకోవడంతో ముగిసింది. అల్లూరి సీతారామరాజు విగ్రహం ముందు ఏర్పాటుచేసిన సైన్ బోర్డుపై మహిళలకు రక్షణ, విద్యకు మద్దతును ప్రకటిస్తూ ప్రతి ఒక్కరు సంతకాలు చేయడం జరిగింది. “బేటి బచావో బేటి పడావో” అవగాహన ర్యాలీ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకుని సుశిక్షితులు అవ్వాలని ఆమె కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి ఆడపిల్లలను మొగ్గలోనే తుంచేసేలా భ్రూణ హత్యలకు పాల్పడడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

## రీ సర్వేకు రైతులు సహకరించాలి

### -జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

**తణుకు, జనవరి 22 ( ప్రభాతవార్త):**
పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు మండలం, రీ సర్వే పైలట్ గ్రామమైన కొమరవరం గ్రామంలో రీ సర్వే జరుగు విధానాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, పశ్చిమ రెవిన్యూ డివిజనల్ అధికారి ఖదీప్ కైసర్ ఖానో, తహశీల్దార్ అశోక్ వర్మలు బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి రీ సర్వేకు సంబంధించి రైతులతో మాట్లాడి వారికి సర్వే చేయడానికి నోటీసులు జారీ చేసియున్నారా, లేదా అని తెలుసుకొన్నారు. అలాగే సర్వేను రైతుల సమక్షంలోనే చేయాలని ఆదేశించారు. సర్వే చేయు సమయంలో రైతులను వారి యొక్క భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ తో హాజరై వారి భూమి యొక్క హద్దులను చూపించాలని సూచించారు. రీ సర్వే కి రైతులు సహకరించాలి అని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.



# యూఫోరియా మ్యూజికల్ నైట్‌కి అందరూ ఆహ్వానితులే..

బ్లడ్ డొనేషన్ సొసైటీకి చాలా గొప్ప డొనేషన్. మీరు ఇచ్చే ప్రతిరక్తపు బిందువు చాలా జీవితాలని నిలబెడుతుంది. ఈ గొప్ప కార్యక్రమం ముందుకు తీసుకెళ్లడానికి ఫిబ్రవరి 15న ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షోని నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా వచ్చి ఈ షోలో పాల్గొనాలని కోరుకుంటున్నాను. ఆడియన్స్ ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి తిరిగి సమాజ సేవకే ఉపయోగపడుతుంది అన్నారు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి నారా భువనేశ్వరి. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షో జరగనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ఎన్టీఆర్ ట్రస్ట్ సిఈవో రాజేంద్ర కుమార్, ఎన్టీఆర్ ట్రస్ట్ సివోవో గోపి పాల్గొన్నారు. ప్రెస్ మీట్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి నారా భువనేశ్వరి మాట్లాడుతూ, మా ఆహ్వానం అంగీకరించి ఇక్కడికి విచ్చేసిన అందరికీ ధన్యవాదాలు. నాన్న నందమూరి తారక రామారావు అలా పిలిస్తే మీకు ఇష్టం ఉండదు. మన అన్నగారు నందమూరి తారక రామారావు ఆయన చాలా కష్టపడి పైకి వచ్చిన మహోన్నత వ్యక్తి. ప్రజలే దేవుళ్ళు అని భావించి బడుగు బలహీన వర్గాల కోసం, రాష్ట్ర ప్రజల కోసం వాళ్ళ భవిష్యత్తు కోసం ఏమీ ఆశించకుండా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన ప్రజల కోసం విప్లవాత్మకమైన పథకాలను ఎంతో ధైర్యంతో ముందుకు తీసుకువెళ్లారు. రెండు రూపాయలకి కిలో బియ్యం, ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు.. ఇలా ఎన్నో పథకాలు తెలుగు జాతిని, ప్రజల్ని మనసులో పెట్టుకొని ముందుకు తీసుకువెళ్లారు.



మన ప్రజా నాయకుడు నారా చంద్రబాబునాయుడు, ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజలకు విద్య, వైద్య, ఆరోగ్యం అందుబాటులో వుండాలని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌ని స్థాపించారు. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం సహాయం తీసుకోకుండా 28యేళ్లుగా ఈ ప్రయాణం కొనసాగుతోంది. ఎన్టీఆర్ ఆశయాలని ట్రస్టు పాటిస్తోంది. ఆయన కలలని నెరవేర్చడానికి మేము ఎప్పుడూ ముందుంటాం. 2013లో వచ్చిన ఫైలన్ తుఫాన్, 2014లో వచ్చిన హుదూద్ తుఫాన్, 2018 కేరళ వచ్చిన తుఫాన్ సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ముందు అడుగేసి ప్రజల కావాల్సిన సహాయం అందించింది. ట్రస్ట్ ద్వారా ప్రజాసేవాలో అందరికంటే ముందుటాం. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఏమనగా, జెనిటిక్ డిసార్డర్ తలసేమియాతో చాలా మంది పిల్లలు, పెద్దలు బాధపడుతున్నారు. ఈ వ్యాధి వున్న వారికి బ్లడ్‌లో హిమోగ్లోబిన్ చాలా తక్కువగా వుంటుంది. ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బంది పడుతుంటారు. ఇది తీవ్రంగా వచ్చినప్పుడు రక్త మార్పిడి వెంటనే జరగాలి. దీనికి చాలా రక్తం అవసరం. బ్లడ్ డొనేషన్‌పై ప్రజల్లో చాలా అపోహాలు వున్నాయి. బ్లడ్ డొనేషన్ చేయడానికి భయపడాల్సిన అవసరం లేదు. నిపుణులు అన్ని పరిశీలించిన తర్వాత బ్లడ్ తీసుకుంటారు.

బ్లడ్ డొనేషన్ సొసైటీకి చాలా గొప్ప డొనేషన్.మీరు ఇచ్చే ప్రతిరక్తపు బిందువు చాలా జీవితాలని నిలబెడుతుంది. అది ప్రజలు గుర్తించాలి. ఈ గొప్ప కార్యక్రమం ముందుకు తీసుకెళ్లడానికి మాకు ముందు గుర్తుకు వచ్చింది ఎన్ తమన్. సారీ నందమూరి తమన్ (నవ్వుతూ). మా టీం ఆయన్ని కలసిన వెంటనే ఆయన ఒప్పుకున్నారు. మా ట్రస్ట్ తరపున ఆయనకి హృదయ పూర్వక ధన్యవాదాలు. ఫిబ్రవరి 15న ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షోని నిర్వహిస్తున్నాం.

# 'బ్యాడ్‌బాయ్ కార్తీక్' ఫస్ట్ లుక్ రిలీజ్

హీరో నాగశౌర్య ప్రస్తుతం ఓ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఈ మూవీకి రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మిస్తున్నారు. నాగశౌర్య పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. ఈ చిత్రానికి బ్యాడ్ బాయ్ కార్తీక్ అనే పవర్ ఫుల్ టైటిల్‌ని ఖరారు చేశారు. టైటిల్ నాగ శౌర్య క్యారెక్టర్ ఇంటెన్స్ నేచర్‌ని సూచిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో వ్యాన్ వెనుక కూర్చుని ఇంటెన్స్ లుక్‌తో ఫెరోషియస్ అవతార్‌లో కనిపించారు. అతని నుదిటిపై రక్తంతో కూడిన మూడు గోవింద నామాలు, చేతులపై రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. వ్యాన్‌పై వున్న స్టిక్కర్ హైదరాబాద్‌లో బాద్ అనే పదాన్ని తొలగించడం అతని పాత్ర దూకుడు స్వభావాన్ని, యాక్షన్‌ప్యాక్డ్ స్టయిల్‌ని సూచిస్తుంది. ఈ చిత్రంలో నాగశౌర్య జోడిగా విధి హీరోయిన్‌గా నటిస్తోంది. సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ డీవోపీగా పని చేస్తున్నారు. సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్ తెలుగు సినిమాకు కమ్ బ్యాక్ ఇస్తూ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారు. రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్ కాగ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. షూటింగ్ కంప్లీట్ కావస్తున్న ఈ చిత్రం ఇంట్రస్టింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ప్రమోషన్స్‌ని ప్రారంభించింది. రెగ్యులర్ అప్‌డేట్స్‌తో రాబోతున్నారు మేకర్స్. నటీనటులు: నాగ శౌర్య, విధి, సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, పృథ్వీ, అజయ్, ప్రియ, నెల్లూరు సుదర్శన్, కృష్ణుడు, చమక్ చంద్ర, శివన్నారాయణ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్) నిర్మాత: శ్రీనివాసరావు చింతలపూడి బ్యానర్: శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ డీవోపీ: రసూల్ ఎల్లోర్ సంగీతం: హారిస్ జైరాజ్ ఆర్ట్: రామాంజనేయులు ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్: సుప్రీమ్ సుందర్, పృథ్వి, కొరియోగ్రాఫర్స్: రాజు సుందరం, శోబి మాస్టర్, విజయ్ పొలంకి, శిరీష్ లిరిక్స్: చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, కృష్ణకాంత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శంకర్, పీఆర్వో: వంశీశేఖర్.



# 'బాబీ డియోల్'కు మరో ఆఫర్!

'బాలీవుడ్ నటుడు బాబీ డియోల్‌కి ప్రస్తుతం టైమ్ బాగా కలిసి వస్తోంది. యానిమల్ సినిమాతో ఫామ్‌లోకి వచ్చిన ఆయన రీసెంట్‌గా 'డాకు మహారాజ్'తో తెలుగు తెరకు నేరుగా పరిచయం అయ్యారు. పైగా 'డాకు మహారాజ్'కి విలన్‌గా బాబీ డియోల్ తన పాత్రలో ఒదిగిపోయారు. ఇప్పుడు బాబీ డియోల్‌కి మరో క్రేజీ ఆఫర్ వచ్చినట్టు తెలుస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా రాబోతున్న సినిమా 'స్పిరిట్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా రాబోతుంది. కాగా ఈ సినిమాలో బాబీ డియోల్ సీరియస్ పోలీస్ ఆఫీసర్ గా నటించనున్నాడని, పైగా సినిమాలో బాబీ డియోల్ పాత్ర బాగా పాజిటివ్‌గా సాగుతుందని తెలుస్తోంది. ఇక ఈ చిత్రాన్ని టిసిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. అన్నట్టు 'స్పిరిట్' మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. సందీప్ రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమాగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తోంది. అన్నట్టు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమా కోసం ఇప్పటికే సాంగ్స్‌ను కంపోజ్ చేయడం స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. 'స్పిరిట్' చిత్రానికి సంబంధించిన స్పెషల్ సాంగ్‌ను కూడా ఆల్ రెడీ కంపోజ్ చేశారట.



# చివరి దశలో 'త్రిబాణధారి బార్బరిక్' షూటింగ్

కంటెంట్ బేస్డ్, యూనిక్ కాన్సెప్ట్ చిత్రాలను ఆడియెన్స్ ఎక్కువగా ఆదరిస్తున్నారు. కొత్త పాయింట్‌ను సరికొత్తగా చెప్పే మేకర్ల కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే 'త్రిబాణధారి బార్బరిక్' అంటూ సరికొత్త పాయింట్‌తో రాబోతున్నారు. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా విజయపాల్ రెడ్డి అడిదల నిర్మిస్తున్న 'బార్బరిక్' మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, వశిష్ఠ ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను,సత్యం రాజేష్, క్రాంతి కిరణ్ వంటి వారు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, మోషన్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేశాయి. సత్య రాజ్, వశిష్ఠ, సత్యం రాజేష్ ఇలా ప్రతీ ఒక్కరి పాత్రలకు ఎంత ప్రాముఖ్యత ఉందో టీజర్ చూస్తే తెలుస్తోంది. మరీ ముఖ్యంగా సత్య రాజ్ కనిపించిన తీరు, డిఫరెంట్ లుక్స్, నటించిన విధానం ఈ సినిమాకు హైలెట్ అయ్యేలా కనిపిస్తోంది. టీజర్‌లోని విజువల్స్, ఆర్ఆర్, మేకింగ్ స్టాండర్డ్స్ అన్నీ కూడా నెక్స్ట్ లెవెల్లో ఉన్నాయి. ఈ చిత్రానికి ఇంఫ్యూజన్ బ్యాండ్ ఇచ్చిన మ్యూజిక్ ఆర్ఆర్, కుశేందర్ రమేష్ రెడ్డి కెమెరా వర్క్, మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ ప్రత్యేక ఆకర్షణకానుంది. ప్రస్తుతం ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు మేకర్లు ప్లాన్ చేస్తున్నారు. తారాగణం: సత్యరాజ్, వశిష్ఠ ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, విటివి గణేష్, మొట్టా రాజేంద్ర. సాంకేతిక బృందం: బ్యానర్: వానర సెల్యూలాయిడ్, రచన, దర్శకత్వం: మోహన్ శ్రీవత్స, నిర్మాత: విజయపాల్ రెడ్డి అడిదల, సమర్పణ: మారుతీ టీమ్ ప్రోడక్ట్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: రాజేష్, లైన్ ప్రొడ్యూసర్: సురేష్ డీఓపీ: కుశేందర్ రమేష్ రెడ్డి సంగీతం: ఇంఫ్యూజన్ బ్యాండ్ ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ఆర్ట్ డైరెక్టర్: శ్రీనివాస్ పున్నాస్ ఫైట్స్: రామ్ సుంకర కాస్ట్యూమ్ డిజైనర్: మహి దేరంగుల పిఆర్ఒ: సాయి సతీష్.



# 'తండేల్' థర్డ్ సింగిల్ బ్లాక్ బస్టర్ లవ్ సాంగ్

యువ సామ్రాట్ నాగ చైతన్య మచ్ అవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తండేల్. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. సాయి పల్లవి కథానాయికగా నటిస్తోంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్లు బ్లాక్ బస్టర్ నోట్‌లో ప్రారంభమయ్యాయి. ఫస్ట్ సింగిల్ బుజ్జి తల్లి సెన్సేషనల్ హిట్ అయింది. రీసెంట్‌గా రిలీజైన సెకండ్ సింగిల్ నమో నమః శివాయ సెన్సేషన్ క్రియేట్ చేసింది. థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. తండేల్ థర్డ్ సింగిల్ బ్లాక్ బస్టర్ లవ్ సాంగ్ హైలెస్సో హైలెస్సా జనవరి 23న రిలీజ్ కానుంది. సముద్ర తీరంలో రగ్గడ్ లుక్‌లో లవ్లీ స్మైల్‌తో నిలుచుకున్న నాగచైతన్య, ఎదురుగా బ్యూటీఫుల్‌గా డ్యాన్స్ చేస్తూ సాయి పల్లవి కనిపించిన సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మూవీకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ కంపోజర్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు, షామ్‌దత్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్. శ్రీనాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. తండేల్ ఫిబ్రవరి 7న విడుదల కానుంది. నటీనటులు: నాగ చైతన్య, సాయి పల్లవి, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: చందూ మొండేటి, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, బ్యానర్: గీతా ఆర్ట్స్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్ డీవోపీ: షామ్‌దత్, ఎడిటర్: నవీన్ నూలి, ఆర్ట్: శ్రీనాగేంద్ర తంగాల పీఆర్వో: వంశీ శేఖర్.






# 'రజాకార్' మీట్ ది ప్రెస్

బాబీ సింహా, వేదిక, అనిష్కత్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా రజాకార్. ఈ చిత్రాన్ని సమర్‌వీర్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. యాటా సత్యనారాయణ దరకత్వం వహించారు. గతేడాది థియేటర్స్‌లో రిలీజై మంచి విజయాన్ని అందుకున్న రజాకార్ సినిమా ఈ నెల 24వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో వరల్డ్ డిజిటల్ ప్రీమియర్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ, సినిమాలను డబ్బు కోసం, ఎంటర్ టైన్ మెంట్ కోసం చేస్తుంటారు. కానీ మేము రజాకార్ సినిమాను ఒక బాధ్యతతో చేశాం. నిజాం పాలనలో రజాకార్లు సాగించిన అకృత్యాలను కళ్లకు కట్టినట్లు చూపించాలనే ప్రయత్నంచేశాం. రేపటి తరాలు రజాకార్ల అకృత్యాలను తెలుసుకోవాలి. మరోసారి అలాంటి వారు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. ఈ సినిమా నిర్మించే క్రమంలో నాకు ఎన్నో బెదిరింపులు వచ్చాయి. నన్ను నా కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారు. కానీ నేను భయపడలేదు. సినిమాను నిర్మించాను. ఐఎండీబీలో 9.5 రేటింగ్ వచ్చింది. గోవా ఫిలిం ఫెస్టివల్‌లో సన్మానం చేశారు. మా టీమ్, మా డైరెక్టర్ యాటా సత్యనారాయణ సపోర్ట్‌తో సినిమా సక్సెస్ ఫుల్‌గా ప్రేక్షకులకు రీచ్ చేయగలిగాం. సొసైటీకి ఇది నేను ఇచ్చిన కాంట్రిబ్యూషన్ అనుకుంటా. ప్రజల నుంచి వచ్చిన స్పందన నాకు ఎంతో సంతృప్తిని మిగిల్చింది. ఈ సినిమాను మరో ప్రొడ్యూసర్ చేయలేదని చెప్పగలను. ఇప్పుడు మన తెలుగు వారి ఓటీటీకే మూవీ ఇవ్వాలని ఆహాలోకి తీసుకొస్తున్నాం. ఈ నెల 24వ తేదీ నుంచి ఆహాలో మా సినిమా ప్రీమియర్‌కు వస్తోంది. మీరంతా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాం అన్నారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ, రజాకార్ సినిమాను ప్రొడ్యూసర్ గూడూరు సత్యనారాయణ రెడ్డి ఎన్నో కష్టాలకు తట్టుకుని నిర్మించారు. దర్శకుడు యాటా సత్యనారాయణ పదేళ్ల ఈ మూవీ కోసం కష్టపడ్డారు. రజాకార్ల అకృత్యాలకు ఈ సినిమా గొప్ప డాక్యుమెంటరీ. మన నేల చరిత్ర గురించి తెలుసుకోవడం ఇక్కడ బతికే ప్రతి ఒక్కరి బాధ్యత. మతాలకు అతీతంగా ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆహాలో చూడాలి. ఎందుకంటే ఇది హిందూ, ముస్లిం మతాల మధ్య విభేదాలు సృష్టించే మూవీ కాదు. చరిత్రలో జరిగింది జరిగినట్లు తెరకెక్కించారు. ముస్లిం జర్నలిస్ట్ క్యారెక్టర్ మా సినిమాలో గొప్పగా ఉంటుంది. అలాగే ప్రజల కోసం ఎన్నో మంచి పనులు చేసిన ఆరో నిజాం ఘనతను కూడా చెప్పాం. నేను ఈ సినిమాలో వీరనారి చాకలి ఐలమ్మ క్యారెక్టర్‌లో నటించాను. ఇలాంటి గొప్ప క్యారెక్టర్‌లో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్‌కి థ్యాంక్స్ చెబుతున్నా అన్నారు. నటుడు నాగమహేశ్ మాట్లాడుతూ, రజాకార్ చిత్రంలో నేను రాపాక రామచంద్రారెడ్డి అనే దేశ్ ముఖ్ క్యారెక్టర్‌లో నటించాను. చాలా క్రూరమైన పాత్ర ఇది. సినిమాలో కీలకమైన ఇలాంటి పాత్రలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడు యాటా సత్యనారాయణకి థ్యాంక్స్. ఆయన ఎంతో రీసెర్చ్ చేసి ఈ సినిమాను రూపొందించారు అన్నారు. డైరెక్టర్ యాటా సత్యనారాయణ మాట్లాడుతూ,



మా రజాకార్ మూవీకి తెలుగుతో పాటు హిందీ, మరాఠీ, ఇతర భాషల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. 18 ఫిలిం ఫెస్టివల్స్‌కు అప్లై చేస్తే 15 ఫిలిం ఫెస్టివల్స్‌కు సెలెక్ట్ అయ్యింది. గోవాలో జరిగిన ఇఫ్ఫీలో బెస్ట్ ఇండియాడెబ్యూగా నమోదైంది, బెస్ట్ డైరెక్టర్‌గా నామినేట్ అయ్యాను. గోవాలో 75 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు రజాకార్ సినిమా చూసి అప్రిషియేట్ చేశారు. జైపూర్ ఫిలిం ఫెస్టివల్‌లో 72 దేశాల ప్రతినిధులు వచ్చి మా మూవీ చూశారు. ఇంత గొప్ప స్వాతంత్ర్యపోరాటం జరిగిందా అని వారంతా ఆశ్చర్యపోయారు. ఎన్నో అవార్డులు దక్కించుకుంది మా మూవీ అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ తిరుమల తిరుపతి మాట్లాడుతూ, రజాకార్ సినిమాకు ఆర్ట్ వర్క్ చేసే అవకాశం ఇచ్చిన మా దర్శక నిర్మాతకు థ్యాంక్స్. చాలా పెద్ద స్పాన్ ఉన్న చిత్రమిది. ఇలాంటి హిస్టారికల్ మూవీకి ఆర్ట్ వర్క్ చేయడం ఎంతో హ్యాపీగా అనిపించింది. డైరెక్షన్ టీమ్, మా డైరెక్టర్ ఇచ్చిన ఇన్‌పుట్స్, మెటీరియల్ సపోర్ట్‌తో వర్క్‌చేశాను. ఈ సినిమా పూర్తయ్యాక నాకు సంతృప్తి కలిగింది అన్నారు.

# శరవేగంగా 'తమ్ముడు' షూటింగ్

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ తమ్ముడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నిర్మితమవుతున్న 56వ చిత్రమిది. ఈ చిత్రంలో లయ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి మూవీస్ చేయగా..దర్శకుడు శ్రీరామ్ వేణు నాని హీరోగా ఎంసీఏ, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వకీల్ సాబ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్‌లో తమ్ముడు సినిమా వస్తుండటం సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. తమ్ముడు సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. సంక్రాంతి ఫెస్టివల్ బ్రేక్ లేకుండా శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నారు. ప్రస్తుతం సినిమా క్లైమాక్స్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు. దర్శకుడు శ్రీరామ్ వేణు వీలైనంత త్వరగా హై క్వాలిటీతో మూవీ కంప్లీట్ చేసేందుకు శ్రమిస్తున్నారు. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను 'తమ్ముడు' సినిమాతో అందించబోతున్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. త్వరలోనే తమ్ముడు సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నటీనటులు: నితిన్, లయ, తదితరులు. టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి మ్యూజిక్: అజనీష్ లోకనాథ్, పీఆర్వో: వంశీ కాకా, జీఎస్ కే మీడియా బ్యానర్: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, నిర్మాత: దిల్ రాజు, శిరీష్ రచన, దర్శకత్వం: శ్రీరామ్ వేణు.





సంస్థ సీఈఓ, సహవ్యవస్థాపకురాలు సుందరి పాటిబండ్ల.

**చదువు ఆగి.. మళ్లీ కొనసాగి...**

సుందరి సొంతూరు ఒంగోలు. అక్కడే తెలుగు మీడియంలో చదువుకున్నారు. పదిహేడేళ్లకే పెళ్లి కావడంతో చదువుకి బ్రేక్ పడినా.. పాప పుట్టాక చదువు మళ్లీ కొనసాగుతోంది. డిగ్రీ పూర్తి చేశాక చైన్నై వెళ్లి చార్టడ్ అకౌంటెన్సీ చేశారు. భర్త శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్‌లో వెటర్నరీ వైద్యులు. కూతురు స్నేహ సీఏ చేస్తోంది. సీఏగా సుందరిది 15 ఏళ్ల అనుభవం. ప్రాక్టీసు చేయాలంటే తన దగ్గరకు వచ్చే ఖాతాల నిర్వహణ, మార్కెటింగ్ వంటి అంశాల్లో సలహాలివ్వడమేకాక కార్యాలయాలు ఎక్కడ, ఎలా ఏర్పాటు చేయాలి.. అలంకరణ, వసతులు ఎలా ఉండాలి.. తదితర అంశాల్లో సూచనలు ఇచ్చేవారు. ఆమె ఆసక్తిని గమనించిన కుటుంబ సభ్యులు, స్నేహి తులు 'కో వర్కింగ్ స్పేస్' రంగంలోకి అడుగుపెట్టమని సలహా ఇచ్చారు. ఈ రంగంపై మరింత పరిశోధన చేసిన సుందరి.. 2017లో హైదరాబాద్‌లోని కొండా పూర్‌లో ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దాన్ని హంగులతో సిద్ధం చేసి కార్యాలయానికి అద్దెకు ఇచ్చారు. ఆపై రోజు రోజుకూ అభివృద్ధి చేసుకుంటూ వెళ్లారు. హైదరాబాద్ లోనే 10 లక్షల చదరపుటడుగుల స్థాయికి కార్యాలయా లను విస్తరించారు. వీటితోపాటు విజయవాడ, బెంగ ళూరు, చెన్నై, గురుగ్రామ్, పుణెల్లో మరో 10 లక్షల చ.అ.కు పెరిగింది. సంస్థద్వారా 400 మందికి ఉపాధి కల్పిస్తుండగా.. వీరిలో 50 మందికి పైగా మహిళలే.

**కోవిడ్ కష్టాలు ఎదురైనా..** ఐటీ పార్కులు ఉండే చోట భవనాలను పూర్తిగా లేదా కొన్ని అంతస్తుల వరకూ అద్దెకు తీసుకుంటారు సుందరి. వాటిలో ఐటీ సంస్థలకు అనుకూలంగా అన్ని వసతులతో కూడిన కార్యాలయాలను అభివృద్ధి చేసి స్టార్టప్‌లు మొదలు పెద్ద సంస్థలకూ అద్దెకు ఇస్తారు. ఐస్ప్రౌట్ పుంజుకుంటున్న దశలో కోవిడ్ రూపంలో క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందడుగు వేశారు. ఉద్యోగులు మళ్లీ ఆఫీసులకు రావడం మొదలయ్యాక

# సుందరి మార్గం స్ఫూర్తికి ద్వారం ..

పెళ్లి కారణంగా ఆమె చదువు మధ్యలో ఆపాల్సి వచ్చింది. కానీ అది తాత్కాలికమే! తల్లి అయ్యాక ఆమె మళ్లీ తన చదువును పట్టాలెక్కించారు. సీఏ చేశారు. ఆపైన వ్యాపారవేత్తగా మారారు. అక్కడా విజయ వంతమై ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు సుందరి పాటిబండ్ల,

ఆఫీస్‌లో అడుగు పెట్టగానే రంగురంగుల పూల మొక్కల ఆహ్వానం పలుకుతాయి. గోడల పైన భారతీయ సంస్కృతి, ఇతిహాస సన్నివేశాలను తెలిపేలా అలంకరణ వస్తువులు.. బాల్యాన్ని గుర్తుచేసేలా గోళీలు ఆడుతున్న, సెలయేళ్ల ఒడ్డున సందడిచేస్తున్న పిల్లల పెయింటింగ్‌లు దర్శనమిస్తున్నాయి. సామగ్రి ఎంతో ఆహ్లాదకరంగా, ఆధునికంగా ఉంటుంది. 'ఇంతకీ ఇది ఎవరి ఆఫీసు' అంటారా? అందరిదీనూ! అదే.. రెడీమేడ్ సౌకర్యా లున్న 'కో వర్కింగ్ స్పేస్' ఈ ఆఫీసుని నిర్వహిస్తోంది ఐస్ప్రౌట్ సంస్థ. ఈ ఆలోచన వెనక కీలకవ్యక్తి



వీటికి డిమాండ్ పెరిగింది. 'ఆర్థిక మాంద్యం కారణంగా అమెరికా, యూకే వంటి దేశాల్లోని సంస్థలు తక్కువ వేతనాలకే నిపుణులైన మానవ వనరులు దొరికే భారత్‌వైపు చూస్తున్నాయి. కాబట్టి ఇక్కడ కో వర్కింగ్ స్పేస్ వ్యాపారం మరింత వృద్ధి చెందుతుంది' అంటారు సుందరి. వచ్చే రెండేళ్లలో దేశవిదేశాల్లో మరిన్ని నగరాల్లో ప్రారంభించి కార్యాలయాలకు 30 లక్షల చ.అ.కు విస్తరించాలనే లక్ష్యంతో ఉన్నారామె. 'ఎన్ని ఆస్తులు ఉన్నా, అమ్మాయిలకు విద్య చాలా అవసరం. పెళ్లి, పిల్లల కారణంగా కొన్నేళ్ల విశ్రాంతి వచ్చినా, తర్వాత కెరియర్‌లో ముందుకు వెళ్లి లక్ష్యాలను సాధించాలి. కెరియర్ కుటుంబం మధ్య సమతూకాన్ని పాటిస్తే విజయం సాధించవచ్చు' అనేది యువతరానికి సుందరి ఇచ్చే సూచన.

# ఎంతందంగా ఉన్నావే.. ఎవరే నువ్వు !

## మోనాలిసా.. ఓ..మోనాలిసా!



**ఒక మందాకిని... ఒక ఐశ్వర్యరాయ్....వంటి తేనె కళ్ల సుందరి , నీలి కళ్ల సుందరిలను ఆకాశం నుంచి ఊడి పడ్డారా!? అనే విస్మ యం కలిగించిన సొగసుకత్తెలను వెండితెర మీద పరికించాము.**

ఇప్పుడు వారి కన్నా దీటైన పల్లెటూరి సొగసులాడి కుంభమేళాలో చూపరులకు అందంగా.. ఆకర్షణీయంగా అమాయకంగా తేనెకళ్ళతో పలకరిస్తోంది. అదేనండి ఆకర్షణీయ మోము... చిరు నవ్వులతో....ఆమె పూసలు తీసుకోరూ!? ..అన్న చూపులతో ఆకట్టుకుంది. ఇటీవల మహా కుంభమేళా జాతరలో పూసలు, పూసల దండలు అమ్ముకుంటూ ఒక బ్లాగర్ కంటపడింది. అతను ..ఆమె అందాలను తన కెమెరాలో బంధించాడు. మెడలో పూసల దండ సొగసుల కైదండ చిరునవ్వుల గంగ ఆమె సౌందర్యానికే పూర్యాయపదమా అనిపిస్తోంది. అలా ఆమెను చూడకుండా ఎవరూ తమ కళ్లను పక్కకు తిప్పలేరంటే నమ్మండి. వివరాల్లోకి వెళ్తే.. ఆమె ఎవరో కాదు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విశేషంగా జరుగుతున్న మహాకుంభ మేళాను సందర్శించి పుణ్యస్నానాలు చేసి తరించే సాధుసంతులకు ,అఖండాలకు రుద్రాక్షలు, పూసలు అమ్ముతున్న మోనాలిసా. మోనాలిసా ఇండోర్ నివాసి, మహిళ. ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కానీ ఎంతోమంది పురుషులు ఆమె సెల్ఫీల కోసం ఎగబడేసరికి మిగతా పూసలోళ్లు



మోనాలిసా సహజ సౌందర్యానికి జనం ముగ్ధులౌతున్నారు. ఆమె వ్యాపారానికి ఆటంకం కలిగి స్తున్నారు. కుంభమేళాకు ఎందుకు వచ్చామో మరిచిపోయి ఆమె సెల్ఫ్ లకోసం తహతహలాడడమే విడ్డూరంగా ఉంది. ఇండోర్‌కు చెందిన మోనాలిసా భోంస్లే అనే టీనేజ్ అమ్మాయి మహా కుంభమేళాలో దండలు అమ్ముతున్నప్పుడు ఆమె చిరునవ్వు మరియు నీలి కళ్ల వైరల్ వీడియో కారణంగా ఇంటర్నెట్ సంచలనంగా మారింది. ఇది 15 మిలి యన్లకు పైగా వీక్షణలను సంపాదించింది. దండలు కొనడం కంటే సెల్ఫీలు కోరెవారే ఎక్కువయ్యారు.దాంతో ఆమె జీవనోపాధికి ఆటంకం కలిగి స్తుంటే ఆమె తన ఇంటికితిరిగి వెళ్ళిపోవాల్సి వచ్చింది.సౌందర్యారాధకులు ఆమెను తేనె కళ్ల సుందరిని చూసామన్న ఆనందంతో మరలుతున్నారు.







ఫ్యాషన్ ఫ్యాషన్


# లక్క గాజుల గలగలలు..





అలనాటి మహారాణులైనా, ఈనాటి పెళ్లికూతుళ్లైనా.. మహిళలంతా ఆ గాజుల అందానికి ఫిదానే. పండుగైనా, వివాహ వేడుకలైనా అతివల చేతులు వీటి మెరుపులతో తళుక్కుమనాల్సిందే. అవే భాగ్యనగరానికీ వన్నె తెచ్చిన అందాల లక్క గాజులు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఆ గాజులు తాజాగా భౌగోళిక గుర్తింపును సొంతం చేసుకొన్నాయి. హైదరాబాద్ పాత బస్తీ అంటేనే గాజులకు ప్రసిద్ధి. అందులోనూ చార్మినార్ లాడ్ బజారులో దొరికే లక్కగాజులు స్థానికంగానే కాదు. అంతర్జాతీయంగా ఎంతో పేరుపొందాయి. వీటిని లక్కరాళ్ల గాజులుగానూ పిలుస్తారు. వీటి తయారీ కూడా ప్రత్యేకమే. కొలిమిపై కరిగించగా వచ్చే లక్కను వృత్తాకారంలో మలిచి గాజులుగా తయారుచేస్తారు. రంగురంగుల రాళ్లు, పూసలు, అందాలు వంటివాటితో వీటికి హంగులు అద్దుతారు. ఈ లక్క గాజులపై చేసే అలంకరణకు ఎటువంటి మెషీన్లు ఉపయోగించకుండా కవేలం చేతులతోనే చేస్తరు.ఈ హస్తకళ కుతుబ్‌షాహీ, నిజాంల కాలంలో ప్రారంభమైందట. ఆనాటి రాజకుటుంబీకుల మహిళలంతా వీటిపై మనసు పారేసుకునేవారట. తరతరాలుగా వస్తోన్న ఈ గాజుల తయారీమీదే నేటికీ 4 వేలకుపైగా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. అలా తయారవుతున్న ఈ లక్క గాజులు ఆధునిక మహిళల్నీ మురిపిస్తునే ఉన్నాయి. అంతెందుకు ఇప్పటికీ పెళ్లిళ్లంటే నవ వధువుల మనసు వీటివైపే మళ్లుతుంది. అందాన్ని, సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ గాజులకు భౌగోళిక గుర్తింపు దక్కింది. అంటే. ఈ లక్కగాజులు మరింత మంది మహిళల చేతులను మరిపించనున్నాయి అన్నమాట.









## 'రసబలీ' మిఠాయి

ఒడియా ప్రసిద్ధ పిండివంటల్లో 'రసబలీ' మిఠాయి ఒకటి. దీన్నెలా చేయాలంటే.. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో రెండు కప్పుల పాటు పోసి, కాస్త కుంకుమ పువ్వు వేయాలి. సన్న సెగ మీద పాలు సగం అయ్యేవరకూ మరిగించాలి. అందులో అర కప్పు పంచదార వేసి.. అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి.. కలియ తిప్పి దించేయాలి. మరో పాత్రలో కప్పు పంచదార వేసి.. అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి.. కలియ తిప్పి దించేయాలి. మరోపాత్రలో కప్పు తురిమిన పనీర్. చెంచా చొప్పున ఉప్మా రవ్వ, గోధుమ పిండి వేసి బాగా కలిపితే.. మెత్తటి పిండిలా తయారవుతుంది. దాన్ని నిమ్మకాయంత భాగాలుగా చేసి, టిక్కీలుగా ఒత్తుకవోఅలి. సైజు, మందం అన్నీ సమానంగా ఉండేట్లు చేసి, కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చేవరకూ వేయించాలి. వీటిని టిష్యూ పేపర్ మీదికి తీస్తే.. అదనంగా ఉన్న నూనె పీల్చేసుకుంటాయి. ఈ టిక్కీస్‌ను మరిగించిన పాలలో వేయాలి. అరగంట నానితే సరి. తియ్యటి రసబలీ మిఠాయి సిద్ధమైపోతుంది. సులువైన ఈ స్వీటు సూపర్ టేస్టీగా ఉంటుంది. తిని ఆనందించడమే తరువాయి.



## కర్పూరం ఎందుకంటే..

కర్పూరం సిన్నమోమం కర్పూర చెట్టు నుంచి తయారవుతుంది. ఇది లడ్డూ, ఖీర్, హల్వా, బర్ఫీ లాంటి స్వీట్ల రుచిని రెట్టింపు చేస్తుంది. జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తుంది. కొన్ని ప్రాంతాల విందు భోజనం తర్వాత అరుగుదల సమస్య తలెత్తకుండా కాస్త కర్పూరం సేవిస్తారు. కుంకుమపువ్వుల కర్పూరాన్ని కూడా చాలా తక్కువ పరిమాణంలో వాడాలి. మోతాదు మించితే విషతుల్యమై వాంతులు, వికారం, తల తిరగటం వంటి సమస్యలొస్తాయి. పిల్లలకు మరీ ప్రమాదం. అలాగే సెంట్లు, కలరా ఉండలు వంటివాటిల్లో ఉపయో గించే కర్పూరం వంటకు నిషిద్ధం. రసాయనాలు, హానిచేసే పదార్థాలు లేకుండా ఆహారం కోసం తయారుచేసిన కర్పూరాన్ని మాత్రమే వాడాలి. దీన్ని మిఠాయిలోనే కాదు.. సౌందర్యసాధనలు, సుగంధద్రవ్యాలు, మందులు, అత్తర్లలోనూ వాడతారు. క్రిమినాశినిగానూ పని చేస్తుంది. ఆహ్లాదం గొల్పుతూ స్వచ్ఛతను. తాజాదనాన్ని తెచ్చే ఈ పరిమళం వ్యతిరేక శక్తులను పోగొట్టి ఆధ్యాత్మికతను పెంచుతుందని నమ్ముతారు. కర్పూరం డబ్బా మూత గట్టిగా బిగించుకుంటే ఆవిరైపోతుంది.



## చెలి చిట్కా

అరటికాయ ముక్కలుగా కోసేటప్పుడు తోలు తీసిన అరటికాయలను మజ్జిక కలిపిన నీళ్లలో ముంచండి. ఆ తర్వాత కోస్తే ముక్కలు నల్లబడవు.

# సమగ్ర మార్పుకు శ్రీకారం చుట్టండి !

వ్యథ



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న: నన్ను మరణ భయం వెంటాడుతోంది. గత రెండు సంవత్సరాలుగా భయం, ఆందోళన తో బాధపడేదానిని. లిఫ్ట్, రైలులో ఎసి కోచ్, ఫైట్ ఎక్కాలంటే విపరీతమైన భయం అవహించేది అందులో ఊపిరి ఆడకుండా పోతుం దన్న ఆందోళన ఉండేది. ప్రక్కన ఎవరైనా తోడు ఉండి ధైర్యం చెప్పి తీసుకెళితే, శరీరం అంతా చవాటపట్టేది. గుండె వేగంగా కొట్టుకోవడంతో పాటు పెదాలు తడారిపోయేవి. దీంతో నేను లిఫ్ట్, ఎసి కోచ్, ఫైట్ ఎక్కడం పూర్తిగా మానేశాను. అయితే గత మూడు నెలల నుంచి ఎవరైన బంధువులు సన్నిహితులు చని పోయిన వార్త వినగానే గుండె వేగంగా కొట్టుకోవడం, చెమట పట్టడం తదితర లక్షణాలు ఆవహించేవి. 10 రోజుల క్రితం మా నాన్నమ్మ చనిపోయారు. ఆమె మా అందరితో మాట్లాడుతు హఠాత్తుగా క్రిందపడి పోయారు. ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించినా ప్రయోజనం లేకపోయింది. రెండు రోజులు వెంటిలేటర్స్ సహాయంతో ఉండి చనిపోయారు. అప్పటినుంచి నాలో భయం, ఆందోళన అధికం అయ్యింది. నేను కూడ చనిపోతానేమో అన్నీ అనుమానం వెంటాడు తున్నది. రాత్రుల్లో నిద్ర పట్టడం లేదు. భోజనం సహిం చడం లేదు. డాక్టరు వద్దకు వెళ్ళి పరీక్షలు చేయించుకున్నాను.అన్నీ నార్మల్‌గానే ఉన్నాయని చెప్పారు. అధిక బరువు విటమిన్‌ల లోపం ఉందని చెప్పారు. బరువు తగ్గడానికి వ్యాయామాలు చేయమని చెప్పి, విటమిన్ లోపం తగ్గడానికి మందులు రాసిచ్చారు. మందులు వాడుతూ సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ తీసుకోమని డాక్టరు సలహా ఇచ్చారు. నా వయస్సు 35 ఏళ్ళు, ఎంబిఎ చదివి ఓ కంపెనీలో పనిచేస్తున్నాను. నా ఎత్తు 56 అడుగుల రెండు అంగుళాలు బరువు 83 కిలోలు ఉన్నాను. మూడేళ్ళ క్రితం పెళ్లయింది. ఇంకా పిల్లలు కలుగలేదు. నా భర్త ముంబాయిలో పని చేసునఒతన్నారు. వారం తేదా రెండు వారాలకు ఒకసారి వచ్చి రెండు రోజులుండి వెళాతారు. ఈ పరిస్థితులలో నేను అందరిలా ఉండేందుకు తగిన సలహా ఇవ్వండి.

**- ఒక సోదరి, విజయవాడ**



**జవాబు :** అమ్మా మీరు అనవసర భయం, ఆందోళనకు గురవుతున్నారు. అలాగే ఫోబియాతో బాధపడుతున్నారు. ఇటీవల అవి పెరిగి మరణ భయానికి దారితీశాయి. దీనికి పలు అంశాలు కారణం కావచ్చు. తొలి నుంచి మీరు మెతక స్వభావికావచ్చు. నమ్మకాలు సెంటిమెంట్లు పెంచి పోషించుకుని ఉండవచ్చు. బాల్యంలో ఏదైనా చేదు అనుభవం ఎదురై ఉండవచ్చు. దీనికి తోడు చదువు, పెళ్ళి, ఉద్యోగం, ఇతర అంశాల వల్ల ఒత్తిడిని ఎదుర్కొని ఉండ వచ్చు. ఇవన్నీ మానిసిక పరమైన అంశాలు అలాగే అధిక బరువు, విటమిన్ల లోపం మీ శారీరక సామర్థ్యాలపై ప్రతి కూల ప్రభావం చూపుతున్నది. అలాగే భర్త దూరంగా ఉండటం, పిల్లలు లేకపోవడం వల్ల అసంతృప్తి, నిరాశ, నిస్పృహకు గురవుతున్నారు. అన్నీ వెరసి మీ మానసిక స్థితిని చాల బలహీన వరిచాయి. కాబట్టి తక్షణం సైకాలజిస్టును కలసి కౌన్సెలింగ్ తీసుకోండి. కాగ్నె టివ్ బిహేవియర్ థెరపి, రిలాక్సేషన్ పద్ధతుల ద్వారా మీలో ఆత్మవిశ్వాసం, తట్టుకునే శక్తిని పెంచుతారు. అవసరం అయితే హిప్నో థెరపి చేసి భయం, ఆందోళన ఫోబియా తగ్గిస్తారు. డాక్టరు సలహా పాటిస్తూ మందులు వాడుతూ, వ్యాయామాలు చేస్తూ శారీరక శక్తిని పెంచుకోండి. పిల్లలు పుట్టకపోవడానికి కారణం తెలుసుకోండి. మీ భర్తతో సాన్నిహిత్యం పెంచుకునే మార్గం అన్వేషించండి. మొత్తం మీద జీవనశైలిని మార్చుకుని సంబంధ బాంధ్యవ్యాలను పెంచుకోవడానికి కృషి చేయండి. మీ సమస్య తగ్గి పోతుంది.

# సాయి సన్నిధియే పెన్నిధి

ఆధ్యాత్మికం



మానవులు చేయలేని పనిని మహనీయులు చేస్తారు. చేస్తామని చాటింపు వేయించుకోరు. అంతా దైవలీల అంటారు సాయివంటి సద్గురువు. సాయి భక్తులకు సాయి సన్నిధియే పెన్నిది. రవి కాంచనిచోట, కవి గాంచును కదా! అని అంటారు. ఈ యాంత్రిక యుగంలో డాక్టర్లు కూడా నయం చేయలేక చేతులు ఎత్తివేస్తారు. ఆ సమయంలో సాయి తన కరుణ కిరణాన్ని ప్రసరింపచేయవచ్చును. ఒక డాక్టరుకు, అందునా పిల్లల ప్రత్యేక నిపుణుడైన అతనికి వివాహం అయింది. పిల్లవాడు జన్మించాడు. పుట్టిన రెండు నెలల నుండిరాత్రులందు ఏడ్చేవాడు. ఆ డాక్టరు కారణాన్నితెలుసుకోలేకపోయాడు. తోటి డాక్టర్లు కూడా కారణాన్ని తెలుసుకోలేకపోవటమే కాదు, ఆ పసిబాలుని రోదనను (రాత్రులందు) ఆపలేకపోయారు. డాక్టరుగారికి, ఆయన భార్యకు రాత్రులందు నిద్ర కరువైంది. భద్రావతిలో ఉండే ఆయన సోదరుడు షిరిడీ వెళ్లి ఊదిని తాయిత్తులో వేసి పట్టుకు వచ్చాడు. ఆ పసిబిడ్డకు ఆ



తాయత్తును కట్టారు. అంతే, ఆబిడ్డడు ఏడుపుమానాడు, రాత్రు లందు సుఖంగా నిద్రించ సాగాడు. ఇది ఊదీ మహిమ. షిరిడీలోనే మురళీధర్ భికా ఉండేవాడు. ఆయనకు రెండున్నర సంవత్సరములున్న బిడ్డ ఉన్నది. ఒకసారి ఆ బిడ్డ అనారోగ్యం పాలైంది. సాయినాథుని ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షలన్నీ చేసారు. వ్యాధిని నిర్ధారించ లేకపోయారు. బిడ్డను ఇంటికి పంపివేసినారు. బిడ్డను ఇంటికి తెచ్చినా వైద్యుడేడి? వైద్యం ఏది? షిరిడీలో ఉన్న ప్రముఖ డాక్టర్ గోండ్కరుకు చూపించారు. సాయిబాబా ఇచ్ఛపైనే ఆ బిడ్డ బ్రతికి బట్ట కట్టేది అని చెప్పాడు ఆ డాక్టరు. అది మే నెల. ఇక వైద్యులకే వైద్యుడైన సాయి సన్నిధి ద్వారా మాయికి వెళ్ళారు. బాబా ఆసీనుడైన బండ వద్ద బిడ్డ నుంచి, ధునికి ఎదురుగా గల సాయిఫొటోను ప్రార్థించసాగారు. కన్నీటికి దైవం కరుగుతాడో లేదో తెలియదు గాని సాయి కరిగిపోయాడు. వారు సాయిని ప్రార్థించి బిడ్డ వద్దకు వెళ్ళారు. ఆ బిడ్డ అక్కడ లేదు. వారు గాబరాపడ్డారు. చుట్టూ చూడగా అక్కడికి దగ్గరలోనే ఇతర చిన్న పిల్లలతో ఆడుకుంటోంది వారి పసి బిడ్డ. ఆ తల్లిదండ్రుల కృతజ్ఞతా పూర్వక ఆనంద భాష్పాలు సాయినాథుని పాదయుగళిని కడిగివేస్తాయని అనిపించింది చూచు వారలకు !

**- యం.పి.సాయినాథ్**

# వరల్డ్ నం.1కు చేరువైన స్మృతి

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో 2వ ర్యాంక్‌లోకి దూసుకొచ్చిన స్టార్




**ఢిల్లీ:** భారతస్టార్ బ్యాటర్ స్మృతి మంధాన నంబర్‌వన్ ర్యాంక్‌కు మరింత చేరువైంది. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా సూపర్‌ఫామ్ కొనసాగిస్తున్న స్మృతి తాజా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు దూసుకొచ్చింది. ఇటీవల ఐర్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఓ సెంచరీ సహా అర్ధ సెంచరీతో రాణించిన స్మృతి 738 పాయింట్లతో ఒక ర్యాంక్ మెరుగుపర్చుకుని టాప్-10లో కొనసాగుతున్న ఏకైక భారత బ్యాటర్‌గా నిలిచింది. దక్షిణాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్డ్ 773 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. తొలి సెంచరీతో ఆకట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 17వ ర్యాంక్‌కు చేరుకోగా, హర్మన్ ప్రీత్ కౌర్ 15లో ఉంది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ 680 పాయింట్లతో ఒక ర్యాంక్ ఎగబాకి నాలుగులో నిలిచింది. సోఫీ ఎకల్‌స్టోన్ 770 పాయింట్లతో టాప్‌లో ఉంది. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ 344 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో ఉంది.

# ఐసిసి టాప్ ర్యాంకుల్లో బుమ్రా, జడేజా

## దిగజారిన రోహిత్ శర్మ



**ఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా హవా కొనసాగుతున్నాడు. ఐసీసీ బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో బుమ్రా 904 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25 సిరీస్‌లో బుమ్రా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 5 టెస్టుల్లో 13.06 సగటుతో 32 వికెట్లు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా బుమ్రా నిలిచాడు. ఈ క్రమంలోనే తన టెస్టు రేటింగ్ పాయింట్స్‌ను బుమ్రా మెరుగుపరుచుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో బుమ్రా తర్వాత స్థానాల్లో వరుసగా ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ (841), సౌతాఫ్రికా స్టార్ పేసర్ కగిసోరబాడ (837) కొనసాగుతున్నారు. మరోవైపు ఆల్రౌండర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ ప్లేయర్ రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్నా డు. జడేజా ఖాతాలో ప్రస్తుతం 400 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో జడేజా పర్వా లేదన్పించాడు. మిగితా ప్లేయర్లతో పోలిస్తే కాస్త మెరుగ్గానే కన్పించాడు. ఈ సిరీస్‌లో మొత్తం ఐదు మ్యాచ్‌లు ఆడిన జడ్డూ 27 సగటుతో 135 పరుగులు చేశాడు. జడేజా తర్వాత స్థానాల్లో ప్రోటీస్ ఆల్రౌండర్ మార్కో జాన్సెన్ (294), బంగ్లా ప్లేయర్ మెహిదీహాసన్ (294) నిలిచారు. ఇక బ్యాటర్ల ర్యాంకింగ్స్ విషయానికి వస్తే టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ర్యాంక్ మరింత దిగజారింది. రోహిత్ ఒక స్థానం దిగజారి 43వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. కాగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో రోహిత్ శర్మ తీవ్ర నిరాశపరిచాడు. అటు కెప్టెన్సీ, ఇటు బ్యాటింగ్ పరంగా రోహిత్ శర్మ పూర్తిగా తేలిపోయాడు. ఐదు ఇన్నింగ్స్‌లో కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు. రోహిత్ తన ఫామ్‌ను తిరిగి పొందేందుకు 10 ఏళ్ల తర్వాత రంజీల్లో ఆడనున్నాడు.

# వెస్టిండీస్‌కు బంగ్లాదేశ్ షాక్

## 60 పరుగుల తేడాతో ఘన విజయం

**ఢిల్లీ:** బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టు వెస్టిండీస్‌కు షాకిచ్చింది. ఐసీసీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన వన్డే మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఏ ఫార్మాట్లో అయినా బంగ్లాదేశ్‌కు వెస్టిండీస్‌పై ఇదే తొలి గెలుపు. ఈ గెలుపుతో బంగ్లాదేశ్ వన్డే ప్రపంచ కప్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఈ ప్రపంచ కప్ ఫైనల్‌కు అర్హత సాధించేందుకు బంగ్లాదేశ్ ఒకే ఒక మ్యాచ్ దూరంలో ఉంది. మ్యాచ్ విషయానికి వస్తే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో వన్డే జరిగింది. ఈ మ్యాచ్ లో విండీస్‌కు ఊహించని పరాభవం ఎదురైంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 48.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నిగార్ సుల్తానా (68) బాధ్యతాయుతంగా ఆడి తమ జట్టుకు గౌరవప్రదప్రమైన స్కోర్ అందించింది. శోభన మోస్తరి (23), షో ర్నా అక్తెర్ (21) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. వీరు మినహా బంగ్లా



ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా కనీసం 20 పరుగుల మార్కును దాటలేదు. ఫర్జానా హక్ 18, ముర్షిదా ఖాతూన్ 12, షిర్మన్ అక్తెర్ 11, ఫహిమా ఖాతూన్ 4, రబేయా ఖాన్ 1, నహీదా అక్తెర్ పరుగులు చేశారు. విండీస్ బౌలర్లలో కరిష్మా రామ్హరాక్ 4 వికెట్లు తీయగా, ఆలియా అలెన్ 3, డియాండ్రా డొట్టిన్, ఫ్రేసర్, అఫీఫ్లెచర్ తలో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం బరిలోకి దిగిన వెస్టిండీస్ 35 ఓవర్లలో 124 పరుగులకే చాప చుట్టేసింది. బంగ్లా బౌలర్లు మరుఫా అక్తెర్ (8-0-35-2), నహీదా అక్తెర్ (10-0-31-3), రబేయా ఖాన్ (8-0-19-2), ఫహీమా ఖాతూన్ (5-0-17-2) రెచ్చిపోయి బౌలింగ్ చేశారు. వీరి ధాటికి పటిష్టమైన విండీస్ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలింది. విండీస్ ఇన్నింగ్స్‌లో షెర్మైన్ క్యాంప్‌బెల్ (28) టాప్ స్కోరర్‌గా నిలువగా, కెప్టెన్ హేలీ మాథ్యూస్ (16), ఆలియా అలెన్ (15), చెర్రీ ఫ్రేసర్ (18 నాటౌట్), కరిష్మ రామ్హరాక్ (13) రెండంకెల స్కోర్లు చేశారు. ఈ గెలుపుతో బంగ్లాదేశ్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విండీస్ ఆధిక్యాన్ని తగ్గించింది. ప్రస్తుతం ఇరు జట్లు చెరో విజయంతో సమంగా నిలిచాయి. తొలి వన్డేలో వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టి కరిపించింది. చివరి వన్డే 24న జరుగనుంది.



# ఛాంపియన్స్ ట్రోఫీలో.. ఇద్దరు కెప్టెన్లే సక్సెస్

## టీమిండియాకు 9మంది సారథ్యం

## గంగూలీ, ధోనీ నాయకత్వంలో గెలుపు

## రెండు సార్లు మాత్రమే ఛాంపియన్‌గా భారత్

**ఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భాగంగా అన్ని జట్లు పూర్తి సన్నద్ధం అవుతున్నాయి. ఈ క్రమంలో పాకిస్తాన్ జట్టు తప్ప మిగతా అన్ని జట్లు తమస్క్వాడ్‌లను ప్రకటించాయి. అయితే ఇప్పటి వరకూ జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాకు పలువురు నాయకత్వం వహించారు. ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొన్న భారత్ జట్టుకు మొత్తం 9 మంది కెప్టెన్లుగా వ్యవహరించారు. వీరిలో సౌరభ్ గంగూలీ మూడు సార్లు, ఎంఎస్ ధోనీ రెండు సార్లు ఛాంపియన్ ట్రోఫీకి టీమిండియాకు కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే 9 మంది భారత్ కెప్టెన్ల హయంలో కేవలం ఇద్దరు కెప్టెన్లు మాత్రమే ట్రోఫీని గెలిచి టీమిండియాను విజేతగా నిలిపారు. ఛాంపియన్స్ ట్రోఫీ తొలి ఎడిషన్‌లో టీమిండియాకు మహ్మద్ అజారుద్దీన్ నాయకత్వం వహించాడు. 1998లో భారత జట్టు సెమీ ఫైనల్ వరకూ చేరుకుంది. ఈ టోర్నీలో వెస్టిండీస్ చేతిలో భారత్ 6వికెట్ల తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2000 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు సౌరవ్ గంగూలీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ ఎడిషన్‌లో, జట్టు ఫైనల్‌కు చేరుకుంది. అక్కడ న్యూజిలాండ్ నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఇక 2002లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఎడిషన్‌లో సౌరవ్ గంగూలీ టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ ఎడిషన్‌లో, భారత్ ఫైనల్స్‌కు చేరుకుంది. అక్కడ శ్రీలంకతో టైటిల్ పోరు జరిగింది. కానీ, ఫైనల్ ఫలితం ప్రకటించలేదు. దీని కారణంగా రెండు జట్లు ఉమ్మడి విజేతలుగా నిలిచాయి. 2004 ఎడిషన్‌లో సౌరవ్ గంగూలీ కూడా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇక్కడ భారత ప్రదర్శన చాలా నిరాశపరిచింది. జట్టు ఏడో స్థానంలో నిలిచింది. అలాగే 2006 ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాకు రాహుల్ ద్రవిడ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని నాయకత్వంలో జట్టు 5వ స్థానంలో నిలిచింది. 2009 ఎడిషన్‌లో ఎంఎస్ ధోని భారత్ జట్టుకు నాయకత్వం వహించాడు. కానీ, అతని కెప్టెన్సీలో కూడా జట్టు 5వ స్థానంలో కొనసాగింది. తదుపరి 2013లో ఎంఎస్ ధోనీ సారథ్యంలో భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్లో భారత్ ఐదు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. 2017 ఎడిషన్‌లో, విరాట్ కోహ్లి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును ఫైనల్స్‌కు తీసుకెళ్లాడు. అక్కడ, పాకిస్తాన్ టైటిల్ గెలవాలనే భారత్ కలను విచ్ఛిన్నం చేసింది. దీంతో భారత్ 180 పరుగుల తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2017 తర్వాత, ఇప్పుడు అంటే 2025లో, 8 ఏళ్ల నిరీక్షణ తర్వాత, ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించబోతున్నారు. ఇందులో రోహిత్ శర్మ టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సారి ఎలాగైనా ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో టీమిండియా సన్నద్ధమవుతోంది.

# సాత్విక్, చిరాగ్ జోడీ శుభారంభం

## మహిళల డబుల్స్‌లో అశ్విని, తనీషా గెలుపు

**ఢిల్లీ:** ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురవుతున్నాయి. పురుషుల, మహిళలడబుల్స్ విభాగంలో భారత్ ఆటగాళ్లు దూసుకుపోతున్నారు. పురుషుల డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన సాత్విక్ సాయి రాజ్-చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. జకార్తాలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-16, 21-15తో చైనీస్ తైపీకి చెందిన చెన్ జి రే-లిన్ యు చియె జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 30 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత



జోడీకి ప్రతిఘటన ఎదురైనా కీలక దశల్లో పాయింట్లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. ఇక మహిళల డబుల్స్‌లో భారత్‌కు చెందిన తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప జంట కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. తొలి రౌండ్లో తనీషా-అశ్విని ద్వయం 21-6, 21-14తో థాయాలాండ్‌కు చెందిన ఒర్నిచా జోంగ్సతాపోర్న్-సుకిత్త సువాచాయ్ జంటపై గెలిచింది. కాగా సింగిల్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి.పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో హైదరాబాద్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్‌కు చుక్కెదురైంది.భారత్‌కే చెందిన ఆయుశ్ శెట్టితో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 7-21, 15-21తో ఓడిపోవడం గమనార్హం. కాగా మహిళల క్వాలిఫయింగ్ తొలి రౌండ్లో తాన్యా హేమంత్ 16-21, 21-17, 21-15తో చైనీస్ తైపీకి చెందిన టుంగ్ సియోటాంగ్‌పై నెగ్గి మెయిన్ డ్రాకు అర్హత పొందింది. మరోమ్యాచ్‌లో ఇషారాణి బారువా 18-21,20-22తో ఇండోనేసియాకు చెందిన చియారామార్వెలా హాండాయో చేతిలో ఓడిపోయి మెయిన్ డ్రాకు చేరుకోవడంలో విఫలమైంది.

# వాణిజ్యం

# ఇన్ఫీలో మూర్తి ఫ్యామిలీ కంటే ఎల్ఐసికే రెట్టింపు వాటా

**ముంబై, జనవరి 22:** ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కుటుంబానికి ఉన్న సమష్టి హోల్డింగ్స్ వారి శాశ్వత వారసత్వాన్ని, కంపెనీ పథంలో గణనీయమైన ప్రభావాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారు. కేవలం రిటైలర్లే కాకుండా ఇన్వెస్టింగ్ సంస్థలు చాలాకాలం నుంచే ఈ రంగంలో వాటా కొనుగోలు చేస్తున్నాయి. ఇన్ఫోసిస్‌లో మూర్తి కుటుంబానికి ఉన్న వాటాకంటే కూడా రెట్టింపు వాటాను హోల్డ్ చేస్తున్న సంస్థలున్నాయి. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి కుటుంబానికి కంపెనీలో గణనీయమైన వాటా ఉంది. తాజా నివేదికల ప్రకారం తన కుటుంబం మొత్తం హోల్డింగ్స్ సుమారు 4.02శాతం ఉన్నాయి. నారాయణమూర్తికి 0.36శాతం, ఆయన భార్య సుధామూర్తికి 0.93 శాతం, వారి పిల్లలు అక్షతమూర్తికి 1.05 శాతం, రోహన్ మూర్తికి 1.46శాతం వాటా ఉంది. నారాయణ మూర్తి మనవడు నాలుగేళ్ల ఏకగ్రహ మూర్తికి కూడా తన తాత ఇటీవల షేర్లను బహుమతిగా ఇవ్వడంతో 0.04శాతం వాటా ఉంది. వ్యూహాత్మక పెట్టుబడుల్లో భాగంగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఇన్ఫోసిస్‌లో భారీగా పెట్టుబడి పెట్టింది. ఇన్ఫోసిస్‌లో ఏకంగా 9.531శాతం వాటాను ఎల్ఐసి హోల్డ్ చేస్తోంది. దీని విలువసుమారు రూ.8,694 కోట్లు. ఈ పెట్టుబడి ద్వారా ఎల్ఐసి భవిష్యత్తులో ఇన్ఫోసిస్ సామర్థ్యం పట్ల నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎల్ఐసి ఇన్వెస్ట్‌మెంట్ వల్ల ప్రపంచ ఐటి రంగంలో కంపెనీ పాత్ర ఎలా ఉండబోతుందో తెలుస్తోంది. ఇన్ఫోసిస్‌తో ఎల్ఐసి భాగస్వామ్యం కేవలం ఆర్థిక పెట్టుబడులకు పరిమితం కాలేదు. సంస్థ అందించే సేవల్లోనూ ఇరు కంపెనీల సహకారం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ సర్వీసుల్లో ఇన్ఫోసిస్ నైపుణ్యం ద్వారా ఎల్ఐసి నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో డైవ్ అనే డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇనిషియేటివ్‌పై ఈ రెండు కంపెనీలు కలిసి పని చేశాయి.




# అమెరికా చమురు ఎగుమతులు పెంపు

**వాషింగ్టన్, జనవరి 22:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత యుఎస్ కీలక ప్రకటనలుచేస్తోంది. యునైటెడ్ స్టేట్స్ తన ఇంధన ఎగుమతులను పెంచబోతున్నట్లు తెలిపింది. దాంతో ప్రపంచ చమురు, గ్యాస్ మార్కెట్ గణనీయంగా ప్రభావితం చెందుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అమెరికా తీసుకున్న ఈ చర్య ధరలను తగ్గిస్తుందని, సరఫరాను పెంచుతుందని, ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తుందని అంచనా వేస్తున్నాయి.అమెరికా చమురు, గ్యాస్ ఉత్పత్తిని పెంచేందుకు సిద్ధమవుతోంది. చమురు డ్రిల్లింగ్‌ను ప్రోత్సహించడం, గతంలో ఉన్న అంక్షలను ఎత్తివేయడం, ఇంధన ఎగుమతులను పెంచడం వంటి ప్రణాళికలను డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ఈ వ్యూహం ప్రపంచ చమురు మార్కెట్లో అమెరికాను టాప్ నిలిపేందుకు దేహదం చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. యూఎస్ ఇంధన ఎగుమతుల పెరుగుదల మార్కెట్లో ఒపెక్ ప్లస్ నియంత్రణను కట్టడి చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లోకి మరిన్ని చమురు, గ్యాస్ సరఫరాదారులు ప్రవేశించడంతో ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ముడిచమురు ధరలు తగ్గడం వల్ల దిగుమతి



ఖర్చులు తగ్గుతాయని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించవచ్చని భారత్ వంటి దేశాలకు ఇది ప్రయోజనం చేకూరుస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. దీర్ఘకాలంలో యూఎస్ చమురు ఉత్పత్తి ఒపెక్ ప్లస్, ఇతర ఉత్పత్తిదారుల వ్యూహాల పునఃసమీక్షకు దారితీస్తుంది. పెరిగే యుఎస్ చమురు ఎగుమతులు ఇతర ప్రాంతాలకు సరఫరాదారులను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఇది ధరల స్థిరత్వానికి మరింత సహాయం చేస్తుంది.

# హైదరాబాద్‌లో హెచ్‌సిఎల్ టెక్ విస్తరణ

**హైదరాబాద్, జనవరి 22:** దావోస్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం అనేక పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో అనేక భారతీయ కంపెనీలతో పాటు ఇతర దేశాలకు చెందిన కంపెనీల నుంచి కూడా పెట్టుబడులను రాబట్టే పనిలో సీఎంఓ టీమ్ గట్టిగా కృషి చేస్తోంది. దీంతో వరుసగా ఎంవోయూలు కుదుర్చుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. దేశంలోని టాప్5 ఐటీ కంపెనీల్లో ఒకటిగా ఉన్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సిఎల్ ఈ క్రమంలో తన వ్యాపారాన్ని హైదరాబాదులో మరింతగా విస్తరించాలని చూస్తోంది. ఇందులో భాగంగానే కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా హైదరాబాద్‌లో తన గ్లోబల్ డెలివరీని పెంచాలని నిర్ణయించింది. దావోస్ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబును కలిసిన హెచ్‌సిఎల్ సీఈవో, ఎండీ విజయకుమార్ ఈ మేరకు కొత్త పెట్టుబడి నిర్ణయాన్ని ప్రకటించారు. హైదరాబాదులో కొత్తగా ఏర్పాటు చేయనున్న సెంటర్, హైటెక్, లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి పరిశ్రమల్లోని గ్లోబల్ క్లయింట్‌లకు అత్యాధునిక క్లౌడ్, ఏఐ అండ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పరిష్కారాలను అందిస్తుందని కంపెనీ వెల్లడించింది. టెక్ కంపెనీకి హైటెక్ సిటీలో ఉన్న క్యాంపస్ కొత్తగా 5,000 మంది ఐటీ ఉద్యోగులకు అవకాశాన్ని కల్పిస్తుందని తెలుస్తోంది. ఇది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్‌తో రావటం స్థిరమైన వ్యాపార పద్ధతులపై కంపెనీకి ఉన్న నిబద్ధతను నొక్కి చెబుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాదునగరం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు అత్యధిక టాలెంట్ కలిగిన టాలెంట్ అందుబాటులో ఉందని సీఈవో విజయకుమార్ పేర్కొన్నారు. ఇది కంపెనీకి వ్యూహాత్మకంగా కీలకమైన స్థానంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్త కేంద్రం తమ ప్రపంచ క్లయింట్ స్థావరానికి అత్యాధునిక సామర్థ్యాలను తీసుకువస్తుందని, స్థానిక సాంకేతిక పర్యావరణ వ్యవస్థకు దోహదపడుతుందని పేర్కొన్నారు. వచ్చే నెలలో ఈ కేంద్రాన్ని ముఖ్యమంత్రి, ఐటీ మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించబడుతుందన్నారు. టెక్ దిగ్గజం హెచ్సీఎల్ టెక్ తీసుకున్న పెట్టుబడి నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయిలో ఐటీ రంగంలో హైదరాబాదును మరింతగా ముందుకు తీసుకెళ్లటానికి ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలను ప్రోత్సహించడానికి హైదరాబాద్‌లోని టెక్, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసి టైర్ 2, 3 నగరాలకు విస్తరించటంపై తాము దృష్టిసారించినట్లు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు నొక్కి చెప్పారు.




# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 22:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం లాభాల్లో ముగిసాయి. ఐటి, ప్రైవేట్ బ్యాంకు షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో నాటి షాక్ నుంచి తేరుకున్నాయి. ఉదయం 76,114.42 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా స్వల్ప లాభాలకే పరిమితమైన సూచి, ఓ దశలో స్వల్పంగా నష్టపోయింది. చివరి గంటన్నరలో కొనుగోళ్ల ఉత్సాహంతో సెన్సెక్స్ 566.63 పాయింట్ల లాభంతో 76,404.99 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 130.70 పాయింట్లు లాభపడి 23,155.35 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.25 పైసలు లాభపడి రూ.86.33 వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్, టిసిఎస్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బిఐ, ఎన్‌టిపిసి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 79.64 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2771 డాలర్ల స్థాయికి చేరింది.



# రూపాయి పడినా ఇంకా విలువైనదే.. రాజన్

**న్యూఢిల్లీ, జనవరి 22:** అమెరికా డాలర్స్‌తో రూపాయి మారకం విలువ ఇటీవల భారీగా క్షీణిస్తోంది. అయినా అంతర్జాతీయ మార్కెట్లో ఇతర పోటీ కరెన్సీలతో రూపాయి ఇంకా అధిక విలువ ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ (రాజన్) పేర్కొన్నారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఇఎఫ్)లో రూపాయి భవిష్యత్తు గమనంపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. అమెరికా డాలరుతో ప్రస్తుత రూపాయి మారకం క్షీణించడాన్ని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని రాజన్ అన్నారు. అనేక ఇతర కరెన్సీలు కూడా ఇదే ధోరణిని కలిగి ఉన్నాయి. ఇతర కరెన్సీలతో ప్రస్తుత రూపాయి ఎఫెక్టివ్ ఎక్స్ఛేంజ్ రేట్ (ఆర్ఈఈఆర్) ఇప్పటికీ అధిక విలువను సూచిస్తోంది. ఈ ఓవర్ వాల్యుయేషన్ రూపాయి మరింత పతనం అయ్యేందుకు అవకాశం ఉందని సూచిస్తున్నట్లు అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇతర కరెన్సీలతో ప్రస్తుత రూపాయి అధిక విలువ కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో భారతీయ ఎగుమతులకు ప్రయోజనం చేకూరుతుంది. రూపాయి విలువను కాపాడేందుకు కరెన్సీ మార్కెట్లో ఆర్బీఐ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని రాజన్ అన్నారు. ప్రాథమిక ఆర్థిక సర్దుబాట్లకు ప్రతిస్పందనగా, కరెన్సీ విలువను పెంచేలా కేంద్ర బ్యాంకులు నిర్వహించడం మానుకోవాలని, స్వల్పకాలిక అస్థిరతను అరికట్టడానికి మాత్రమే చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. రూపాయిక్షీణత, అమెరికా డాలర్ బలపడటం, ఇతర ప్రపంచ ఆర్థిక అంశాలు సహజ మార్కెట్ ప్రతిస్పందనగా భావించాలని రాజన్ అన్నారు. ప్రపంచ కరెన్సీలను అమెరికా ఆయుధంగా మార్చుకునే అవకాశం ఉందని రాజన్ హెచ్చరిక.



ఇతర దేశాలపై ఆర్థిక సుంకాలు విధించడానికి అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకోవద్దని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కరెన్సీలపై పెరుగుతున్న ఈఆర్థిక యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంకర్లకు ఆందోళన కలిగిస్తోంది.

# డెంటా వాటర్ సక్సెస్‌ఫుల్ ఐపిఒ

**ముంబై, జనవరి 22:** వాటర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్ కంపెనీ డెంటా వాటర్ పబ్లిక్‌ఇష్యూ బిడ్డింగ్ మొదలైన క్షణాల్లో పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. బుధవారం ఉదయం దీని సబ్‌స్క్రిప్షన్ మొదలైంది. ఎన్ఎస్ఇ డేటా ప్రకారం, ఇష్యూలో భాగంగా 52.50 లక్షల షేర్లను ఆఫర్ చేయగా, 91.64,450 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి. ఈ కంపెనీ ఐపిఒ ద్వారా రూ.220.50 కోట్ల నిధుల్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా 75,00,000 తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. రూ.279-294ను ధరల శ్రేణిగా నిర్ణయించింది. బుధవారం ఉదయం ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కాగానే ఎన్ఐఐ కోటా నుంచి మంచి డిమాండ్ అందుకుంది. 10.46 గంటల సమయానికి ఎన్ఐఐ కోటా 2.6 రెట్లు సబ్‌స్క్రైబ్ కాగా, రిటైల్ పోర్షన్ 2.38 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. తన పబ్లిక్ ఇష్యూకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.66 కోట్లు సమీకరించింది. జనవరి 24 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉండనుంది. దీంతో మరిన్ని బిడ్లు దాఖలయ్యే అవకాశం ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక్క లాట్ కోసం రూ.14,700 వెచ్చించాలి. జనవరి 29న కంపెనీ షేర్లు లిస్టింగ్ కానున్నాయి. పబ్లిక్ ఇష్యూ ద్వారా వచ్చిన నిధుల్ని రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉపయోగించనుంది. 2016లో స్థాపించిన డెంటా వాటర్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్ ఇంజినీరింగ్, ప్రొడ్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ సేవల రంగంలో వ్యాపారాలు చేస్తోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.